www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

ప్రజాపక్షం
7th ANNIVERSARY
22nd October, 2025

నేల కూలిన టర్కీ విమానం
హసీనా కేసులో నేడు కోర్టు తీర్పు 02

సంపుటి 08, సంచిక: 342 | గురువారం | 13-11-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఎర్రకోట వద్ద పేలుడుకు జనవరిలోనే కుట్ర



- పలుమార్లు రెక్కీ నిర్వహించిన డాక్టర్ ముజమ్మిల్ గనై
- మొబైల్ ఫోన్ డేటాలో వెల్లడైన పలు కీలక విషయాలు
- ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు
- ఘటనతో సంబంధం ఉన్న మరో ఎరుపురంగు కారుకోసం గాలింపు చర్యలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో తవ్వేకొద్దీ సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. జనవరిలోనే పేలుళ్లకు కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల పోలీసులు వైట్‌కాలర్ టెర్రర్ మాడ్యూల్‌ను ఛేదించిన తర్వాత అరెస్టు చేసిన డాక్టర్ ముజమ్మిల్ గనై మొబైల్ ఫోన్ నుండి సేకరించిన డంప్ డేటాను విశ్లేషించారు. దీంతో కుట్రకు సంబంధించి సంచలన విషయాలు బయటపడ్డాయి. ఈ సం వత్సరం జనవరిలో ఎర్రకోట ప్రాంతంలో గనై అనేక సార్లు రెక్కీ నిర్వహించినట్లు తేలింది. గణతంత్ర దినోత్సవం నాడు చారిత్రాత్మక స్మారక చిహ్నాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి జరిగిన పెద్ద కుట్రలో భాగంగా ఈ రెక్కీలు నిర్వహించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఆ సమయంలో ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ తీవ్రతరం కావడంతో కుట్ర భగ్నమైనట్లు పోలీసులు తెలిపారు. జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్వత్–ఉల్–హింద్‌తో సంబంధాలున్న ఉగ్రవాద మాడ్యూల్‌ను పోలీసులు ఛేదించి, ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, కొన్ని గంటల తర్వాత ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంతం సమీపంలో నెమ్మదిగా కదులుతున్న కారులో భారీ పేలుడు సంభవించి 12 మంది మృతి చెందగా, అనేక మంది గాయపడిన విషయం విదితమే. జమ్ముకశ్మీర్,

తరువాయి 2లో

## పూర్తిగా కేంద్ర వైఫల్యమే

ఢిల్లీలో పేలుడు ఘటనపై మల్లికార్జున ఖర్గే విమర్శ

05



## బాధితులకు మోదీ పరామర్శ

ఢిల్లీ పేలుడు వెనుకున్న కుట్రదారులకు ప్రధాని నరేంద్ర మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కుట్రదారులను వదిలిపెట్టే సమస్యే లేదని, వారిని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. భూటాన్ పర్యటన ముగించుకుని ఢిల్లీకి వచ్చిన మోదీ, వెంటనే 'లోక్‌నాయక్ జై ప్రకాశ్ నారాయణ్ (ఎల్ఎన్‌జెపి) ఆసుపత్రి'కి వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ తరువాత ఢిల్లీ పేలుడు కుట్రదారులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సీనియర్ అధికారులు, వైద్యులు బాధితుల పరిస్థితిని, అందిస్తున్న చికిత్స వివరాలను ప్రధానికి వివరించారు.



## సామాజిక న్యాయం కోసం 18న సిపిఐ నిరసన ప్రదర్శనలు

దళితులు, మైనారిటీలపై దాడులను పాలకులే నివారించాలని డిమాండ్

**న్యూఢిల్లీ:** దళితులు, గిరిజన మహిళలు, మైనారిటీలపై దురాగతాలు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోరుతూ నవంబరు 18 వ తేదీన నిరసన ప్రదర్శనలు జరపాలని పార్టీకి చెందిన అన్ని శాఖలకు భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) పిలుపు ఇచ్చింది. సామాజిక న్యాయాన్ని అందించడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఈ ప్రదర్శనల సందర్భంగా తీవ్రంగా వ్యతిరేకించాలని బుధవారం

తరువాయి 12లో



## కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు

- ప్రజాధనంతో నిర్మించిన బ్యారేజీలను వినియోగంలోకి తెస్తాం
- కేంద్ర జలవనరుల సంఘంతో సమన్వయం చేసుకొని శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరణకు సన్నాహాలు చేస్తున్నాం
- రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
- కొత్త డిజైన్లు రూపొందించాలని నిపుణులకు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగాలైన మేడిగడ్డ,సుందిళ్ళ,అన్నారం బ్యారేజ్‌ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజాధనంతో నిర్మించిన ఈ బ్యారేజ్‌లను వినియోగంలోకి తెచ్చేందుకు , రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. కేంద్ర జలవనరుల సంఘంతో సమన్వయం చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల విషయమై రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, సలహాదారు ఆదిత్య నాథ్ దాస్, నీటిపారుదల ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర జలవనరుల సంఘం సూచనలను పరిగణనలోకి తీసుకుని కొత్త డిజైన్లను రూపొందించాలని నిపుణులను అదేశించినట్టు తెలిపారు. ప్రతిష్ఠాత్మక సంస్థలతో పాటు ఐఐటి అనుబంధ కంపెనీలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పుణేలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సిడబ్ల్యుపిఆర్ఎస్) ద్వారా జియో ఫిజికల్ ,హైడ్రాలిక్ టెస్ట్‌లు నిర్వహించి నష్టం విలువ అంచనా వేసి, పనుల పునరుద్ధరణకు అంకురార్పణ చుట్టబోతున్నట్లు ఉత్తమ్ వివరించారు. మేడిగడ్డ కూలిపోవడానికి ,సుందిళ్ళ, అన్నారం బ్యారేజ్ లలో లీకేజ్‌లకు తప్పుడు నిర్ణయాలు,సాంకేతిక లోపాలే ప్రధాన కారణమనే విషయాన్ని

తరువాయి 2లో



## నాగార్జున ఫ్యామిలీకి కొండా సురేఖ క్షమాపణ

నా వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటున్నానని ట్వీట్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ మంత్రి కొండా సురేఖ, ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబానికి క్షమాపణలు తెలిపారు. గతంలో తాను వారిపై చేసిన వ్యాఖ్యల పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ మంగళవారం అర్ధరాత్రి ట్వీట్ చేశారు. నాగార్జున కుటుంబాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని, తన వ్యాఖ్యల వల్ల వారు బాధపడి ఉంటే చింతిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను పూర్తిగా వెనక్కి తీసుకుంటున్నట్లు కొండా సురేఖ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే,

తరువాయి 12లో

## రూ.163 కోట్లు విడుదల చేయండి



ఎస్‌సి, మైనారిటీ గురుకులాల డైట్, అద్దె బకాయిలు, మధ్యాహ్నం భోజన బకాయిలపై ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎస్‌సి, మైనారిటీ గురుకులాల డైట్, అద్దె బకాయిలు, మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన బకాయిలు మొత్తం సుమారు రూ.163 కోట్లు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో బుధవారం ఆర్థిక శాఖ అధికారులు, గురుకులాల అధికారులతో డిప్యూటీ సిఎం సమీక్షా సమావేశం

తరువాయి 2లో

## అటవీ అధికారులపై దాడి

- దేవరకొండ మండలం గువ్వలగుట్ట అడవుల్లో ఉద్రిక్తత
- ఏడుగురు ఫారెస్ట్ సిబ్బందికి తీవ్ర గాయాలు
- ఆసుపత్రికి తరలింపు

ప్రజాపక్షం/దేవరకొండ



రాష్ట్రంలో పోడుభూముల సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. అటవీ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపణల నేపథ్యంలో కబ్జాలను తొలగించేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారుల బృందంపై గిరిజనులు

తరువాయి 12లో



## మన్నించండి మరోసారి పొరపాటు చేయను

బెట్టింగ్ యాప్ ప్రచారం కేసులో సిట్ ఎదుట నటుడు ప్రకాష్ రాజ్ హాజరు

ప్రజాపక్షం/హైదరాబాద్

బెట్టింగ్ యాప్ ప్రచారం కేసులో నటుడు ప్రకాశ్‌రాజ్ ప్రత్యేక దర్యాప్తు బృందం ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లోని సిఐడి కార్యాలయానికి వెళ్లారు. గంటపాటు సిట్ అధికారులు ఆయనను పలు కోణాల్లో ప్రశ్నించినట్లు సమాచారం. బెట్టింగ్ యాప్ స్కామ్ గురించి గతంలో ఇడి

తరువాయి 12లో

## అమెరికాలో ప్రతిభావంతులు లేరు

- నైపుణ్యంగల శ్రామికశక్తిని ప్రపంచ నలుమూలల నుంచి తెచ్చుకోవాల్సిందే
- మాట మార్చిన ట్రంప్
- హెచ్–1 బి వీసాలపై వైఖరికి సమర్థన



**న్యూయార్క్ :** ప్రపంచం నలుమూలలా ఉన్న ఉన్నతస్థాయి నైపుణ్యం, ప్రతిభను అమెరికాకు తీసుకురావాలని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. హెచ్–1 బి వీసాలపై ఆయన అనుసరిస్తున్న వైఖరిని సమర్థించుకుంటూనే కొన్ని రకాల నైపుణ్యం అమెరికాలో లేదని అన్నారు. హెచ్–1 బి వీసాలను టెక్ కంపెనీలు దుర్వినియోగం చేస్తూ స్థానిక అమెరికన్లకు ఉద్యోగాలు రాకుండా చేస్తున్నాయని, నైపుణ్యం లేని వారిని కూడా తెచ్చి పని చేయించుకుంటున్నారని ఆరోపణలు గుప్పించిన ట్రంప్ నైపుణ్యం పేరుతో మాట మార్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నైపుణ్యం అమెరికాలో కంపెనీల నిర్వహణకు ఎంతో

తరువాయి 12లో

## పక్షం ముందే పనులు పూర్తి

- గిరిజన పూజారుల సూచనల మేరకు పునరుద్ధరణ
- మేడారం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగనివ్వం
- మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



ప్రజాపక్షం/ములుగు

మేడారం మహా జాతర సందర్భంగా మేడారం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జాతరకు పక్షం రోజుల ముందుగానే అన్ని పనులను పూర్తి చేస్తామని, గిరిజన పూజారుల సూచనల మేరకే పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాష్ట్ర మంత్రులు సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి అభివృద్ధి పనులను మంత్రి శ్రీనివాస్ రెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాలం పాటు నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని, 25 రోజుల క్రితం పనులు ప్రారంభం కాగా ఆయా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకొని అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, 10 కోట్ల మంది భక్తులు వచ్చిన వారికి సరిపోయే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. మేడారంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఈ నెల 22న ముఖ్యమంత్రి సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఎంత డబ్బు ఖర్చు అయినా అభివృద్ధి కార్యక్రమాలను

తరువాయి 2లో

బిఆర్ఎస్ బిజెపిలు ఒక్కటైతే దేశానికి నష్టం
సమయపాలనను కఠినంగా అమలు చేయాలి
సివిల్స్ మెయిన్స్‌లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటాలి
తేమ, తరుగు, తాలు వంటి విషయాలలో రైతులను సతాయించొద్దు
03

## కాప్–30 సదస్సులోకి దూసుకెళ్ళిన ఆదివాసీలు



నిరసన, ఘర్షణలో భద్రతా సిబ్బందికి గాయాలు

**బెలెం:** వాతావరణ నియంత్రణ సాధనకు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం ప్రారంభమైన కాప్–30 సదస్సు ప్రాంగణంలోకి దేశీయ జాతుల ప్రజలు దూసుకువచ్చారు. మంగళవారం రాత్రి పొద్దుపోయాక దేశీయ ఆదివాసీలు నిరసన వ్యక్తం చేస్తూ భారీ భద్రతను అసాధారణ పద్ధతుల్లో ఛేదించుకుని లోనికి వచ్చారు. భద్రతా దళాలు వారికి అడ్డుకున్నాయి. దీంతో వారు ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణల్లో పలువురు గాయపడ్డారు. అనేక పదుల సంఖ్యలో పురుషులు, స్త్రీలు ఆదివాసీ జాతుల దుస్తులలో మెడలో అటవీ ఆభరణాలతో,

తరువాయి 2లో

## తేమ తెచ్చిన తంటా

సిసిఐ నిబంధనలతో పత్తి రైతు చిత్తు

- ధరలో కోతలు.. ఎకరాకు ఏడు క్వింటాళ్ల నిబంధనతో ఇక్కట్లు
- అంతర్ జిల్లా పత్తి విక్రయాలపై ఆంక్షలతో పరేషాన్
- చుక్కలు చూపిస్తున్న కపాస్ యాప్



ప్రజాపక్షం/హనుమకొండ

పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పెట్టిన నిబంధనలు పత్తి రైతుకు కంటికి కునుకులేకుండా చేస్తున్నాయి. దీంతో ప్రకృతి విపత్తులను ఎదుర్కొని కాపాడుకున్న పంటను మార్కెట్లో స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. తేమ నిబంధనతో మద్దతు ధరను కోల్పోతున్న రైతులు కపాస్ యాప్‌తో మరిన్ని కష్టాలను ఎదుర్కొంటున్నారు. పత్తి సాగు వివ రాల నమోదుతో పాటు సిసిఐ కొత్తగా ఏడు క్వింటాళ్ల నిబంధనను తెరపైకి తెచ్చింది. రైతులు పండించిన పత్తిని ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సిసిఐ కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని షరతు పెట్టింది. దీంతో సరిహద్దు జిల్లాల్లోని రైతులకు సమస్యగా మారింది. అన్ని జిన్నింగ్ మిల్లులకు బేల్ కు ఒకే ధర చెల్లిస్తూ

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇరాక్ ఎన్నికల్లో 55 శాతం పోలింగ్

ప్రభుత్వ ఏర్పాటు సంక్లిష్ట సమస్యే!

**బాగ్దాద్:** ఇరాక్ పార్లమెంటుకు ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఎన్నికల ఫలితాలు వెల్లడికావడానికి రంగం సిద్ధమైంది. ఈ ఎన్నికల్లో సుడానీ బ్లాక్ అందరికంటే ఎక్కువగా 50 సీట్లు గెలుచుకుంటుందని ముందస్తు అంచనాలు ఉన్నాయి. ఎన్నికల్లో 55 శాతం మేరకు పోలింగ్ జరిగింది. 329 స్థానాలున్న చట్టసభలో సభ్యులను ఎన్నుకునేందుకు మంగళవారం దాదాపు కోటి 20 లక్షలమంది ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. 2003లో సద్దాం హుస్సేన్ పతనం తర్వాత ఈ దేశంలో వరుసగా ప్రస్తుతం ఆరోసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ప్రభావవంతమైన మతాధికారి మొక్తదా అల్‌సదర్ ఎన్నికల బహిష్కరణకు పిలుపు ఇచ్చినప్పటికీ ప్రజలు భారీగానే ఓటింగ్‌లో పాల్గొన్నారు. 2021లో జరిగిన ఎన్నికల్లో 41 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఐతే ఏ ఒక్కపార్టీకి ప్రభుత్వ ఏర్పాటు చేయడానికి మెజారిటీ రాదని భావిస్తున్నారు. గతంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా ఏర్పడి ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి చర్చల ప్రక్రియకు ఏడాది సమయం పట్టింది.

# నేల కూలిన టర్కీ విమానం

20 మంది సైనికులు మృతి



**అంకారా:** టర్కీకి చెందిన కార్గో విమానం కూలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న 20 మంది సైనికులు మరణించారు. జార్జియాలో ఈ సంఘటన జరిగిందని టర్కీ రక్షణమంత్రి యాసెర్ గులెర్ బుధవారం ప్రకటించారు. సి–130 విమానం టర్కీకి తిరిగి వెళ్ళేందుకు అజర్‌బైజాన్‌లోని గంజా నుండి బయలుదేరింది. దారిమధ్యలో జార్జియాలోని సింఘ్‌నాఘి మున్సిపాలిటీ పరిధిలో రెండు వైపుల నుండీ పొగలు వెదజల్లుతూ విమానం కుప్పకూలిపోయింది. ఈ ప్రాంతం అజర్ బైజాన్ సరిహద్దులకు చాలా దగ్గరగా ఉంటుంది. ఐతే విమానం ఎందుకు కుప్పకూలిపోయిందన్న విషయం తెలియరాలేదు. ఆ విషయం తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు. టర్కీ ప్రమాదాల నియంత్రణ బృందం ఘటనాస్థలానికి చేరుకుని జార్జియా అధికారుల సహాయంతో దర్యాప్తు ప్రారంభించింది. విమాన శకలాలు అనేకచోట్ల చెల్లాచెదురుగా పడ్డాయి. కొన్ని శకలాలు వ్యవసాయ భూములో పడ్డాయి. ''ఎంతో సాహసవంతులైన మా జవాన్ కామ్రేడ్స్ నవంబరు 11వ తేదీన ప్రాణత్యాగం చేశారు, సి– 130 విమానంలో వెళుతుండగా వారు మరణించారు, జార్జియా–అజర్‌బైజాన్ సరిహద్దుల్లో ఈ ప్రమాదం సంభవించింది'' అని టర్కీ రక్షణమంత్రి గులెర్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. తొలుత మంగళవారంనాడు టర్కీ ప్రభుత్వ రేడియో ఒక ప్రకటన చేస్తూ, టర్కీ కార్గో విమానంతో తమ కేంద్రం సంబంధాలు కోల్పోయిందని జార్జియా ఎవియేషన్ అథారిటీ చెప్పిందని వార్త ప్రకటించింది. సి–130 కార్గో విమానాన్ని టర్కీ సైనికులు ఎక్కువగా ఉపయోగిస్తారు. టర్కీ–అజర్‌బైజాన్ సైన్యాల మధ్య సన్నిహిత సహకార సంబంధాలు ఉన్నాయి. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, ఇతర టర్కీ అధికారులూ అజర్‌బైజాన్ బాకులో ఈనెల 8వ తేదీన జరిగిన విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2020లో ఆర్మేనియాపై అజర్‌బైజాన్ సైన్యం గెలిచి విజయవంతంగా కరబాఖ్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంది. అంతర్జాతీయంగా ఈ ప్రాంతాన్ని నాగోర్నో–కరబాఖ్ సంఘర్షణగా పిలుస్తారు. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు ఈ ఘర్షణ కొనసాగింది. ఐతే ప్రమాదంలో మరణించిన సైనికులు ఈ విజయోత్సవంలో పాల్గొన్నారా? లేదా? అనే విషయం తెలియరాలేదు. అజర్‌బైజాన్, జార్జియా దేశాల అధ్యక్షులు, విదేశాంగమంత్రులు ఈ ప్రమాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# హసీనా కేసులో నేడు కోర్టు తీర్పు

బంగ్లాదేశ్‌లో హింస– హై అలర్ట్



**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా కేసు విచారణ చేస్తున్న అంతర్జాతీయ క్రైమ్ ట్రిబ్యునల్ (ఐసిటి) గురువారం తీర్పు ప్రకటించనున్నది. ఆమెకు ఉరిశిక్ష విధించాలని విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో హసీనాకు వ్యతిరేకంగా తీర్పు వస్తే సహించేది లేదని అవామీ లీగ్ పార్టీ తీవ్ర హెచ్చరిక చేసింది. గురువారం దేశంలో లాక్‌డౌన్ పాటిస్తామని హెచ్చరించింది. ఈ ఉద్రిక్త పరిస్థితులమధ్య ఢాకాలో హై అలర్ట్ ప్రకటించారు. నగరాన్ని భద్రతా దళాలు పూర్తిగా తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నాయి. గడచిన రెండు రోజులుగా దేశంలో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. బుధవారం నాడు కూడా హింస చెలరేగింది. బస్సులను దహనం చేశారు. దీంతో భద్రతా దళాలు ప్రధాన వీధుల్లో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. గస్తీని ముమ్మరం చేశాయి. సోమవారంనాడు పలుచోట్ల 17 నాటు బాంబు పేలుళ్ళు సంభవించాయి. దేశంలో అనేక చోట్ల హింస చెలరేగింది. తొమ్మిది వాహనాలు దగ్ధమయ్యాయి. ఢాకా శివారులోని గాజాపూర్, అశులియాలలో నాలుగు బస్సులను దుండగులు దగ్ధం చేశారు. అన్ని విమానాశ్రయాలలోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు ఢాకా విశ్వవిద్యాలయంలోని అనేక గేట్లకు బుధవారం తెల్లవారుజామునే తాళాలు పడ్డాయి. గేట్లకు పెద్ద పెద్ద అక్షరాలతో ''లాక్‌డౌన్'' అని బోర్డులు తగిలించారు. ఈ ఘటనలు జరిగే సమయంలో భద్రతా సిబ్బంది అందరూ వాష్‌రూమ్‌లలో ఉన్నట్లు సమాచారం. గేట్లకు తాళాలు వేసిన దృశ్యాలు ఫేస్‌బుక్‌లలో ప్రత్యక్షమయ్యాయి. కాగా బ్రాహ్మణ్ బారియా బిజోయ్‌నగర్ ఉపజిల్లాలోని చందుర ప్రాంతంలో గ్రామీణ బ్యాంకు భవనాన్ని కొందరు దహనం చేశారు. ఈ మంటల్లో ముఖ్యమైన పత్రాలన్నీ కాలి బూడిదయ్యాయి. ఇదిలా ఉండగా మరోవైపు తమ ఐదు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జమాతే ఇస్లామీ, ఇస్లామీ ఆందోళన్ బంగ్లాదేశ్ సహా ఆరు పార్టీలు ఉమ్మడిగా ఆందోళన చేపడుతున్నాయి.

**న్యాయబద్ధంగా ఎన్నికలు జరిపితే దేశానికి తిరిగొస్తా: హసీనా**

వచ్చే ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలను న్యాయబద్ధంగా నిర్వహిస్తే దేశానికి తాను తిరిగి వస్తానని, కోర్టు విచారణ ఎదుట కూడా హాజరవుతాననీ అజ్ఞాతంలో ఉన్న బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా అన్నారు. పిటిఐకి ఈమెయిల్ ద్వారా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, అందరి భాగస్వామ్యం ఉండేలా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తే తాను దేశానికి తిరిగి వస్తానని, ప్రజలు కూడా ఇదే కోరుకుంటున్నారని అన్నారు. ప్రస్తుత తాత్కాలిక దేశాధ్యక్షుడు ఉగ్రవాద శక్తులకు ఆశ్రయం ఇస్తున్నారని విమర్శించారు.

# 17 మిలియన్ డాలర్లు ఉక్రేన్‌కు జి–7 సహాయం

గాజా స్థిరత్వం సహా కీలక సమస్యలపై చర్చ

**నయాగరా–ఆన్–ద–లేక్ :** యుద్ధం వల్ల తీవ్రంగా నష్టపోయిన ఉక్రేన్‌లోని ఇంధన వనరుల సంరక్షణకు, మరమ్మతులకు వీలుగా17 మిలియన్ డాలర్లు సహాయాన్ని జి–7 సమకూర్చనున్నది. బ్రిటన్ విదేశాంగమంత్రి కూపర్ సమావేశానికి ముందుగానే ఈ విషయం ప్రకటించారు. ప్రపంచంలో ఏడు పారిశ్రామిక ప్రజాస్వామ్య దేశాల గ్రూపునకు చెందిన ఉన్నతస్థాయీ దౌత్యవేత్తల సమావేశం రెండు రోజులపాటు (మంగళ, బుధవారాలు) కెనడాలోని దక్షిణ ఆంటారియోలో జరిగింది. పలు ప్రపంచ వర్తమాన సమస్యలపై సంప్రదాయ మిత్రులుగా ఉన్న ఈ అగ్రదేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్న తరుణంలో ఈ కీలక సమావేశం జరుగుతున్నది. రక్షణ ఖర్చులు, వాణిజ్య సమస్యలతోపాటు గాజాలో డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 21 అంశాల ప్రాతిపదికపై కుదిరిన ఒప్పందంలో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితులమధ్య కెనడా విదేశాంగమంత్రి అనితా ఆనంద్ అసోసియేటెడ్ ప్రెస్‌కు బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. అనేక సమస్యల మధ్య సంబంధాలు కొనసాగుతాయన్నారు. అమెరికా నుండి వాణిజ్య పరమైన ఒత్తిడులు ఉన్నప్పటికీ ఈ సదస్సులో ఆయనకు కూడా ఆతిథ్యం ఇచ్చిన్నట్లు చెప్పారు. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోతోపాటు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాలకు చెందిన ఉన్నతస్థాయీ దౌత్యవేత్తలు ఈ రెండు రోజుల సమావేశంలో పాల్గొన్నారు. ''అనేక సంక్లిష్టమైన సమస్యలను తాము పరిష్కరిస్తున్నాం, అమెరికన్ల భద్రత, సంరక్షణ మొదటి ప్రాధాన్యత అనే ప్రాతిపదికపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి ప్రపంచంలో ఉన్న అనేక కీలక సమస్యలు పరిష్కరిస్తున్నామని మార్కో రుబియో సోషల్ మీడియా ద్వారా పోస్టింగ్ పెట్టారు. అదేవిధంగా అనితా ఆనంద్ కూడా ఆస్ట్రేలియా, బ్రెజిల్, భారత్, సౌదీఅరేబియా, మెక్సికో, దక్షిణ కొరియా, దక్షిణ ఆఫ్రికా,ఉక్రేన్ దేశాలకు చెందిన విదేశాంగ మంత్రులను ఈ సమావేశాలకు ఆహ్వానం పలికారు. మంగళవారం రాత్రి జరిగిన సమావేశంలో కీలక సమస్యపై చర్చకు ప్రాధాన్యం





ఇచ్చినట్లు అనితా ఆనంద్ చెప్పారు. పశ్చిమ ఆసియాలో స్థిరత్వం గురించి ప్రధానంగా చర్చించామని ఆమె అన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను కొనసాగించాలని, దానికి గౌరవించి ముందుకు తీసుకువెళ్ళాలని ఆమె అన్నారు. బుధవారం ఉదయమే దౌత్యవేత్తలు ఉక్రేన్ విదేశీమంత్రితో సమావేశం జరిపారు. ఉక్రేన్ నష్టపోయిన ఇంధన మౌలిక వనరుల మరమ్మతులు, రక్షణకు వీలుగా 17 మిలియన్ డాలర్లు (13 మిలియన్ పౌండ్లు) సహాయం జి–7 పంపుతున్నట్లు చెప్పారు. కెనడా కూడా ఇటీవల ఇలాంటి ప్రకటనే చేసింది.

# గాజాకు 116.62 బిలియన్ యూరోలు ఫ్రాన్స్ ఆర్థిక సహాయం

**పారిస్:** పాలస్తినా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ ఫ్రాన్స్‌లో పర్యటించి ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో ద్వైపాక్షిక సమావేశం జరిపారు. గాజాలో అభివృద్ధికి 116.62 బిలియన్ యూరోలు ఆర్థిక సహాయం అందజేస్తామని ఈ సందర్భంగా అబ్బాస్‌కు మేక్రాన్ భరోసా ఇచ్చారు. పాలస్తినాకు గుర్తింపు ఇస్తున్నట్లు పునరుద్ఘాటించారు. గడచిన సెప్టెంబరులోనే అనేక దేశాలు పాలస్తినాకు స్వతంత్రదేశంగా గుర్తింపు ఇచ్చాయి. అదేవిధంగా వెస్ట్‌బ్యాంక్‌ను ఆక్రమించడంపై ఇజ్రాయెల్‌కు ఒక హెచ్చరిక కూడా చేశారు. వెస్ట్‌బ్యాంక్‌లో సెటిలర్స్, ఇజ్రాయెల్ సైన్యం చేస్తున్న హింస పరాకాష్ఠకు చేరిందని విమర్శించారు. సహనంగా ఉండాలని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని మేక్రాన్ కోరారు. వెస్ట్‌బ్యాంక్‌లో గడచిన రెండు సంవత్సరాలుగా సెటిలర్స్, ఇజ్రాయెల్ సైన్యం హింసలో 1,036 మందికి పైగా పాలస్తీనియన్లు హతులయ్యారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ వైఖరిపై ఐక్యరాజ్యసమితి మండిపడింది. కీలకమైన ఆహార, ఇతర సరఫరాలను గాజాలోకి వెళ్ళనివ్వకుండా ఇజ్రాయెల్ సైన్యం అడ్డుపడుతోందని విమర్శించింది. ఒకవైపు గాజాలో శాంతి ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ ఇజ్రాయెల్ తన దాడులు కొనసాగిస్తూనే ఉంది. గాజాలో 2023 నుండి ఇప్పటివరకూ 69 వేల మంది పాలస్తీనియన్లు మరణించారు. తాజాగా బుధవారం జరిపిన దాడుల్లో ముగ్గురు పాలస్తీనియన్లు హతులయ్యారు.

## పనులు పూర్తి (మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తూనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గిరిజన సాంప్రదాయాలకు అనుగుణంగా అమ్మవార్ల గద్దెల ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని, అన్ని పనులను పూర్తి చేసి రానున్న మేడారం మహా జాతరను విజయవంతం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని, గతంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలను నేటి ప్రజా ప్రభుత్వం చేస్తుందని వివరించారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, రాష్ట్ర పండుగగా గుర్తించిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అనుకున్న సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలోనే అమ్మవార్ల గద్దెల ప్రాంతం నుండి పాదయాత్ర ప్రారంభించారని, నేడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికి అమ్మవార్లను దర్శించుకొని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ దేవుళ్ళ ప్రాంతాలలో ప్రతిపక్ష నాయకులు రాజకీయం చేయడం తగదని, చిత్తశుద్ధితో పనులు చేస్తున్న తమపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని అన్నారు. తమ గిరిజనుల సాంప్రదాయ పద్ధతి ప్రకారమే గద్దెల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, గతంలోనే పాలకులు అభివృద్ధి కార్యక్రమాల పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. గిరిజనుల అస్తిత్వం, ఆత్మగౌరవానికి విలువలు ఇస్తూనే పనులు కార్యక్రమాన్ని చేపట్టామని, మరో వారం రోజుల్లోగా గద్దెల ప్రాంతం ఒక రూపానికి వస్తుందని వివరించారు. భక్తులు విశ్వాసం నమ్మకంతో అమ్మవార్లను దర్శించుకోవడానికి వస్తున్నారని, వారి విశ్వాసం దెబ్బ తినకుండా ఆదివాసీల అస్తిత్వం కాపాడుకుంటు పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామన్, ఎండోమెంట్ కమిషనర్ హరీష్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి డాక్టర్ శబరీష్, డిఎఫ్ఓ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విడుదల చేయండి (మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ఎస్‌సి, గురుకులాలు, హాస్టళ్లు ఇతర సంస్థలకు సంబంధించిన డైట్, అద్దె, కాస్మోటిక్స్ బకాయిలకు సంబంధించిన రూ.51.36 కోట్లు విడుదల చేయాలని డిప్యూటీ సిఎం ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. వీటితోపాటు రాష్ట్రంలోని అన్ని మైనారిటీ గురుకులాలు మైనారిటీ విద్యాసంస్థలకు సంబంధించిన డైట్, అద్దె బకాయిలు రూ.47.61 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.63.92 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో, వైవిధ్యంతో కూడిన ఆహారాన్ని అందించాలనే సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గురుకులాలు, వసతి గృహ విద్యార్థుల డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు రూ.200 పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్వహకులు నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పూర్తిస్థాయిలో పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంస్థల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను సమీక్షించేందుకు అధికారులు నిర్దేశిత క్యాలెండర్ ప్రకారం సందర్శించాలని సూచించారు.సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

## అధికారులపై దాడి (మొదటి పేజీ తరువాయి)

తిరగబడి కర్రలు, రాళ్లతో దాడిచేశారు. ఈ ఘటన బుధవారం నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలం గువ్వలగుట్ట అటవీ ప్రాంతంలో జరిగింది. ఈ ఘర్షణలో ఏడుగురు ఫారెస్ట్ సిబ్బంది తీవ్రంగా గాయపడగా వారిని దేవరకొండ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘర్షణ సమాచారం అందుకున్న చందంపేట పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన అధికారుల ఫిర్యాదు మేరకు గిరిజనులపై కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

## జనవరిలోనే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో విస్తరించి ఉన్న ఉగ్రవాద మాడ్యూల్‌ను పోలీసు లు ఛేదించిన తర్వాత సుమారు 2,500 కిలోగ్రాముల అమ్మోనియం నైట్రేట్, పొటాషియం క్లోరేట్, సల్ఫర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండ గా, ఎర్రకోట సమీపంలో పేలుడు జరిగిన ప్రదేశం నుండి దాదాపు 40 నమూనాలను సేకరించిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), ప్రాథమిక విశ్లేషణ ప్రకారం పేలుడు నమూనాలలో అమ్మోనియం నైట్రేట్ ఉండవచ్చని భావిస్తున్నారు. వాటిలో రెండు గుళికలు, లైవ్ మందుగుండు సామ గ్రి, రెండు వేర్వేరు రకాల పేలుడు పదార్థాల నమూనాలు ఉన్నాయి. గనై డంప్ డేటా విశ్లేషణలో జనవరి మొదటి వారంలోనే ఎర్రకోట, చుట్టుపక్కల ప్రాంతాల్లో ముజమ్మిల్ పదే పదే రెక్కీ నిర్వహించినట్లు తేలిందని ఓ సీనియ ర్ పోలీసులు అధికారి చెప్పారు. సోమవారం పేలిన కారును నడుపుతున్న అల్‌ఫలాహ్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమర్ నబీతో పాటు, భద్రతా ఏర్పాట్లు, జన సాంద్రత నమూనాలను అధ్యయనం చేయడానికి డాక్టర్ ముజమ్మిల్ ఎర్రకోటను అనేకసార్లు సందర్శించారన్నారు. టవర్ లొకేషన్ డేటా, సమీప ప్రాంతాల నుండి సేకరించిన సిసిటివి ఫుటేజ్ ద్వారా వారి కదలికలు ధృవీకరించబడ్డాయని చెప్పారు. ఫరీదాబాద్ నుండి 360 కిలోగ్రాముల అమ్మోనియం నైట్రేట్ స్వాధీనం చేసుకున్న సోమవారం జరిగి న దర్యాప్తులో వెల్లడైంది. అక్కడ అల్‌ఫలా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్ట ర్ ముజమ్మిల్ గనై, డాక్టర్ షాహీన్ సయీద్‌లను అరెస్టు చేశారు. పేలుడు తర్వాత ఢిల్లీ పోలీసులు దేశ రాజధాని అంతటా భారీ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని అన్ని ప్రవేశ, నిష్క్రమణ పాయింట్ల వద్ద పోలీసు సిబ్బంది, పారామిలిటరీ దళాలను పెద్ద సంఖ్యలో మోహరించారు. భద్రతా చర్యలలో భాగంగా నగరంలోకి ప్రవేశించే, బయలుదేరే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఘాజీపూర్, సింఘు, తిక్రి, బదర్‌పూర్‌తో సహా అంతర్రాష్ట్ర సరిహద్దులలో భద్రతా తనిఖీలను సీనియర్ పోలీసు అధికారులు వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. మార్కెట్లు, మెట్రో స్టేషన్లు, రైల్వే టెర్మినల్స్, బస్టాండ్లలో వాహనాలను యాదృచ్ఛికంగా తనిఖీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని జిల్లా యూనిట్లు, ప్రత్యేక విభాగాలు అప్రమత్తంగా ఉండాలని, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచాలని ఆదేశించినట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. సున్నితమైన ప్రదేశాలలో స్నిఫర్ డాగ్‌లు, మెటల్ డిటెక్టర్లు, యాంటీసాబోటేజ్ బృందాలను రంగంలోకి దింపారు.

**ఎరుపురంగు కారు కోసం ముమ్మర గాలింపు**

ఎర్రకోట పేలుడు కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును గుర్తించేందుకు ఢిల్లీ పోలీసులు దేశ రాజధానిలోని అన్ని పోలీస్ స్టేషన్లు, పోస్టులు, సరిహద్దు చెక్‌పోస్టులలో అలర్ట్ ప్రకటించారు. ఇప్పటికే పేలుడులో ఉపయోగించిన హ్యుందాయ్ ఐ 20 కారును గుర్తించగా, ఈ ఘటనలో సంబంధం ఉన్న ఇతర అనుమానితులు ఎరుపు రంగు కారును కలిగి ఉన్నారని దర్యాప్తులో వెల్లడైందని, దీంతో ఢిల్లీలో అలర్ట్ జారీ చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. వాహనాన్ని గుర్తించడానికి ఢిల్లీ పోలీసుల కనీసం ఐదు బృందాలను నియమించగా, పొరుగున ఉన్న ఉత్తరప్రదేశ్, హర్యానా పోలీసులు కూడా నిఘాను కొనసాగించాలని, తనిఖీల్లో సాయం చేయాలని అప్రమత్తం చేశారు.

**కార్ డీలర్‌ను అదుపులోకి తీసుకున్న స్పెషల్ సెల్**

ఎర్రకోట పేలుడు కేసుకు సంబంధించి ఫరీదాబాద్‌కు చెందిన కార్ డీలర్‌ను స్పెషల్ సెల్ అదుపులోకి తీసుకుంది. ఢిల్లీ, పరిసర రాష్ట్రాలలోని అన్ని సెకండ్ హ్యాండ్ కార్ డీలర్‌లను ఇటీవలి వాహన అమ్మకాల వివరాలను తెలియజేయాలని ఆదేశించినట్లు అధికారులు బుధవారం తెలిపారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ఫరీదాబాద్ సెక్టార్ 37లోని రాయల్ కార్ ప్లాజా యజమాని అమిత్‌ను సోమవారం రాత్రి ఫరీదాబాద్ పోలీసుల సహాయంతో అదుపులోకి తీసుకున్నారు. ఎర్రకోట సమీపంలో సోమవారం జరిగిన శక్తివంతమైన పేలుడులో ఉపయోగించిన హ్యుందాయ్ ఐ20 అమ్మకానికి అతను సహకరించాడని ఆరోపణలు ఉన్నాయి.

## పునరుద్ధరణ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ,న్యాయ కమిషన్‌లు స్పష్టం చేశాయని గుర్తు చేశారు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ పై కుడా ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అర్హత కలిగిన స్వతంత్ర సాంకేతిక సంస్థలను నియమించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.తాజాగా కురిసిన భారీ వర్షాలతో నీరు చేరుకుందని,15 నుండి 20 రోజులలో నీరు తగ్గిన వెంటనే పరీక్షలు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా మొదట ఐదు సంస్థలను ఎంపిక చేసి అందులో మూడింటిని ఫైనల్ చేస్తామని, డ్యామ్ సేఫ్టీ రంగంలో అనుభవం కలిగి ఉండడంతో పాటు సాంకేతిక సంస్థలతో అనుభందం కలిగి ఉన్న సంస్థలనే ఫైనల్ చేస్తామని అన్నారు.

**పునరుద్ధరణ వ్యయం ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలదే**

పునరుద్ధరణ వ్యయం మొత్తం ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆయా సంస్థలే భరించాల్సి ఉంటుందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన అనుభవాల దృష్ట్యా ప్రజా ఆస్తుల పరిరక్షణ నిమిత్తం నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పునరుద్ధరణ పనులు చేపట్టబోతున్నట్లు చెప్పారు. డిజైన్ లోపాలు, పనుల నిర్లక్ష్యం ,ఆర్థికంగా జరిగిన అవకతవకలను జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో స్పష్టం చేసిందన్నారు. ఇదే విషయంలో విచారణ నిర్వహించిన విజిలెన్స్ శాఖ, సంబంధిత అధికారులతో పాటు కాంట్రాక్టర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసిందని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సమ్మక్కసారక్క, సీతమ్మ సాగర్,సీతారామ సాగర్,చనకాకోరాట, దేవాదుల,చిన్న కాళేశ్వరం, ఎస్.ఎల్.బి.సి హెలిబోర్న్ సర్వే, డిండిలతో పాటు జూరాల వద్ద నిర్మించ తల పెట్టిన ప్రత్యమ్నాయ బ్రిడ్జి సింగూర్ కాలువ లైనింగ్ పనులను ఉత్తమ్ సమీక్షించారు.

# తేమ తెచ్చిన తంటా

(మొదటి పేజీ తరువాయి)

ఎల్1, ఎల్2, ఎల్ 3 విదానాన్ని ప్రవేశ పెట్టడంపై జిన్నింగ్ మిల్లర్లు సీసీఐపై మండిపడుతున్నారు. పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తామని హెచ్చరికలకు దిగుతున్నారు. సీసీఐ నింబంధనల తీరుతో రైతుల పంట విక్రయాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఆరుగాలం శ్రమించిన పంటను మార్కెట్లో స్వేచ్ఛగా అమ్ముకునే హక్కు కూడా లేదా? అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ సీజన్లో 5,14,904 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా, 4,11,923 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అష్టకష్టాలు పడి పత్తిని కాపాడుకున్న రైతులపై అక్టోబరు చివ రలో వచ్చిన తుఫాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పత్తి తీసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న క్రమంలో వచ్చిన తుఫాన్ రైతులకు కన్నీళ్లను మిగిల్చింది. ఈ ప్రకృతి విపత్తును సైతం కొందరు రైతులు నిలదొక్కుకుని మిగిలిన పత్తిని అమ్ముకుందామంటే మార్కెట్లో సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా సీసీఐ పూటకో నిబంధనను తీసుకువచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. 8 నుంచి 12శాతం కంటే తేమ మించితే మద్దతు ధర ఇవ్వటం లేదు. ప్రస్తుతం తుఫాన్ తోపత్తి పంట మొత్తం నీట మునిగింది. ఇళ్లలో ఆరబెట్టినప్పటికీ పత్తికి కూడా వరుస వర్షాలతో నిమ్ము చేరింది. పత్తిని ఎండలో ఆరబెడతామంటే మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలో సీసీఐ 8 నుంచి 12 శాతం తేమ నిబంధన రైతులకు శాపంగా మారింది. వాతావరణంలోనే తేమ పెరిగి ఉందని, అలాంటప్పుడు 12శాతం లోపు తేమతో పత్తిని మార్కెట్కు తీసుకరావటం ఎలా సాధ్యమని రైతులు ప్రశ్నిస్తున్నారు. తేమ పేరుతో సీసీఐ అధికారులు మద్దతు ధరలో కోత పెడుతుండటంతో రైతులు ఇబ్బం ది పడుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తేమ శాతాన్ని 18 నుం చి 30 శాతానికి పెంచాలని రైతులు చేస్తున్న విజ్ఞప్తిని సీసీఐ పట్టించుకోవ టం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వ్యాపారులు రైతుల నుంచి క్వింటాల్కు రూ.5వేల నుంచి రూ.7వేల వరకే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

**జిన్నింగ్ మిల్లర్లతో కొర్రీలు**

పత్తి విక్రయానికి వచ్చినప్పటి నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండి యా(సీసీఐ) తీసుకువస్తున్న నిబంధనలు రైతుకు గుదిబండగా మారుతు న్నాయి. పత్తి కొనుగోలు ప్రక్రియకు ముందే జిన్నింగ్ మిల్లులతో సీసీఐ పంచాయితీకి దిగింది. పాత నిబంధనలను మార్చటంతో మిల్లులను సీసీఐకి అద్దెకు ఇచ్చేందుకు జిన్నింగ్ మిల్లుల యాజయాన్యాలు నిరాకరించా యి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రత్యేక చొరవ తో జిన్నింగ్ మిల్లుల పంచాయితీ ఓ కొలిక్కివచ్చినట్టే వచ్చినా.. మళ్లీ సీసీఐ కొర్రీలతో మొదటికి వస్తోంది. తెలంగాణాలో మొత్తం 322 జిన్నింగ్ మిల్లు లు ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 56 మిల్లులను గుర్తించారు. ఒక పత్తి బేల్కు రూ.1,440లు చెల్లించేందుకు మిల్లు యాజమానులతో సీసీఐ. ఒప్పందం చేసుకుంది. అక్టోబరు చివరివారంలో సీసీఐ ద్వారా కొనుగోళ్లను ప్రారంభించింది. అయితే జిన్నింగ్ మిల్లులను సీసీఐ ఎల్1, ఎల్2, ఎల్3 పేరిట వర్గీకరించింది. కపాస్ యాప్లో తొలుత ఎల్1 మిల్లుల జాబితానే సీసీఐ ప్రదర్శిస్తోంది. ఆ మిల్లుల్లో సామర్థ్యం పూర్తయితే ఎల్2కు, ఆ తరు వాత ఎల్3 మిల్లులకు అవకాశం ఇస్తోంది ఈ విధానంపై జిన్నింగ్ మిల్ల ర్లు అభ్యంతరం చెప్పుతున్నారు. రైతులు తమ ప్రాంతంలో ఉన్న సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునే అవకాశాన్ని చేజార్చుకుంటున్నారని మిల్లర్లు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా మిల్లుల సామర్థ్యాన్ని బట్టి జాబ్ వర్క్ టెండర్లు ఇవ్వలేదని, అన్ని మిల్లుల్లో బేల్కు ఒకటే ధర చెల్లిస్తు న్నారని, అలాంటప్పుడు మిల్లుల వర్గీకరణ ఎందుకని, అన్ని మిల్లుల్లో కొనుగోళ్లు ఒకేసారి చేపట్టాలని జిన్నింగ్ అండ్ కాటన్ ఇండస్ట్రీ అసోసియే షన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్రెడ్డి డిమాండ్ చేశారు.

**అంతర్ జిల్లా పత్తి విక్రయాలపై ఆంక్షలు**

రైతులపై సీసీఐ మరో నిబంధన బాంబు పేల్చింది. గతంలో రైతులు తమ పంటలను విక్రయించుకునేవారు. అయితే సీసీఐ కొత్త నిబంధన ప్రకారం రైతులు తమ ఉమ్మడి జిల్లా పరిధిలోనే పత్తి పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. ఆ విధంగా కపాస్ యాప్లో నిబంధనలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు పక్కనే ఉన్న కరీంనగర్, ఖమ్మం తదితర జిల్లాల్లో పత్తిని అమ్ము కునే అవకాశం లేకుండా పోయింది. దీంతో సరిహద్దులో ఉన్న మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల రైతులు ఏటా పత్తిని 25కిలో మీటర్ల దూరంలో ఉన్న కరీంన గర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కు తీసుకెళ్లి విక్ర యిస్తారు. సీసీఐ కొత్త నిబంధనతో ఈసారి జమ్మికుంటలో మొగుళ్లపల్లి రైతులు పత్తిని విక్రయించే అవకాశం లేకుండా పోతోంది. వరంగల్ వ్యవసాయ మార్కెట్కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి కూడా పత్తి అమ్మకానికి వస్తుంది. కొత్త నిబంధన రైతులకు శాపంగా మారిందనే విమర్శలున్నాయి. అలాగే సీసీఐ చర్యలతో పత్తి కొనుగోళ్లపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖమ్మం జిల్లాలో 7లక్షల బేల్ సామర్థ్యం ఉన్న 8జిన్నింగ్ మిల్లులే ఉన్నాయి. వరంగ ల్లో 10లక్షల బేల్ సామర్థ్యం ఉన్న 56 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఖమ్మంలో జిన్నింగ్ మిల్లులు ఫుల్ అయితే సీసీఐ 7 కొనుగోళ్లపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో కొను గోళ్లు నిలిచిపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని జిన్నింగ్ మిల్లర్లు పేర్కొం టున్నారు. అంతర్ జిల్లాల్లో పత్తి అమ్మకాలపై సీసీఐ అంక్షల పెట్టడంపై రైతులు తీవ్ర నిర సన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని.. అరుగాలం శ్రమించి సాగు చేసిన పత్తిని తమకు నచ్చిన చోట అమ్ముకునే స్వేచ్ఛ లేకుండా పోతోందని అన్నదాతలు వాపోతు న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ నిబంధనలపై దృష్టి పెట్టి రైతులపై భారం పడకుండా స్వేచ్ఛగా తమ పంటను అమ్ముకునేలా చూడాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**చుక్కలు చూపిస్తోన్న కపాస్ యాప్**

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కపాస్ యాప్ కూడా రైతులకు చుక్కలు చూపిస్తోంది. వ్యవసాయ అధికా రులు ముందస్తుగా రైతులకు ఈ యాప్పై అవగాహన కల్పించలేదు. దీంతో నేరుగా స్మార్ట్ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకుని, పంట వివరాలను నమోదు చేయడం ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్య నుంచి బయటపడే లోపే మొన్నటివరకు ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేసే నిబంధనకు సీసీఐ ఆంక్షలు విధించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా దిగుబడి తగ్గిందనే సాకుతో ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతులు విక్రయించుకునే విధంగా కపాస్ యాప్ లో నిబంధనలను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా కౌలు రైతులు, పట్టాబుట్లు లేని రైతులు సీసీఐకి పత్తిని అమ్ముకోవటంలో సమస్యలు ఎదురవుతున్నాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## హైదరాబాద్‌లో విదేశీయుల వ్యభిచార ముఠా గుట్టురట్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చదువు పేరుతో విదేశాల నుంచి వచ్చిన యువతులతో హైదరాబాద్‌లో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు ప్రధాన నిందితుడు డేరియస్‌తో పాటు నలుగురు విదేశీ మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ హాఫీజ్‌పేట్‌లోని సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో రహస్యంగా వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసు లు ఆ ఇంటిపై దాడి చేసి తనిఖీలు చేపట్టగా, అక్కడ విదేశీ మహిళలతో వ్యభిచారం జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఈ రాకెట్‌ను లైబీరియా దేశానికి చెం దిన డేరియస్(28) నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇతడు 2021లో స్టూడెం ట్ వీసాపై భారత్‌కు వచ్చి, స్థానికంగా ఓ కళాశాలలో ఆన్‌లైన్‌లో చదువుకుంటున్నాడు. కెన్యా, ఉగాండా దేశాలకు చెందిన మహిళలతో ఇతడు ఈ దందాను నడిపిస్తున్నట్లు విచారణలో తేలింది.



- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- వరంగల్‌లో జిల్లాస్థాయి జనసేవాదళ్ శిక్షణ శిబిరాలు ప్రారంభం

# పెట్టుబడిదారీ వ్యవస్థకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

**ప్రజాపక్షం/ వరంగల్ :** కమ్యూనిస్టులే పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వరంగల్ నగరంలోని ఓ సిటీ మైదానములో జిల్లాస్థాయి జనసేవదళ్ శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా శిబిరాలను తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడి వ్యవస్థకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, దానికి ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు నిలబడుతున్నారన్నారు. భారత దేశంలో రానున్న కాలంలో మతోన్మాద, పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లనుందన్నారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం పోరాడిన చరిత్ర సిపిఐది అని, భారత దేశ గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నదని, ఈ ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించినటు వంటి పార్టీగా సిపిఐ ప్రజల హృదయాలలో నిలిచిపోయిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం అంతరా లు లేని సమాజం కోసం, భూ సంస్కరణలు అమ లు కోసం, పీడిత, తాడిత ప్రజలకు అండగా వెట్టి చాకిరి విముక్తికై, బానిసత్వానికి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, దున్నేవానికే భూమి నినాదంతో దొరల గడిలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సిపిఐదన్నారు. అధికారం లేకున్నా పేద ప్రజల పక్షాన నిలబడి వారికోసం, వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని, ఇందుకోసం ప్రతి జనసేవాదళ్ కార్యకర్త వాటి విజయవంతానికి విధిగా పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాల సందర్భంగా ఈనెల 18,19 తేదీలలో సిపిఐ బస్ జాతా జరుగనుందని, ఈ బస్ జాతలో పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మ ణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్, బుస్స రవీందర్, సంగీ ఏలేందర్, కందిక చెన్నకేశవులు, ఐయిత యాకుబ్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, ఎండి అక్బర్ పాషా, దామెర కృష్ణ, పరికరాల రమేష్, భవాని తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్, బిజెపిలు ఒక్కటైతే దేశానికి నష్టం

మరణంలేని సిద్ధాంతమే కమ్యూనిజం
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** బిఆర్‌ఎస్, బిజెపి ఒకటైతే దేశానికే నష్టమని, కమ్యూనిస్టులను అంతంచేయడం ఎవరితరంకాదని , మరణంలేని సిద్ధాంతమే కమ్యూనిజం అని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మ ణచారి భవనంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశానికి సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడు తూ సర్వమానవులు సమానంగా ఉండాలన్నదే సిపిఐ సిద్ధాంతమని, భారతగడ్డపై కార్మికుల పక్షా న పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. పోరాటాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ వంద సంవత్సరాలు పూర్తిచేసుకోవడం గర్వకారణమన్నారు. బిజెపి పెరిగితే ధనికులు పేదవారు అనే తారతమ్యభేదాలు పెరుగుతాయని, భారత్‌మాతాకి జై అంటే నే హిందువులని , క్రిస్టియన్స్, ముస్లింలు హిందువులుకాదని ఆరోపణలు చేయడం ఆర్‌ఎస్‌ఎస్ ని నాదం అన్నారు. దేశంలో మోదీ, మన్మోహన్‌సిం గ్, ఇందిరాగాంధీ దేశ పునాదులు రాజకీయ పునాదులను సర్వమత సమ్మేళనం ఉండటం భారతదేశానికి దక్కుతుందని ఆయన గుర్తు చేశారు. భారతదేశం మోదీ హయాంలోని అభివృద్ధి చెందిందని ప్రగల్భాలు పలుకుతున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఎలాంటి పునాది లేకుండానే అభివృ ద్ధి ఎలా సాధ్యమని ఆయన విమర్శించారు. సిపిఐ భావజాలాలని రాజ్యాంగంలో పొందుపర్చారని ప్రస్తుతం దేశంలో దున్నేవాడిదే భూమి, మహిళల కు 33శాతం రిజర్వేషన్లు వంటి అనేక మార్పులకు శ్రీకారం చుట్టింది సిపిఐ అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల్‌నర్సింహ్మ మా ట్లాడుతూ వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేస్తున్న బహిరంగసభను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా సమితి సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వహయాంలో పేదలు ఇండ్లకోసం అనేక ఇబ్బందులుపడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా పేదలకు ఇల్లు కేటాయించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇతర పథకాల సబ్సిడిలు కూడా అందడంలేదని ఆయన గుర్తుచేశారు. మొంథా తు ఫాన్‌వల్ల జిల్లాలో పత్తిరైతులు తీవ్రంగా నష్టపోయారని ఎకరాకు రూ.50వేల రూపాయలు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్‌చేశారు. సిసిఐ తేమపేరుతో రైతులను ఇబ్బందిపెడుతున్నారని, అధికారులు మార్పు చెందకపోతే రైతులపక్షా న సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్, మహబూబ్‌నగర్ జిల్లాకార్యదర్శి బాలకిషన్, గద్వాలజిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయరాములు, నారాయణపేట జిల్లా కార్యదర్శి నర్సింహ్మా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, వార్లవెంకటయ్య, ఎఐటియూసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, దళితహక్కుల పోరాటసమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్, పాల్గొన్నారు.





తేమ, తరుగు, తాలు వంటి విషయాలతో
# రైతులను సతాయించొద్దు

రాత్రి, పగలు పనిచేసి ధాన్యం కొనుగోలును సవ్యంగా పూర్తిచేయాలి
మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** అకాల వర్షాలు ,తుఫాన్ వల్ల ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఏర్పడ్డాయని, ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున అవసరమైతే లైట్లు ఏర్పాటు చేసి అధికారులు, రైస్ మిల్లర్లు రాత్రి, పగలు పనిచేసి ధాన్యం కొనుగోలును సవ్యంగా పూర్తిచేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. బుధవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధాన్యం, పత్తి సేకరణ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల రోజుల పాటు కొనుగోలు కేంద్రాలకు దాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ధాన్యం సేకరణను పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని, మిల్లర్లు రైతులను ఏలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ధాన్యం అన్లోడ్ చేసుకోవాలని,ఈ విషయంలో రైతులకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తేమ, తరుగు, తాలు వంటి విషయాలతో రైతులను సతాయించవద్దని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లులలో నైట్ షిఫ్టు ఏర్పాటు చేసి హమాలీలు పనిచేసే విధంగా చూడాలని, రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా ధాన్యం సేకరణలో రెండవ స్థానం పొందినదని, దీన్ని దృష్టిలో ఉంచుకొని కొనుగోలును సవ్యంగా చేయాల్సిందిగా కోరారు. పత్తి కొనుగోలపై మంత్రి సమీక్షిస్తూ సిసిఐ నిబంధనల సడలింపుకు సంబంధించి ఇదివరకే కేంద్ర ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా నిర్ణయం తీసుకోవాల్సిన అంశాలు ఉన్నాయని, పత్తి కొనుగోలు విషయంలో ఇదివరకే మిల్లర్లతో మాట్లాడటం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఈ వానాకాలంలో జిల్లాలో 6,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నదని ధాన్యం కొనుగోలు ప్రారంభమవుతున్నాయని,తుఫాను వల్ల ధాన్యం సేకరణకు ఇబ్బంది కలిగిందని,అయినప్పటికీ 40 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేయడం జరిగిందని, ఈ సీజన్‌లో ఒక్కరోజు రూ.36 కోట్లు చెల్లించిన దాఖలాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో తుఫాను వల్ల తడిసిన 4600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడం జరిగిందని, జిల్లాలో గోదాం సమస్యను దృష్టిలో ఉంచుకొని పెద్ద వేర్ హౌస్ గోదాం నిర్మాణం అవసరమని, సైలో సిస్టంలో గోదాము ఏర్పాటు చేయాల్సి ఉందని మంత్రికి విజ్ఞప్తి చేశారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేష్, జిల్లా మేనేజర్ గోపికృష్ణ, డిఆర్‌డిఒ శేఖర్ రెడ్డి, డిసిఒ పత్యా నాయక్, ఆర్‌డిఒ వై.అశోక్ రెడ్డి, మార్కెటింగ్ ఎడి ఛాయా దేవి, రైస్ మిల్లర్లు నారాయణ, భద్రం, ఇంద్రసేనా రెడ్డితదితరులు పాల్గొన్నారు.

# సమయపాలనను కఠినంగా అమలు చేయాలి

మంత్రి తు మ్మల నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమయానికి విధులకు హాజరుకాని అధికారుల పట్ల వ్యవసాయ, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అసహనం వ్యక్తం చేశారు. సమయపాలనను కఠినంగా అమలు చేయాలని, విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని హాకా, సీడ్ సర్టిఫికెట్ కార్పొరేషన్ ,సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హ్యాండ్లూమ్‌టెక్స్‌టైల్ ప్రధాన కార్యాలయాలను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు బుధవారం ఆసక్మీకంగాతనికీ చేశారు. సమయపాలన పాటించని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమయపాలన పాటిస్తుండగా, రెగ్యులర్ ఉద్యోగులలో ముఖ్యంగా జనరల్ మేనేజర్, మేనేజర్ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విధులకు హాజరుకాని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల కమిషనర్లు, ఎండీలకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ఉన్నత స్థాయి అధికారులు నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ సమయపాలన పాటిస్తూ, ప్రజాసేవలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని తుమ్మల సూచించారు.



# సివిల్స్ మెయిన్స్‌లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటాలి

- మెయిన్స్‌కు ఎంపికైన 43 మంది తెలంగాణ అభ్యర్థులకు భట్టి అభినందనలు
- రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం కింద 342 అభ్యర్థులకు రూ.3.61 కోట్ల ఆర్థిక సాయం

**ప్రజాపక్షంట/హైదరాబాద్:** సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం ద్వారా లబ్ధి పొందిన 43 మంది మెయిన్స్‌కు ఎంపిక కావడం అభినందనీయమని, వారు ఇంటర్వ్యూలలోనూ సత్తా చాటి తెలంగాణ ప్రతిష్టను దేశవ్యాప్తం చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గత ఏడాది ఈ పథకాన్ని ప్రారంభించగా ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 342 మంది తెలంగాణ యువత రూ.3.62 కోట్ల ఆర్థిక సహాయాన్ని సింగరేణి సంస్థ ద్వారా పొందారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడంలో భాగంగా సివిల్స్ మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఎంపికైన వారికి రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని ప్రారంభించి ప్రతి దశలో లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని అందులో 43 మంది విద్యార్థులు సివిల్స్ ఇంటర్వ్యూకు ఎంపికకయ్యారని, వారికి మరో లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు ఢిల్లీలో వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గొప్ప సంకల్పంతో 2024 లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయాసం పథకాన్ని ప్రారంభించగా మొదటి ఏడాది 140 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారని, 20 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కాగా అందులో ఏడుగురు సివిల్ సర్వీసెస్ సాధించి వివిధ హోదాల్లో స్థిరపడడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్థిక సహకారం అందించిన సింగరేణికి గర్వకారణమన్నారు.

### అభ్యర్థులకు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు

తెలంగాణ రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. యుపిఎస్‌సి మెయిన్స్ 2025 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. సివిల్స్ సాధించే లక్ష్యంతో సన్నద్ధమయ్యేందుకు పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు గత ఏడాది రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది కూడా ఈ పథకం కింద సింగరేణి సంస్థ అధ్వర్యంలో 202 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 43 మంది తాజాగా యుపిఎస్‌సి మెయిన్స్ ఫలితాల్లోనూ విజేతలుగా నిలిచారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ గతేడాది మాదిరిగా ఈసారి కూడా ఇంటర్వ్యూలకు సన్నద్ధం అయ్యేందుకు మరో లక్ష రూపాయల ప్రోత్సాహకం అందించనున్నట్లు సిఎం కార్యాలయం తెలియజేసింది.

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ
# బలోపేతం చేస్తున్నాం

రాష్ట్ర గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్



**ప్రజాపక్షం/జైపూర్ :** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల గదులను కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేసి సకల సౌకర్యాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగించుకుని ఏకాగ్రతతో విద్య అభ్యసించి ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో మంచి నైపుణ్యం పొందాలని, ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన విద్య అందించేందుకు 51వేల మంది ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. రెండు కోట్ల 5 లక్షల రూపాయల సిఎస్‌ఆర్ నిధులతో అదనపు గదులు నిర్మించడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు 15రోజులలో ప్రతిపాదనలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య, విద్యా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. రెండు కోట్ల 5 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన జూనియర్ కళాశాల అదనపు గదులలో తరగతి గదులు, పరిపాలనా విభాగం, ల్యాబ్ ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య 3 శాతం పెరిగిందని, ఈ విద్యా సంవత్సరంలో 6 వేల నుండి 7 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా 41 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న
# సమస్యలు పరిష్కరించాలి

మంత్రి పొన్నంకు తెలంగాణ గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటు న్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ కోరారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ ప్రతినిధి బృందంలో తెలంగాణ గీత పని వారల సంఘం కేంద్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని నాగభూష ణం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవిఎల్, రాష్ట్ర కార్యదర్శి ఎం.ప్రవీణ్ కు మార్ గౌడ్ ఉన్నారు. 'గీతా కార్మికుల సమస్యల' పరిష్కారానికి తె లంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22న హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేయనున్న రాష్ట్ర సదస్సుకు మంత్రి పొన్నంను బొమ్మగాని ప్రభాకర్ ప్రతినిధి బృందం ఆ హ్వానించింది. ఇందుకు మంత్రి అంగీకరించినట్టు ఆయన తెలిపారు.

# నియంతగా వ్యవహరిస్తున్న ఒయు విసి

- ప్రశ్నిస్తున్న విద్యార్థులపైన కేసులను నమోదు చేసి, ఒయును ఒక నిర్బంధ కేంద్రంగా మార్చారు
- 'పిహెచ్‌డి- 2025' సంబంధించిన సమస్యలు పరిష్కరించకుండా ఏకపక్షంగా అడ్మిషన్లు ప్రక్రియ
- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టలక్ష్మ ణ్ మండిపాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీలో ప్రజాస్వామ్య చర్చలకు, సమా వేశాలకు, సభలను నిర్వహించుకునేందుకు 'హాల్స్'కు అనుమతి ఇవ్వకుండా ఒయు విసి నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టలక్ష్మ ణ్ మండిపడ్డారు. ప్రశ్నిస్తున్న విద్యార్థులపైన కేసులను నమోదు చేసి, ఒయును ఒక నిర్బంధ కేంద్రంగా మార్చారని మండిపడ్డారు. ఒయు విసి పాలన ఒక నియంతృత్వ, అహంకారపూరిత ధోరణితో కొనసాగుతోందన్నారు. ఎఐఎస్ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ కౌన్సిల్ సమావేశం ఆర్ట్స్ కళాశాలలో బుధవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తూ ఒయు విసి నిషేధాజ్ఞలతో విద్యార్థుల హక్కులకు చరమగీతం పాడారన్నారు. 'పిహెచ్‌డి2025' అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించిన సమస్యలను పరిష్కరించకుండా ఏకపక్షంగా కేవలం కొంతమంది విద్యార్థులకు లబ్ధి చేకూరే విధంగా అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టారన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో గత విసి ప్రొఫెసర్ రవీందర్ అవలంభించిన విద్యార్థి వ్యతిరేక విధానాలను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒయు విసి ప్రొఫెసర్ కుమార్ మొలగరం సరిదిద్దుతారని అందరూ ఆశిస్తే, అందుకు భిన్నంగా విద్యార్థులను, ప్రొఫెసర్లను, ఉద్యోగులను పరస్పరం కలవకుండా, ఒయులో గడిల పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్రలో భాగంగా పిజి, పిహెచ్‌డి, ఇంజనీరింగ్, ఎల్.ఎల్.బి ఎల్‌ఎల్‌ఎం ఇతర కోర్సుల ఫీజులను పెంచారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన ఫీజులను తగ్గించలేదని మండిపడ్డారు. తాజా అసిస్టెంట్లు ప్రొఫెసర్ల పదోన్నతులలో ఉద్దేశపూర్వకంగా కొంతమందికి పదోన్నతులు ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. విసి ఇప్పటికైనా నియంతృత్వ విధానాలు విడనాడి, ఉస్మానియా యూనివర్సిటీ సమస్యలను పరిష్కరించకపోతే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని పుట్ట లక్ష్మ ణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఒయు కౌన్సిల్ అధ్యక్షులు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య, సహాయ కార్యదర్శులు ఉప్పల ఉదయ్ కుమార్, సాయి భగత్ నాయకులు అశ్వన్,మధు,రమేష్, సుమన్, గోండి రామ్ గణేష్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.


నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య: U40109TG2000SGC034119
టెండర్ నోటీసు నం. 15/2025-26
(i) ఖమ్మం సర్కిల్, సత్తుపల్లి డివిజన్‌లోని కిష్టారం (V) వద్ద ఉన్న SCCL నివాస కాలనీకి సెమీ టర్న్‌కీ ప్రాతిపదికన సరఫరా పొడిగింపు.
పనుల వివరాలు మరియు ఇతర సమాచారాన్ని మా వెబ్‌సైట్ www.tgnpdcl.com నుండి పొందవచ్చు
సం/- చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), TGNPDCL, వరంగల్.
DIPR R.O. No. : 10504-PP/CL/ADVT/1/2025-26, Date: 12-11-2025

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
NIT No. 40, పని పేరు: జిహెచ్‌ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో నీటి స్తబ్దతను తొలగించడానికి క్రాసింగ్ అందించడం మరియు ఉపరితల రాతి కట్టింగ్‌తో crs మెట్లతో cc రోడ్డు వేయడం వంటి 2 పనుల కోసం. అంచనా విలువ / ఇసివి: రూ.9.30లక్షలు, డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం: 13.11.2025న మ.2.30గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 17.11.2025న మ.2.45గం.ల వరకు. ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్‌ఎంసి. సెల్ నెం.9989930608. ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (ఆర్‌జెఎన్‌ఆర్), జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 10520-PP/CL/ADVT/1/2025-26, Date: 12-11-2025

## మంచి ప్రవర్తన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : సమాజంలో మంచి ప్రవర్తన కలిగి ఉండాలని డీసీపీ అక్షాంశ్ యాదవ్ రౌడీషీటర్లకు సూచించారు. ప్రతినెల రౌడీషీటర్లకు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్లో బుధవారం జిల్లాలోని రౌడీషీటర్లకు మంచి ప్రవర్తన పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ రౌడీ షీటర్ తన ప్రవర్తన మార్చుకొని ప్రజలతో మమేకంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడే సేవలు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో పాల్గొన్న కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి రాహుల్ రెడ్డి, పట్టణ సీఐ రమేష్, చంద్రబాబు, అర్జునయ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రూప మృతి కాంగ్రెస్‌కి తీరని లోటు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే దుబ్బ రూప అకాల మృతి బాధాకరమని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇటీవల మృతి చెందిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప చిత్రపటానికి బుధవారం మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బ రూప కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సేవలో అహర్నిశలు కృషి చేశారని మంత్రి గుర్తుచేశారు.ఆమె మృతి పార్టీకి, ఆమె కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్ గౌడ్ ఉన్నారు.



## సిఐటియు నుండి ఎఐటియుసిలోకి చేరికలు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (మఠంపల్లి)** : మఠంపల్లి మండలం రఘునాధ పాలెం గ్రామంలో పలువురు కార్మిక నాయకులు సిఐటియు జిల్లా కమిటి సభ్యులు సయ్యద్ రనుమియా సిఐటియు నుండి ఏఐటియుసిలో చేరారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ వారిని సాధరంగా ఆహ్వానించి ఏఐటియుసి కండువాలను కప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పైన నిరంతరం పోరాటం చేయాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందన్నారు. స్థానిక సిమెంట్ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గ్రామీణ కార్మికులు, హమాలీ సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయితీ కార్మికులకు కనీస వేతన సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐటియుసి మండల అధ్యక్షులు సన్నగండ్ల చిన్నజాను నాయకత్వంలో గ్రామ పంచాయితీ కార్మికులు కందుకూరు నాగమణి, కందుకూరి వెంకటేశ్వర్లు, సామేలు, పూల సంఘం నాయకులు కందుకూరి మోష, కాటేపల్లి యేసు, కోటయ్య, విశ్వరాజుల రంగరాజు, గోపిశెట్టి చెంచయ్య తదితరులు ఏఐటియుసిలో చేరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉప్పతల నాగయ్య, పొందుగల జాన్లు, చనగండ్ల పెద్దజాను, పొందుగల చందు, బూసినేటి సాంబశివ, పాల సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

## కెజిబివిలో విద్యుత్ నిర్లక్ష్యం...



**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : మండలంలోని కంచనపల్లి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో గత మూడు రోజులుగా కరెంటు లేక వాటర్ రాకుండా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాలను సందర్శించి ఎస్ఓతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యుత్ సౌకర్యం లేకుండా విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే డీఈవోకి, ఎంఈఓకి ఫోన్లో మాట్లాడడానికి ప్రయత్నం చేస్తే ఎత్తకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారిపైన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఓ లోపటికి వెళ్లడానికి పర్మిషన్ ఇవ్వలేదని ఇప్పటివరకు తాత్కాలికంగా కరెంట్ పనులు పూర్తి జరిగాయని ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ, జిల్లా నాయకులు తరుణ్, మండల నాయకులు చేరుకు నాని, సాయి, బన్నీ పాల్గొన్నారు.

## మాల ధారణ తీసేసి బడికి రావాలే

### పలివెల పాఠశాలలో ఆంజనేయ స్వామి మాల ధారణ బాలుడికి అవమానం



**ప్రజాపక్షం/మునుగోడు:** ఆంజనేయస్వామి మాలధరించిన 10వ తరగతి విద్యార్థిని ఆంజనేయస్వామి మాల బట్టలు ఇంటిదగ్గర పెట్టి స్కూల్ యూనిఫామ్ వేసుకొని రావాలని తెలుగు ఉపాధ్యాయుడు ఆంజనేయ స్వామి మాల ధరించిన బాలుని అవమానించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని పలివెల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మాల ధరించిన బాలుడిని మాల బట్టలు తీసేసి స్కూలు యూనిఫామ్ వేసుకొని రావాలని చెప్పడంతో ఆ గ్రామంలో మాల ధరించిన అంజనేయ స్వాములు స్కూల్ ఆవరణంలో హిందూ మతాన్ని హేళన చేసి హిందూ ధర్మాన్ని అవమానపరిచేలా మాట్లాడిన ఉపాధ్యాయుని పై చర్యలు తీసుకోవాలని క్షమాపణ చెప్పాలని ఆంజనేయస్వామి భక్తులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఆంజనేయ స్వామి భక్తులతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడి సర్ది చెప్పి క్షమాపణ చెప్పారు.

## బిఆర్ఎస్‌ను తిట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏం చేస్తోంది?

### ఎమ్మెల్సీ కవిత



**ప్రజాపక్షం/నల్లగొండ:** బిఆర్ఎస్ పాలన బాగాలేదని తాము అధికారం లోకి వస్తే మంచి పాలన అందిస్తామని బిఆర్ఎస్ ను తిట్టి తిట్టి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం చేస్తుందని తెలంగాణ జాగృతి అధ్య క్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించింది. తెలంగాణ వచ్చాక మన నీళ్లు మనకు వస్తాయని అందరం అనుకున్నాం.కానీ నల్లగొండ జిల్లాకు కృష్ణా నీళ్లు పూర్తి స్థాయిలో వచ్చాయో లేదో అందరం ఆలోచించాలన్నారు. బుధవారం నల్లగొండలోని మనోరమ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడుతూఎస్ఎల్ బీసీ,నక్కలగండి,డిండి ప్రాజెక్ట్ లతో జిల్లాకు నీళ్లు రావాలి కానీ జిల్లాకు నీళ్లు అంటే కృష్ణానది మీదనే ఎక్కువ ఆధారపడాల్సిన పరిస్థితి మరి బిఆర్ఎస్ పదేళ్లు,కాంగ్రెస్ రెండేళ్లు పన్నెండేళ్లలో కృష్ణానది నీళ్లు తెచ్చుకున్నామా ఆలోచన పరులు ఆలోచించాలన్నారు. బిఆర్ఎస్‌ను ఇదే అంశంలో విమర్శించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా ఎందుకు పనులు చేయటం లేదు అని ప్రశ్నించారు.ఇప్పటికైన కృష్ణా నది నీళ్లు తేవటంలో సీఎం రేవంత్ రెడి ఇలాగే అలసత్వం వహిస్తే నిర్వాసితులతో కలిసి ఆయన ఇంటి ముందు ధర్నా చేస్తాం అని హెచ్చరిచారు. నల్లగొండ జిల్లా అంటేనే ఎంతో చరిత్ర కలిగిన జిల్లా అని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాలు,ప్రజాఉద్యమాలు, విప్లవాత్మక ఆలోచనలు కలిగిన ప్రాంతమన్నారు. ఈ సందర్భంగా నల్లగొండప్రభుత్వసుపత్రిలో ప్రసూతి వార్డ్‌కు వెళ్లడం జరిగిందని అక్కడ ఒక్కో బెడ్ మీద ఇద్దరు పేషెంట్లను,పిల్లలను పడుకోబెట్టారని డాక్టర్లు, నర్సుల ఓపికకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని సౌకర్యాలు లేకపోయినా వారు పని చేస్తున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/గరిడేపల్లి** : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజల మేలుకోరి పేదవారు కడుపు నిండా తినేలా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నూతనరేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందజేస్తున్నామని వివరించారు. గరిడేపల్లి మండలంలో పలు రోడ్ల నిర్మాణాలకు మంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు. గడ్డిపల్లి గ్రామంలో గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల వరకు రూ. 8.28 కోట్లతో బిటి డబల్ రోడ్డు నిర్మాణ పనులకు, పొనుగోడు గ్రామంలో పొనుగోడు పాతబస్టాండ్ నుండి మెయిన్ రోడ్డు వరకు రూ. 50 లక్షలతో నిర్మించే 700 మీటర్ల రోడ్డుకు, పొనుగోడు గ్రామం నుండి అప్పన్నపేట వరకు రూ.3.15 కోట్లతో 4.5 కి.మీ.ల బిటి రోడ్డు నిర్మాణానికి, మల్లయ్యగూడెం గ్రామంలో మల్లయ్య గూడెం నుండి పాత నేరేడుచర్ల వరకు రూ.70లక్షలతో నిర్మించే బిడి రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గరిడేపల్లి మండల కేంద్రంలో గరిడేపల్లి నుండి అలింగాపురం వరకు 15.5 కి.మీ. దూరాన్ని రూ.30కోట్లతో నిర్మించిన డబుల్ బిటి రోడ్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఈ రోడ్డు కి.మీ.కు రూ.2కోట్ల చొప్పున మొత్తం రూ.30కోట్లతో నాణ్యతతో నిర్మించామని అన్నారు. రైతులు ట్రాక్టర్స్ కెజివీల్స్‌తో రోడ్డుపై వెళ్ళకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని కోరారు. గరిడేపల్లి మండలంలో రూ.200కోట్లతో గడ్డిపల్లిలో యంగ్ ఇండియా రెసిడెన్సీయల్ స్కూల్, కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిని, పలు రోడ్లు నిర్మించి గరిడేపల్లి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంతకుముందు పొనుగోడు చెరువులో ఉచిత చేపల పంపిణీ పథకాన్ని ప్రారంభించి చేప పిల్లలను చెరువులోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పి కె నరసింహ, ఆర్‌డిఓ శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య, పిఆర్ ఈఈ వెంకటయ్య, డిఈ రమేష్, మత్స్యశాఖ అధికారి నాగులు నాయక్ పాల్గొన్నారు.

### అన్నదాతలకు అండగా ఉంటాం

అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన గరిడేపల్లి మండలం, గడ్డిపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. మొంథా తుఫాన్ వల్ల రాష్ట్రంలో అధిక వర్షాలు కురవడంతో ధాన్యం తడిచిందని, తడిచిన ధాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.



## 14 నుండి జిల్లా గ్రంథాలయ వారోత్సవాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : జిల్లా గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 14 నుండి 20 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 14న భారతదేశపు మొట్టమొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, 15న పుస్తకాల ప్రదర్శన, రీడింగ్ అవర్, 16న గ్రంథాలయ అవగాహన కార్యక్రమం, 17న ధ్యానం, వ్యక్తిత్వ వికాస, సైబర్ నేరాల నివారణ కార్యక్రమం, 18న చిత్రలేఖన పోటీలు, నా గ్రంథాలయం నాకు ప్రోత్సా హం, 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జ యంతి ఉత్సవాలు, ముగ్గుల పోటీలు, ఆటలు, 20న అక్షరాస్యత దినోత్సవం, వారోత్సవాల ము గింపు సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదా నం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపా రు. ఉత్సవాలకు విద్యార్థులు, పట్టణ పుర ప్ర ముఖులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## పారదర్శకమైన పాలనకు సమాచార హక్కు చట్టం

### రాష్ట్ర సమాచార కమిషనర్ పోరెడ్డి అయోధ్య రెడ్డి




**ప్రజాపక్షం/యాదాద్రి** : సమాచార హక్కు చట్టం RTI2005ను పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులు, సహాయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం పై రాష్ట్ర సమాచార కమిషనర్ల ఆధ్వర్యంలో పీఐవో, అపిలేట్ అధికారులకు చట్టం పట్ల నిర్వహించిన అవగాహన సదస్సులో సమాచార కమిషనర్లు దేశాల భూపాల్, పి.వి శ్రీనివాస్ రావు, మోసినా పర్వీన్, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డిసిపి అక్షాంక్ష్ యాదవ్, ఏసిపి రాహుల్ రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా RTI కమిషనర్ అయోధ్య రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద సమాచారం అడిగిన వాళ్లను దోషిగా చూడాలని లేదన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగిన సమాచారం తప్పకుండా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరికి సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగే హక్కు ఉందన్నారు. పాలనలో పారదర్శకత కోసమే 2005లో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో 41బి చార్ట్‌ను తప్పనిసరిగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించి ఏమీ లేని విధంగా చెయ్యాలనే ఉద్దేశంతో జిల్లాలో పర్యటిస్తున్నామని 15 జిల్లాలో పర్యటించి అప్పటికప్పుడే పరిష్కారం అయ్యే విధంగా చేస్తున్నామన్నారు. 6(1) కింద దరఖాసుదారుడు కోరిన సమాచారం అందించాలన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. జిల్లా కలెక్టర్ హనుమంత రావు మాట్లడుతూ సమాచార హక్కు చట్టం నిజాయితీగా, పారదర్శకంగా, నిష్పక్షికంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కమిషన్ పని చేస్తుందన్నారు. సమాచారం కోరిన వ్యక్తికి నిర్దేశిత వ్యవధిలో కాకుండా ముందుగానే సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లాలోని అందరూ పీఐవో అధికారులు యాక్ట్ నిబంధనల ప్రకారం సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం కమిషనర్లను శాలువ, మెమొంటోలతో కలెక్టర్ సత్కరించారు. సమావేశ అనంతరం పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ దరఖాస్తులపై విచారణ నిర్వహించారు. సంబంధిత పీఐవో అధికారులు, దరఖాస్తుదారుల నుండి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, ఆర్డిఓ కృష్ణా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, వివిధ శాఖల పిఐఓలు, ఏపిఐఓలు, అప్పిలేట్ అధికారులు పాల్గొన్నారు.



## 17న డిండికి బస్సుజాత : పల్లా

**ప్రజాపక్షం/డిండి:** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ 100 ఏళ్ల ముగింపు బహిరంగ సభకు పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం డిండి సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల సమితి సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ సిపిఐ వందేళ్ళ ముగింపు బహిరంగ సభ ఖమ్మంలో జరగనుందని, రాష్ట్ర వ్యాప్తంగా 3 జాతలు బయలుదేరింది ఉన్నాయని నవంబర్ 15 నుండి ప్రారంభమయ్యే ప్రచార జాతలు రాష్ట్ర వ్యాప్తంగా తిరగనున్నాయని నల్గొండ జిల్లాలో 17 నుండి ప్రవేశించనుందని ఈ జాతకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నర్సింహా, సిపిఐ ఎంఎల్సీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లికంటి సత్యం ఆధ్వర్యంలో నవంబర్ 15న గద్వాల నుండి ప్రారంభమై 17న డిండి కి చేరనుందని తెలిపారు. గ్రామశాఖలో ప్రధానంగా మహిళలు, రైతులు, యువకులు, విద్యార్థుల్ని భాగస్వామ్యం అయ్యేలా కమిటిలను ఏర్పాటు చేయాలని సూచించారు.సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లే శైలేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనొద్దిన్, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి విజయేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు రవీంద్రశర్మ, హుస్సేన్, కేశవులు, శ్రీనయ్య, వెంకటేశ్వర్లు, లచ్చయ్య, శాఖ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, శివ, చక్రి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్ పాల్గొన్నారు.

## వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం 2025 వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ విసి చాంబర్లో బుధవారం మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవ వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించి సీనియర్ సిటిజన్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. నవంబర్ 12 నుండి 19 వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు పోస్టర్లను ఆవిష్కరించడం, 2వ రోజు జిల్లా స్థాయిలో వృద్ధుల చట్టాలపై ఆరోగ్యం, చురుకైన వృద్ధాప్యం పై అవగాహన కార్యక్రమం చేపట్టాలన్నారు. 3వ రోజు వృద్ధాశ్రమాల్లో ఆటల పోటీలు వినోద కార్యక్రమాలు, 4వ రోజు వాకథాన్ సీనియర్ సిటిజన్స్ హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు. 5వ రోజు జిల్లా స్థాయిలో వయో వృద్ధుల చట్టం 2007 పై అవగాహన ఏర్పాటు చేయాలని, 6వ రోజు గ్రామస్థాయిలో సర్పంచ్, ఇతర ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలు, ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, 7వ రోజు జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఎవరికైనా ఏమైనా సమస్యలు ఉంటే 14567 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో వయోవృద్ధుల కొరకు ఉచిత వైద్య శిభిరాలు నిర్వహించాలని సీనియర్ సిటిజన్ యాక్ట్‌పై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సూర్యాపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. 1 నవంబర్ 2025 నుండి 31 జనవరి 2026 వరకు బాల్య వివాహాల నిర్మూలనకై 100 రోజుల ప్రచారోద్యమం గోడ పత్రికను ఆవిష్కరించారు. బాల్యవివాహాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే చైల్డ్‌లైన్ 1098కు తెలియజేయాలని విషయాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె నరసింహారావు, వయో వృద్ధుల కమిటి మెంబర్స్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, సభ్యులు, జి విద్యాసాగర్, ఎస్‌డి హమీద్‌ఖాన్, బోళ్ళ రాంబాబు, గజ్జల కృష్ణారెడ్డి, కిరణ్మయి, జావీద్‌ఖాన్, వినోద్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి అన్నారు. పట్టణంలోని 28వ వార్డు జెజె నగర్ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజలకు తాత్కాలిక ఇబ్బందులు ఉంటాయని ఇందుకుగాను ప్రజలు సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా ఎవరూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరిస్తూ, డివియేషన్ లేకుండా నిర్మాణాలు జరపాలని సూచించారు. రోడ్లపై ర్యాంపులు నిర్మించడం చట్టవిరుద్ధమని, ఈ విషయంలో అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, శానటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, వార్డు ఆఫీసర్ నస్రత్ ఫాతిమా, హెల్త్ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.

## బ్యాంకర్లు సహకరించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎం స్వామిది సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రుణాల విషయంలో బ్యాంకర్లు సహకరించాలని మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.15వేలు రుణం అయిపోయిన తరువాత రూ.25వేలు ఆ తరువాత రూ.50వేల రుణాలు వీధి విక్రయదారులకు విదిగా సమయానికి రుణాలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా మున్సిపల్ సిబ్బంది బకాయిలో ఉన్న లోన్లు విషయాలు కూడా పూర్తిగా రికవరి చేయాలన్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఉన్న వీది విక్రయదారులు అర్హత ఉండి ఇంకా అప్లయ్ చేసుకోని వారు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా సెక్షన్‌లో అప్లయ్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా కోఆర్డినేటర్ కె.శివాజీనాయక్, టీఎంసీ బక్కయ్య, సీవోలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సతీష్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.



# ఖరీదైన బైకులే లక్ష్యంగా దొంగతనాలు..

### ఇద్దరు నిందితులు అరెస్టు... 26 బైకులు స్వాధీనం..
### తప్పులు చేస్తే ఏనాటికైనా జైలు శిక్ష తప్పదు : ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : జలసాలకు అలవాటు పడి డబ్బుల కోసం ఖరీదైన బైకులే లక్ష్యంగా దొంగతనాలు చేస్తున్న ఇద్దరి నిందితులను సూర్యాపేట 2వ పట్టణ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 20లక్షల విలువైన 26 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్‌పి వెల్లడించారు. సూర్యాపేట 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖమ్మం ఎక్స్ రోడ్డులో బుధవారం తెల్లవారుజామున సుమారు 6 గంటల సమయంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్ తన టీంతో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ఒక వ్యక్తి అనుమానాస్పదంగా వెళ్తుండగా, అతనిని తనిఖీ చేయడం జరిగిందన్నారు. అతని ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్వర్క్ సిస్టం ద్వారా అతని యొక్క వేలిముద్రలు తనిఖీ చేయగా వేమూరి కృష్ణపై సుమారు 150 బైక్ దొంగతనాల కేసులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా సూర్యాపేట పట్టణంతోపాటు ఖమ్మం, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా పరిధిలో, హైదరాబాద్, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని పలు ప్రాంతాలలో ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేసినట్లు మొత్తం 26 మోటార్ సైకిళ్ళను దొంగలించినట్లు ఒప్పుకున్నట్లు చెప్పారు. తనతోపాటు నకిరేకల్‌కు చెందిన శివకుమార్ అనే వ్యక్తితో కలిసి దొంగతనాలు చేసినట్లు అంగీకరించారు. శివకుమార్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో సెక్యూరిటి గార్డు పనిచేస్తూ, చుట్టు పక్కల వారికి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వాహనాల రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నానని నమ్మించి ప్రజలను మభ్యపెడుతూ ఇతరులకు బైకులను అమ్మేవారని తెలిపారు. వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 26 బైక్‌లు స్వాధీనం చేసుకొని కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. నేరాలకు పాల్పడితే ఎంతటి వారికైనా జైలు శిక్షలు తప్పవని చట్టం నుండి ఎవరు తప్పించుకోలేరని పౌరులు చట్టానికి లోబడి నేరాలకు పాల్పడకుండా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో డిఎస్‌పి ప్రసన్న కుమార్, ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐ సురేష్, పట్టణ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఢిల్లీ పేలుడు అంశంపై చర్చకు పార్లమెంటరీ ప్యానెల్ నో

**న్యూఢిల్లీ :** ఎర్రకోట సమీపంలో పేలుడు అంశం బుధవారం నాడిక్కడ జరిగిన హోం వ్యవహారాలపై పార్లమెంటరీ స్థాయీ కమిటీ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. అయితే దీనిపై చర్చించేందుకు చైర్‌పర్సన్ నిరాకరించారు. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం, ఢిల్లీ పేలుడు ఘటనలో 12 మంది మృతి చెందిన అంశాన్ని లేవనెత్తేందుకు తృణమూల్ కాంగ్రెస్ ఎంపి ఒకరు ప్రయత్నించారు. ఇంటెలిజెన్స్ వైఫల్యంపై ఆందోళన వ్యక్తం చేసారు. అయితే అంశంపై చర్చ చేపట్టేందుకు కమిటీ చైర్‌పర్సన్ రాధా మోహన్ దాస్ నిరాకరించారు. దీనిపై సుమోటో ప్రకటన చేసేందుకు కూడా నిరాకరించారు. విపత్తు నిర్వహణ ఎజెండాపై పార్లమెంటరీ కమిటీ బుధవారం నాడు సమావేశమైంది. దీనిపై తమ అభిప్రాయాలు చెప్పేందుకు హోం మంత్రిత్వ శాఖ, నేషనల్ డిజాస్టర్ మేనేజిమెంట్ అథారిటీ (ఎన్‌డిఎంఎ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజిమెంట్ (ఎన్ఐడిఎం), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ క్యాంప్, హోం గార్డ్స్ డిజిలు హాజరయ్యారు.

## ఢిల్లీ పేలుళ్ళ మృతులకు.. ఐక్యరాజ్యసమితి అధిపతి గుటెర్రెస్ సంతాపం



**న్యూయార్క్:** ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు విస్ఫోటనంలో మృతులకు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్ర సంతాపం తెలియజేశారు. ఈ ఘటనలో గాయపడివారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయీ దర్యాప్తు జరపాలని ఆయన కోరారు. ''ఎర్రకోటవద్ద జరిగిన తీవ్రమైన ఘటనపై మేం కూడా సంతాపాలు భారత ప్రభుత్వానికి, ప్రజలకు తెలియజేస్తాం, కానీ ఈ కేసులో పూర్తి విచారణ జరపాలి'' గుటెర్రెస్ తరపున ఆయన అధికార ప్రతినిధి ఫర్హాన్ హక్ పేర్కొన్నారు. న్యూయార్క్‌లో ఆయన మీడియాతో మాట్లాడినప్పుడు పాత్రికేయులు పాకిస్థాన్‌లో జరిగిన ఆత్మాహుతి బాంబు దాడి గురించి కూడా ప్రశ్నించారు. ''నన్ను ఏం చెప్పమంటారు? ఆత్మాహుతి దాడి వార్త విన్న తర్వాత ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఇప్పటికే చాలా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు, వారి కుటుంబ సభ్యులకు, గాయపడిన వారికి కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు'' అంటూ సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. ''ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి చాలా కఠినమైన పదజాలంతో ఈ బాంబుదాడులను తీవ్రంగా ఖండించారు, ఉగ్రవాదులు, వారికి దన్నుగా ఉన్నవారిని జవాబుదారీ చేయాలి, ఈ కేసులలో పూర్తి దర్యాప్తు జరపాలి'' అని చెప్పారు.

## ఉగ్రదాడికి కారణం చెప్పాలి



కేంద్రాన్ని డిమాండ్ చేసిన కర్నాటక సిఎం సిద్ధరామయ్య

**బెంగళూరు :** దేశంలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఉగ్రదాడులు జరగడంపై కారణాలు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని కర్నాటక సిఎం సిద్ధ రామయ్య డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యలపై ప్రతిపక్ష బిజెపి నుంచి విమర్శలు రావడంతో సిద్ధరామయ్య స్పందించారు. ఉగ్రదాడులకు కారణాలు ఏమిటో చెప్పాల్సిందేనని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఢిల్లీ పేలుడు ఘటనపై మీడియాలో వచ్చిన తన వ్యాఖ్యలను కూడా ఆయన పోస్టు చేశారు. మంగళవారం బిహార్‌లో రెండవ, చివరి దశ పోలింగ్ పూర్తయిన తర్వాత ఓటింగ్‌కు ముందు రోజు ఢిల్లీలో జరిగిన పేలుడుపై సిద్ధరామయ్య వ్యాఖ్య చేశారు. బిజెపి కర్ణాటక విభాగం అధ్యక్షుడు బి వై విజయేంద్ర సిఎం సిద్ధరామయ్య, ఇతర కాంగ్రెస్ నాయకుల ప్రకటనలను బాధ్యతా రహితమైనవి, అసహనకరమైనవి, దిగజారుడు రాజకీయాలని అభివర్ణించారు. మంగళవారం మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దేశంలో పేలుళ్ల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, దేశంలో బాంబు పేలుళ్లు జరగకుండా చూడాలని, పేలుడులో అమాయకులు చనిపోయారని అన్నారు. ఎన్నికల సమయంలో దాడి జరిగిదని, దీనిని పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పేలుడు బిహార్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని సిద్ధరామయ్య అన్నారు. కాగా, మంత్రి ప్రియాంక్ ఖర్గే స్వతంత్ర భారతదేశంలో అత్యంత అసమర్థ హోంమంత్రి అమిత్ షా అని, ఆయన రాజీనామా తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. పేలుడుకు నిఘా వైఫల్యమే అని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి వెంటనే తన ప్రకటనను ఉపసంహరించుకోవాలని బిజెపినేత డిమాండ్ చేశారు.

## కశ్మీర్‌లో ఉగ్ర వ్యవస్థ అణచివేత చర్యలు ముమ్మరం

జెఇఐ అనుబంధ వ్యక్తులకు సంబంధించి 300కిపైగా ప్రదేశాలలో దాడులు



**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యవస్థ అణిచివేతపై చర్యలను పోలీసులు ముమ్మరం చేశారు. నిషేధిత జమాతే–ఇ–ఇస్లామి (జెఇఐ)తో అనుబంధంగా ఉన్న వ్యక్తులతో సంబంధం ఉన్న 300కి పైగా ప్రదేశాలపై దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. జెఇఐతో సంబంధాలు కలిగి వివిధ రంగాలలో తమ కార్యకలాపాలను పునరుద్ధరించడానికి ప్రయత్నించాయని సూచించే విశ్వసనీయ నిఘా సమాచారం ఆధారంగా ఈ దాడులు నిర్వహించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. కుల్గాం, పుల్వామా, షోపియన్, బారాముల్లా, గండేర్బల్ జిల్లాల అంతటా అనేక ప్రదేశాలలో దాడులు నిర్వహించినట్లు వారు తెలిపారు. జెఇఐ సభ్యులు, వారి సహచరుల నివాసాలు, ప్రాంగణాలలో సోదాలు జరిగాయి. ఉగ్రవాద పర్యావరణ వ్యవస్థను, దాని మద్దతుగల వ్యవస్థలను అట్టడుగు స్థాయిలో కూల్చివేసే నిరంతర ప్రయత్నాలలో భాగంగా ఈ అణిచివేత జరిగిందని వారు తెలిపారు. భారీ ఆపరేషన్‌కు సంబంధించిన వివారలను అధికారులు వెల్లడించారు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లా అంతటా 200కి పైగా ప్రదేశాలలో దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. గత నాలుగు రోజుల్లో, జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఒజిడబ్ల్యుల ప్రాంగణంలో జమ్ముకశ్మీర్‌కు చెందిన జమ్ముకశ్మీర్ నేషనల్స్ ఆపరేటింగ్ ఫ్రమ్ పాకిస్తాన్ (జెకెఎన్ఒపి) ప్రాంగణంలో 400కి పైగా కార్డన్, సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు వారు తెలిపారు. గతంలో ఎన్‌కౌంటర్లు జరిగిన ప్రదేశాలు, ఉగ్రవాదుల దాక్కున్న ప్రదేశాలు ఈ ఆపరేషన్లలో ఉన్నాయి. ఈ ఆపరేషన్లలో జెకెఎన్ఒపిలు, ఇతర నిషేధిత సంస్థలతో అనుబంధంగా ఉన్న సుమారు 500 మంది వ్యక్తులను విచారించారు. వీరిలో చాలా మందిని అదుపులోకి తీసుకుని అనంతనాగ్‌లోని జిల్లా జైలు మట్టన్‌కు తరలించారు. దాడుల సమయంలో నేరారోపణ చేసే పదార్థాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అనేక మంది జెఇఐ సభ్యులను విచారించి, ఉగ్రవాదానికి సహాయపడే నెట్‌వర్క్‌లను మరింతగా గుర్తించారు. ఉత్తరకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో, సోపోర్‌లోని పోలీసులు ఒక ప్రధాన సమన్వయ ఆపరేషన్‌ను ప్రారంభించి, ఇతర భద్రతా దళాల సహాయంతో సోపోర్, జైంగిర్, రఫియాబాద్ ప్రాంతాలలో 30కి పైగా ప్రదేశాలలో ఏక కాలంలో దాడులు నిర్వహించడం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉగ్రవాద నిరోధక, వేర్పాటువాద పర్యావరణ వ్యవస్థ చర్యను చేపట్టారని వారు తెలిపారు. ఈ ఆపరేషన్ల సమయంలో పత్రాలు, డిజిటల్ గాడ్జెట్‌లు, నిషేధిత సంస్థతో సంబంధాలున్న ముద్రిత కంటెంట్‌తో సహా గణనీయమైన మొత్తంలో నేరారోపణ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలలో వారి ప్రమేయాన్ని నిర్ధారించడానికి అనేక మంది వ్యక్తులను ప్రశ్నిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. నిషేధిత సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తులు, ప్రాంగణాలను లక్ష్యంగా చేసుకుని, మధ్య కశ్మీర్‌లోని గండర్‌బాల్ అంతటా అనేక ప్రదేశాలలో విస్తృతమైన సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

## ఢిల్లీ పేలుడు నిందితులతో మాకు సంబంధం లేదు




అల్ ఫలాహ యూనివర్సిటీ

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి జరిగిన పేలుడుకు సంబంధించిన కేసులో అరెస్టయిన నిందితులతో తమకు ఎలాంటి సంబంధం లేదని.. హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ యూనివర్సిటీ స్పష్టంచేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. పేలుడు ఘటన తమను కలిచివేసిందని, ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొంది. యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ భూపిందర్ కౌర్ ఆనంద్ పేరిట ప్రకటన విడుదల చేశారు. తాము 1997 నుంచి వివిధ విద్యాసంస్థలు నడుపుతున్నామని, హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ అయిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపు పొందామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 2019 నుంచి తాము ఎంబిబిఎస్ కోర్సులు నిర్వహిస్తున్నామని, తమ దగ్గర వైద్య పట్టా అందుకున్న చాలామంది ప్రస్తుతం ప్రముఖ ఆస్పత్రుల్లో పని చేస్తున్నారని తెలిపారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి కలుగాలని తాము కోరుకుంటున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పేలుడు కేసులో మా యూనివర్సిటీలో పనిచేసే ఇద్దరు డాక్టర్‌లను దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసిందని, వాళ్ల తమవద్ద కేవలం అధ్యాపకులుగా పనిచేస్తున్నారని, అంతకుమించి వారితో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## ముందస్తు బెయిల్‌పై విచారణ త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ

దరఖాస్తులను కేరళ హైకోర్టు నేరుగా స్వీకరించడంపై 'బెంచ్' అసహనం



**న్యూఢిల్లీ :** ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించడం 'పార్టీ ఎంపికనా'? లేదా, సెషన్స్ కోర్టును ఆశ్రయించడం తప్పనిసరినా? అనే అంశాన్ని అత్యున్నత న్యాయస్థానం బుధవారం ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ చేసింది. ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏర్పడే వరకూ విచారణను వాయిదా వేయనున్నట్లు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. 'ఈ అంశాన్ని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం విచారించాల్సిన అవసరం ఉన్నది' అని ధర్మాసనం స్పష్టం చేసింది.ఇంతకుముందు ఈ అంశంలో సహాయం చేసేందుకు సుప్రీంకోర్టు ఇంతకుముందు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాను నియమించింది. సెప్టెంబరు 8న సుప్రీంకోర్టు కేరళ కోర్టు ముందస్తు బెయిల్ దరఖాస్తులను నేరుగా సెషన్స్ కోరుకు తరలించకుండానే స్వీకరించే 'సాధారణ పద్ధతి'ని గమనించింది. కేరళ హైకోర్టులో ఒక అంశం మమ్మల్ని ఇబ్బంది పెట్టేదిగా కనిపిస్తోంది. 'న్యాయవాది సెషన్స్ కోర్టును ఆశ్రయించకుండానే ముందస్తు బెయిల్ దరఖాస్తులను నేరుగా హైకోర్టు స్వీకరించే అలవాటు ఉంది. అది అలా ఎందుకు జరుగుతోంది' అని ధర్మాసనం అడిగింది. మునుపటి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, భారత్ నాగరిక్ సురక్ష్ సంహిత2023లో ఒక సోపాన క్రమం అందించబడిందని అది తెలిపింది. బిఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 482 అరెస్ట్ చేయబడిన ఒక వ్యక్తికి బెయిల్ మంజూరు చేయడానికి మార్గనిర్దేశం చేస్తుంది. ఇది మరే ఇతర రాష్ట్రంలోనూ జరగడంలేదు. కేవలం కేరళ రాష్ట్రంలో మాత్రమే జరుగుతోంది. రెగ్యులర్ దరఖాస్తులను (ముందస్తు బెయిల్ కోసం) స్వీకరిచడం మేం గమనించాం అని ధర్మాసం వ్యాఖ్యానించింది. ముందస్తు బెయిల్ కోసం తమ అభ్యర్థనను తిరస్కరిస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్లు ముందస్తు బెయిల్ కోసం మొదట సెషన్స్ కోర్టుకు వెళ్లకుండా హైకోర్టుకు నేరుగా వెళ్లడాన్ని ధర్మాసనం పేర్కొంది. దరఖాస్తుదారుడు సెషన్స్ కోర్టును సంప్రదించకుండానే హైకోర్టు అటువంటి దరఖాస్తులను నేరుగా స్వీకరించిందని గమనించబడింది. దీనిఫలితంగా సెషన్స్ కోర్టు ముందుకు వచ్చే తగిన వాస్తవాలు సరైన రికార్డులో ఉంచబడకపోవచ్చు. 'ఈ అంశాన్ని పరిగణనలోనికి తీసుకుని హైకోర్టును ఆశ్రయించే ఎంపిక పార్టీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందా లేదా నిందితుడు ముందుగా సెషన్స్‌కోర్టును ఆశ్రయించడం తప్పనిసరి కాదా? అనే అంశాన్ని నిర్ణయించడానికి మేం మొగ్గు చూపుతున్నాం' అని ద్విసభ్య ధర్మాసనం జోడించింది. ఈ అంశంపై కేరళ హైకోర్టుకు దాని రిజిస్ట్రార్ జనరల్ ద్వారా నోటీస్ జారీ చేసింది.

## మోదీ డిగ్రీపై అప్పీళ్ల దాఖలులో ఆలస్యం 3 వారాల్లో అభ్యంతరాలు తెలపండి

ఢిల్లీ విశ్వవిద్యాలయాన్ని కోరిన ఢిల్లీ హైకోర్టు

ఈ అంశంపై విచారణ జనవరి 16కు వాయిదా




**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్యాచిలర్ డిగ్రీ వివరాలను బహిర్గతం చేయాలన్న ఉత్తర్వులను సవాల్ చేస్తూ అప్పీళ్లు దాఖలు చేయడంలో జాప్యాన్ని క్షమించాలని దాఖలు చేసిన పిటిషన్లపై అభ్యంతరాలు దాఖలు చేయాలని ఢిల్లీ హైకోర్టు బుధవారం ఢిల్లీ విశ్వవిద్యాలయాన్ని (డియు) కోరింది. అప్పీల్ దాఖలు చేయడంలో జాప్యాన్ని క్షమించాలని కోరుతూ దాఖలైన దరఖాస్తులపై సమాధానం దాఖలు చేయడానికి ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గెడెలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఢిల్లీ విశ్వవిద్యాలయానికి మూడు వారాల గడువు ఇచ్చింది. సింగిల్ జడ్జి ఆగస్టునెలలో ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ అప్పీళ్ళు దాఖలు చేయడంలో జాప్యం జరుగుతోందని ధర్మాసనానికి తెలియజేసింది. 'ఢిల్లీ విశ్వవిద్యాలయం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఐ) తుషార్ మెహతా ఆలస్యాన్ని క్షమించాలని కోరుతూ దాఖలైన దరఖాస్తులపై అభ్యంతరాలను మూడు వారాలలో దాఖలు చేయవచ్చు. అభ్యంతరాలకు సంబంధించినవి ఏవైనా ఉంటే అప్పీల్ దారులు ఆ తర్వాత రెండు వారాలలోగా ప్రతిస్పందనలను తెలియజేయాలి' అని ధర్మాసనం పేర్కొంది. కాగా అత్యున్నత న్యాయస్థానం ఈ అంశంపై విచారణను 2026 జనవరి 16కు వాయిదా వేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ డిగ్రీని బహిర్గతం చేయాలని ఆదేశిస్తూ కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) తీసుకున్న నిర్ణయాన్ని ఏకసభ్య ధర్మాసనం పక్కకు పెట్టడాన్ని సవాల్ చేస్తూ నాలుగు అప్పీళ్లు దాఖలు చేయబడ్డాయి. సమాచార హక్కు కార్యకర్త నీరజ్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సంజయ్‌సింగ్, న్యాయవాది మొహమ్మద్ ఇర్షాద్ దాఖలు చేసిన అప్పీళ్లను ద్విసభ్య ధర్మాసనం విచారించింది. విచారణ సమయంలో పిటిషనర్ల తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వులలో ప్రాథమిక లోపాలు ఉన్నాయని ధర్మాసనానికి విన్నవించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం తరపున హాజరవుతున్న సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా మాట్లాడుతూ ఈ దశలో అప్పీళ్లలో నోటీసులు జారీచేయవద్దని కోర్టును అభ్యర్థించారు. ఎందుకంటే తాను దానికి తగిన సమాధానం కూడా దాఖలు చేయబోతున్నానని మెహతా కోర్టుకు వివరించారు. అప్పీళ్లు దాఖలు చేయడంలో జాప్యం జరిగిందని గమనించిన కోర్టు క్షమాపణ కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తుపై అభ్యంతరాలు దాఖలు చేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరింది. దీనిపై న్యాయ అధికారి తుషార్ మెహతా మాట్లాడుతూ 'ఈ విషయంలో ఆలస్యం జరిగిందని నాకు తెలియదు. ఈ విషయాన్ని నేను పరిశీలిస్తాను. ఈ ప్రధాన అంశంపై వాదించేందుకు నాకు ఎలాంటి సంకోచం లేదు' అని అన్నారు. ఆగస్టు 25న కేంద్ర సమాచార కమిషన్ ఆదేశాన్ని సింగిల్ జడ్జి పక్కన పెట్టారు. ప్రధానమంత్రి మోదీ ఒక ప్రభుత్వ పదవిలో ఉన్నందున ఆయన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగంగా బహిర్గతం చేయడానికి పరిమితం చేయలేదని చెప్పారు. కోరిన సమాచారంలో ప్రజా ప్రయోజనానికి ఎటువంటి సంబంధం లేదని సింగిల్ జడ్జి ధర్మాసనం తోసిపుచ్చింది. సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ప్రభుత్వ పనితీరులో పారదర్శకతను ప్రోత్సహించడానికి రూపొందించబడిందని, సంచలనాత్మకతకు మేతగా ఉండటానికి కాదు అని సింగిల్ జడ్జి అన్నారు. ఏదైనా ప్రజాప్రతినిధిఅధికారిక బాధ్యతలను నిర్వర్తించడానికి విద్యార్హత ఎటువంటి చట్టబద్ధమైన అవసరం యొక్క సమాచారంలో లేదని సింగిల్ జడ్జి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ 10 మరియు 12 తరగతుల రికార్డు ల కాపీలను అందించాలని సిబిఎస్ఇని ఆదేశించిన కేంద్ర సమాచార కమిషన్ ఉత్తర్వును కూడా హైకోర్టు పక్కన పెట్టింది.

## 'కవచ్'తో రైలు ప్రమాదాలకు చెక్



అనుభవ సంస్థలతో రైల్వే శాఖ ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు ప్రమాదాల నివారణ కోసం కవచ్ వ్యవస్థ నిర్మాణాన్ని సమర్థవంతంగా అమలు పరిచేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు అనుభవం కలిగిన సంస్థలతో బుధవారం ఒప్పందం చేసుకున్నాయి. ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే కవచ్ వ్యవస్థను అమలు పరచ్చడంలో నోడెల్ ఎజెన్సీగా నిలిచింది. 1600 కిమీ రైల్వే లైన్లు ఇప్పటికే కవచ్ వ్యవస్థ కిందకు వచ్చాయి. కవచ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు దక్షిణ మధ్య రైల్వే, ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ యొక్క సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ మధ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంపై దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలికాం ఇంజనీర్ పి.వి మురళీ కృష్ణ, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్ మూర్తి సమక్షంలో దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సిగ్నల్, టెలికాం ఇంజనీర్ తేజ్ ప్రకాష్ అగర్వాల్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సిగ్నల్ డెవలప్‌మెంట్) విజయ్ సెర్వాల్, ఐఐటి హైదరాబాద్ విభాగాధిపతి ప్రొఫెసర్ జి. నరహరి శాస్త్రి సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం యొక్క ప్రాథమిక లక్ష్యం భారతీయ రైల్వేల స్వదేశీ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఎటిపి) వ్యవస్థ అయిన కవచ్ వ్యవస్థ కోసం మాడ్యులర్ హార్డ్‌వేర్ స్థాయిలో ఇంటర్‌ఆపరేబిలిటీని అభివృద్ధి చేయడం. ఈ చొరవ హార్డ్‌వేర్ ఇంటర్‌ఫేస్‌లను ప్రామాణీకరించడం మరియు ఇన్‌పుట్ అవుట్‌పుట్ మాడ్యూల్స్, ఆర్. ఎఫ్. మాడ్యూల్స్, కమ్యూనికేషన్ ఇంటర్‌ఫేస్‌లు, ప్రాసెసింగ్ యూనిట్‌లతో సహా కవచ్ వ్యవస్థ యొక్క వివిధ ఫంక్షనల్ మాడ్యూళ్ల మధ్య ప్లగ్ అండ్ ప్లే అనుకూలతను ప్రారంభించడం లక్ష్యంగా పెట్టుకుంది అసలు పరికరాల తయారీదారు (ఒఇఎం)తో సంబంధం లేకుండా ఈ సాంకేతిక పురోగతి కవాచ్ పర్యావరణ వ్యవస్థలో నిర్వహణ, అప్‌గ్రేడబిలిటీ మరియు బహుళవిక్రేతల వశ్యతను గణనీయంగా పెంచుతుంది, భారతీయ రైల్వే నెట్‌వర్క్ అంతటా స్కేలబుల్ మరియు సమర్థవంతమైన అమలుకు మార్గం సుగమం చేస్తుంది. ఈ ఒప్పందం కింద, ఐఐటి హైదరాబాద్ ప్రామాణిక కవచ్ సిస్టమ్ ఆర్కిటెక్చర్ యొక్క పూర్తి కార్యాచరణ, పరస్పర చర్యను ప్రదర్శించే ఒక నమూనాను అభివృద్ధి చేస్తుంది.



గౌహతిలోని మాలిగావ్‌లో ఈ నెల 3నుంచి 11 వరకు జరిగిన 48వ మహిళా ఆల్ ఇండియా ఇంటర్ రైల్వే ఛాంపియన్‌షిప్‌లో దక్షిణ మధ్య రైల్వే మహిళల బాస్కెట్ జట్టు ఛాంపియన్‌షిప్ కొట్టిన సందర్భంగా క్రీడాకారులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అభినందించారు.

## విమానాలకు బాంబు బెదిరింపులు

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా కొన్ని ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. బుధవారం గురుగ్రామ్‌లోని ఇండిగో ప్రధాన కార్యాలయానికి గుర్తుతెలియని వ్యక్తులు బాంబు బెదిరింపు మెయిల్స్ పంపించారు. అందులో ఢిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురం నుంచి నడుస్తున్న పలు ఇండిగో విమానా ల్లో బాంబులు అమర్చినట్లు పేర్కొన్నారు. దీనితో అప్రమత్తమైన ఎయిర్‌లైన్స్ అధికారులు ఆయా విమానాశ్రయాల అధికారులను అలర్ట్ చేశారు. మొదట కోల్‌కతా నుంచి ముంబయికి వెళ్లనున్న ఇండిగో విమానంలో బాంబు పెట్టినట్లు బెదిరింపులు వచ్చాయి. దీంతో అందులోని 186 మంది ప్రయాణికులను కిందకు దించేసి, విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. అంతేకాదు ఢిల్లీ, తిరువనంతపురం విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. బాంబు స్క్వాడ్ బృందాలతో ఇండిగో విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. దేశరాజధాని ఢిల్లీలో పేలుడు సంభవించడంతో ఢిల్లీ విమానాశ్రయంలో భారీ భద్రతను ఏర్పా టు చేసినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు. బెదిరింపు మెయిళ్లు పంపిన దుండగులను గుర్తించడానికి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

**హైదరాబాద్ విమానాశ్రయానికి కూడా..**

దేశంలో ఢిల్లీ, ముంబయి సహా ఐదు విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు వచ్చాయని ఇండిగో బుధవారం తెలిపింది. దిల్లీ, ముంబయి సహా హైదరాబాద్, చెన్నై, తిరువనంతపురం అనే ఐదు విమానాశ్రయాలపై 24 గంటల్లోగా దాడి చేస్తామని ఇండిగో ఎయిర్‌లైన్‌కు సందేశం వచ్చినట్లు పేర్కొంది.

## రష్యాతో యుద్ధానికి సిద్ధపడుతున్న యూరప్!



**బెల్‌గ్రేడ్:** యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యాతో యుద్ధానికి సిద్ధమవుతున్నాయని సెర్బియా దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్ అన్నారు. ''వాస్తవాలను విశ్లేషించినప్పుడు యూరప్–రష్యా మధ్య యుద్ధం మరింత స్పష్టంగా కనిపిస్తోందని నేను నిర్ధారణకు వచ్చాను, ఇది ఏమీ తోచక కాలక్షేపం కోసం చేసే వ్యాఖ్యలు కాదు, అందరూ దీనికి సిద్ధం అవుతున్నారు'' అని పింక్ టీవీ ప్రసారం చేసిన ఒక కార్యక్రమంలో ఆయన చెప్పారు. రాబోయే మూడు నుండి నాలుగు సంవత్సరాల కాలం లో రష్యాతో యుద్ధానికి సిద్ధంగా ఉండాలని ఫ్రెంచ్ సాయుధ దళాల చీఫ్ జనరల్ స్టాఫ్ ఫాబియన్ మాండన్ చేసిన వ్యాఖ్యలపై ఉసిక్ పైవిధంగా స్పందించారు. అటు పాశ్చాత్యదేశాలు, ఇటు రష్యా అనుసరిస్తున్న పరస్పర విరుద్ధమైన విధానాలమధ్య ఎటూకాకుండా బండరాయిలా నిలబడి ఉన్న సెర్బియా ఆత్మరక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.దేశ రక్షణకోసం తమ సాయుధ బలగాలను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇటీవలికాలంలో రష్యా పై యూరోపియన్ యూనియన్ ఆంక్షల తీవ్రవతను మరింతగా పెంచడంతోపాటు రష్యా చమురు దిగుమతుల రద్దుకు రెండేళ్ళకాలాన్ని గడువుగా నిర్దేశించుకోవడం, యూరోపియన్ యూనియన్ సైన్యాన్ని బలోపే తం చేసుకోవడానికి నిధులు తమ తమ జిడిపిల ద్వారా కష్టంగానైనాసరే కేటాయించాలనే అలవికాని లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, ఉక్రేన్‌పై దాడుల సందర్భంగా ఇటీవల కొన్ని యూరప్ దేశాలు తమ సరిహద్దులను రష్యా విమానాలు, డ్రోన్లు ఉల్లంఘించాయన్న ఆరోపణలు, ట్రంప్ మధ్యవర్తిత్వ వైఫల్యం వంటి అనేక పరిణామాల నేపథ్యంలో సెర్బియా అధ్యక్షుడు పైవిధంగా స్వీయ విశ్లేషణ చేశారు.

## చిలీలో తుది ఘట్టానికి ఎన్నికల ప్రచారం

**శాంటియాగో:** కమ్యూనిస్టు కూటమి అధికారంలో ఉన్న చిలీలో దేశాధ్యక్ష పదవికి అభ్యర్థుల మధ్య హోరాహోరీగా ప్రచార పోరాటం కొనసాగుతోంది. నవంబరు 16వ తేదీన దేశంలో ఎన్నికలు జరుగుతాయి. దేశాధ్యక్షుణ్ణి ఎన్నుకోవడంతోపాటు ప్రజలు 155 మంది సభ్యులున్న ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌ను కూడా ఎన్నుకుంటారు. అధికారం సంపాదించాలంటే ఏ పార్టీ లేదా కూటమి అయినా 78 సీట్లు గెలుచుకోవాలి. అదేవిధంగా 50 మంది సభ్యులుండే సెనేట్‌లో 43 మందిని ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. ఈ సెనేట్ సభ్యులు ఎనిమిది సంవత్సరాలు అధికారంలో ఉంటారు. ఐతే ప్రతి నాలుగు సంవత్సరాలకూ ఒకసారి సెనేట్ ఎన్నికలు జరుగుతాయి. ఈ విధంగా సగం మంది సెనేట్ సభ్యులను కూడా ఈ విడత ఎన్నికల్లో ప్రజలు ఎన్నుకుంటారు. ప్రస్తుతం ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌లో, రీజినల్ గవర్నర్స్‌లో, రీజినల్ కౌన్సిలర్స్‌లో, మేయర్లలో కమ్యూనిస్టులదే ఆధిపత్యం ఉంది. ప్రస్తుతం కమ్యూనిస్టు కూటమి తరపున మహిళా నాయకురాలు జెన్నెట్ అలెజాంద్రా జారా రోమన్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. ప్రస్తుతం గాబ్రియేల్ బోరిక్ అధ్యక్షుడుగా ఉన్నారు. గతంలో కమ్యూనిస్టుల చేతిలో పరాజయం పాలైన రిపబ్లికన్ పార్టీకి చెందిన జోస్ ఆంటోనియో కాస్ట్ ఈసారి కూడా మళ్ళీ అధ్యక్ష పదవికి పోటీలో ఉన్నారు. ఆయన ఇప్పుడు చాలా గట్టి పోటీ ఇస్తున్నారు. దేశానికి కఠినమైన, అణచివేతకు గురిచేసే నాయకుడు కావాలని ఆయన ఎన్నికల ప్రచారంలో వాదిస్తున్నారు. మరోవైపు నేషనల్ రెన్యూవల్ (ఆర్ఎన్)పార్టీకి చెందిన నాయకురాలు ఎవెలిన్ రోజ్ మాథీ ఫోర్నెట్ కూడా భారీగా ప్రచారం చేస్తున్నారు.

ప్రజాపక్షం
గురువారం, 13 నవంబరు

# చర్చలు మాత్రమే.. చర్యలు శూన్యం

ప్రతి సంవత్సరం ప్రభావిత దేశాల సదస్సు (కాప్) రూపంలో భూమి నిట్టూర్పులు వినిపిస్తునే ఉంటాయి. వెలుగుల వేదికపై దేశాధినేతలు చేరతారు. సుదీర్ఘ చర్చలు జరుపుతారు. 'భూమిని రక్షిస్తాం' అంటూ మరోసారి గొప్పగా ప్రకటిస్తారు. అంతకు మించి జరిగేదీ.. ఒరిగేదీ ఏమీ ఉండదు. పర్యావరణ సమస్యలు, వాతావరణ పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి బ్రెజిల్ వేదికగా నిర్వహిస్తున్న సదస్సులోనూ ఇవే దృశ్యాలు. చర్యలపై భరోసాలేని చర్చలు, ప్రసంగాలు పొంగిపోతున్నాయి. భూమి గుండె మాత్రం మళ్లీమళ్లీ గాయపడుతునే ఉంది. అపరిమితంగా సాగుతున్న పారిశ్రామికీకరణం తెచ్చిపెడుతున్న అనర్థం అక్కడ అందరికీ తెలుసు. కానీ, తెలియనట్టు నటన. వారి మాటల వెనక చమురు కంపెనీల నీడలు.. కర్బన స్వప్నాల మబ్బులు.. అందుకే, అక్కడ చేసే ప్రతిజ్ఞలు కాగితాలపై మాత్రమే బతికి ఉంటాయి. ఆ తీర్మానాలతోపాటు మంచు పర్వతాలు కూడా కరుగుతున్నాయి. సముద్రాలు ఎగసిపడుతున్నాయి. ప్రకృతి విరుచుకుపడుతున్నది. కానీ, ఇవేవీ కాప్ సదస్సులో పాల్గొంటున్న ఎవరికీ పట్టదు. వారి చెవులకు డాలర్ల గలగలలే తప్ప, ప్రకృతి విలవిల వినిపించదు. తాజా సదస్సులో ఇప్పటికే వారం గడిచిపోయింది. అవే సమస్యలు.. అవే చర్చలు.. ఎప్పటి మాదిరిగానే నామమాత్రపు తీర్మానాలు. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా నూనె ధనం.. కర్బన సౌఖ్యం.. జతకడుతునే ఉంది. ఆర్భాటాలు తప్ప ఆచరణ ఏమీ లేదు. వచ్చే వారంలో అద్భుతాలు జరుగుతాయన్న ఆశ ఎవరికీ లేదు. పర్యావరణ సమస్యలు ప్రపంచ దేశాలను అల్లాడిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో వరుసగా రెండోరోజు కూడా వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతున్నది. నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణం. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై జరిగే సమావేశాలు, సదస్సుల్లో తీసుకునే నిర్ణయాలు అమలైవుంటే, భూగోళానికి ఈ దుస్థితి దాపురించేది కాదు. ప్రతిసారీ ఒక కొత్త నినాదంతో ముందుకు రావడం, ఏదో ఒక మార్పును ప్రచారం చేసుకోవడం.. ఈ సదస్సులు అంతవరకే పరిమితమవుతున్నాయి. 'స్థానికులకు పెద్దపీట' అంటూ అమెజాన్ అటవీ ప్రాంతానికి అత్యంత సమీపంలోని బెలేంలో ఈ సదస్సు విద్యుత్ కోతతో మొదలైంది. స్థానిక ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పకనే చెప్పింది. ప్రపంచ జీవ వైవిధ్యాన్ని రక్షించే బాధ్యతలో పెద్ద భాగం స్థానిక ప్రజలదే. పర్యావరణ పరిరక్షణకు వారి ప్రత్యక్ష, పరోక్ష కృషి ఎంతో ఉంది. కానీ, 'అధునాతన నాగరికత' ప్రభావాలతో అత్యధికంగా నష్టపోతున్నది వారే. బాధిత స్థానిక గిరిజనులను సదస్సుకు ఆహ్వానించడం, వారి సమస్యలు చర్చించడం హర్షణీయమే. కానీ, వారి సమస్యలు వినే ఓపికా.. తీరికా అక్కడ ఎవరికీ లేవు. కనీసం, సాంప్రదాయ విధానాల్లో వారు పర్యావరణానికి చేస్తున్న మేలును గుర్తించేప్రయత్నం కూడా జరగలేదు. షరామామూలుగానే ప్రతి సదస్సు ఒక కొత్త హామీని మోసుకొస్తుంది. పాత నిర్లక్ష్యానికి కొత్త దుస్తులు తొడుగుతుంది. పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతునే ఉంది. సదస్సులు జరుగుతునే ఉన్నాయి. ప్రతినిధులు పాత అంశాలనే కొత్తగా ప్రస్తావిస్తారు. గత తీర్మానాలను మరచి, కొత్త హామీలు గుప్పిస్తారు. 'నన్ను పట్టించుకోండి' అంటూ ప్రకృతి ఎన్నో రీతుల్లో చేస్తున్నహెచ్చరికలను ఎవరూ లక్ష్యపెట్టరు. వాణిజ్య ప్రయోజనాలను విడిచిపెట్టరు. భూగోళం మనుగడకంటే ఆర్థిక లావాదేవీలు... స్వార్థ ప్రయోజనాలే వారికి కీలకం. అందుకే, అమలుకాని నిర్ణయాలను తిరిగి కొత్తగా తీసుకుంటారు. చట్టబద్ధం కాని ఒప్పందాలు చేసుకుంటారు.

అభివృద్ధి చెందిన దేశాలు చారిత్రక బాధ్యత నుంచి తప్పించుకుంటూనే ఉంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు నిధుల లోపంతో దీనంగా చూస్తుంటాయి. పేరుకే పర్యావరణ సదస్సులు.. కానీ, అక్కడ వాణిజ్య ప్రయోజనాలే ప్రతిధ్వనిస్తాయి. కాప్ సదస్సులో తీసుకున్న నిర్ణయాలు సక్రమంగా అమలైన దాఖలాలు ఇప్పటి వరకూ లేనేలేవు. అభివృద్ధి చెందిన దేశాలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న వైనం అసలేలేదు. అంతా ఒక ప్రహసనం. అభివృద్ధి చెందుతున్న దేశాలను మభ్యపెట్టే ప్రయత్నం. తమ వాణిజ్య లక్ష్యాలను చేరుకోవడానికి, లాభాల వాటాలు పెంచుకోవడానికే ప్రాధాన్యం. పరిస్థితి రోజురోజుకూ విషమిస్తున్నది. మారుతున్న పర్యావరణ పరిస్థితులు... పెరుగుతున్న వాయు, జల కాలుష్యాలు అత్యంత ప్రమాద స్థాయిని దాటాయి. కాబట్టి, ఇప్పుడు మాటలు కాదు... చేతలు అవసరం. సంతకాలు కాదు.. సంకల్పం కావాలి. ప్రతిజ్ఞలకంటే, ప్రయత్నాలు జరగాలి. బ్రెజిల్ సదస్సు గొప్పగా ఏదో సాధిస్తుందని చెప్పలేకపోయినా, కనీసం వాస్తవ పరిస్థితులైనా గుర్తించాలి. ప్రతి నిర్ణయాన్నీ అమలు చేయలేకపోయినా, కనీసం ఆ దిశగా అడుగు ముందుకు పడాలి. భూగోళాన్ని పరిరక్షించుకోవడానికి అన్ని రకాల చర్యలు చేపట్టాలి. లేకపోతే, ఎన్ని కాప్ సదస్సులు నిర్వహించినా, ఎన్ని తీర్మానాలు ఆమోదించినా ప్రయోజనం శూన్యం.

# పెరుగుతున్న అసమానత, ఉద్యోగ అభద్రత

**డాక్టర్ జ్ఞాన్ పాఠక్**

పని ప్రస్తుతం ప్రపంచం చౌరస్తాలో ఉంది. పని ప్రపంచాన్ని ప్రపంచ ఆర్థిక, సామాజిక, సాంకేతిక, పర్యావరణ పరివర్తనలు వేగంగా పునర్‌నిర్వచిస్తూ, అసమానతలు, ఉద్యోగ అభద్రతను తీవ్రతరం చేస్తున్నాయి. ఇలాంటి అస్థిరపరిచే మార్పు లక్షలాది మందికి స్థిరమైన జీవనోపాధి లేదా ప్రాథమిక రక్షణ లేకుండా చేస్తుంది.

ఇటీవల అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) విడుదల చేసిన నివేదికలోని కొత్త అంచనాలో ఈ మార్పులు ప్రపంచవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక వ్యవస్థలు తిరిగి పుంజుకోవటాన్ని పరీక్షిస్తున్నాయని హెచ్చరించింది. కొత్త సవాళ్లను అధిగమించడానికి కొత్త సామాజిక ఒప్పందానికి పిలుపునిచ్చింది. చర్య తీసుకోకపోతే, ఇప్పటికే ఉన్న అసమానతలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా అనధికారిక, తాత్కాలిక లేదా తక్కువ వేతన ఉద్యోగాలలో పనిచేసే కార్మికులకు, ఐఎల్‌ఓ హెచ్చరిస్తుంది.

'నాణ్యమైన ఉద్యోగాలు, భాగస్వామ్య శ్రేయస్సులో ప్రతి ఒక్కరూ సమాన అవకాశానికి అర్హులు. ప్రతిచోటా ప్రజలకు న్యాయమైన, సమ్మిళిత, శాశ్వత ప్రగతిని అందించడానికి మనం మళ్ళీ కలిసి పని చేద్దాం' అని ఐఎల్‌ఓ డైరెక్టర్ జనరల్ గిల్బర్ట్ ఎఫ్.హౌంగ్‌బోహాస్ అన్నారు. అందుకు ప్రభుత్వాలు ఆశయం, ఐక్యతతో వ్యవహరించాలని కోరారు.

'నూతన సామాజిక ఒప్పందం : సామాజిక అభివృద్ధిపై ద్వితీయ సమావేశం' పేరుతో రూపొందించిన అంచనా నివేదిక గౌరవప్రదమైన పనిలో నిరంతర లోటు, ఉపాధి అభద్రత, పెరుగుతున్న వేతన అంతరాలు, కార్మిక హక్కుల వేటు, వాతావరణ మార్పు, వేగవంతమైన సాంకేతిక పరివర్తన, జనాభా మార్పు వంటివి బహుళపాక్షిక సహకారం బలహీనపడుతుండడంతో మరింత తీవ్రమవుతున్నాయని నొక్కి చెప్పింది. తత్ఫలితంగా, కార్మికులను రక్షించడంలో లేదా వారి ప్రజలకు సామాజిక న్యాయం అందించడంలో అనేక దేశాలలో అమలులో ఉన్న ప్రస్తుత సామాజిక ఒప్పందాలు క్రమంగా విఫలమవుతున్నాయి.

ప్రపంచ కార్మికుల అభద్రత ఎక్కువగానే ఉందని నివేదిక పేర్కొంది. 2024లో, ప్రపంచం 402.4 మిలియన్ల ఉద్యోగాల నిరంతర లోటును ఎదుర్కొంది. 58.2 శాతం మంది కార్మికులు అసంఘటిత ఉపాధిలో ఉన్నారు. పని పేదరికం పెరుగుతోంది. సామాజిక రక్షణ వ్యవస్థలు పరిమితంగా ఉన్నాయి. ప్రపంచ జనాభాలో 47 శాతం మందికి మాత్రమే ఇవి వర్తిస్తాయి. పరిధి, సమర్థత రెండింటిలోనూ పెద్ద అసమానతలు ఉన్నాయి, దీని కారణంగా నాలుగు వందల కోట్లకు పైగా ప్రజలు ఎటువంటి సామాజిక రక్షణలు లేకుండా పోతున్నారు. అదనంగా, లక్షల మంది కార్మికులు కనీస వేతనాల కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారు. అలాగే ప్రస్తుత కనీస వేతనాలు మనుగడ కోసం ప్రాథమిక అవసరాలను తీర్చడంలో విఫలమవుతున్నాయి. 2024 – 2025ల నడుమ ఐఎల్‌ఓ బ్యూరో ఫర్ వర్కర్స్ యాక్టివిటీస్ (ఆక్ట్రావ్) నిర్వహించిన ప్రాంతీయ, ప్రపంచ సమావేశాల శ్రేణిలో వ్యక్తీకరించబడిన ప్రపంచవ్యాప్త ట్రేడ్ యూనియన్ల దృక్పథా లు, అనుభవాలు, పరిష్కారాలను నివేదిక అందిస్తుంది. రెండవ ప్రపంచ సామాజిక అభివృద్ధి శిఖరాగ్ర సమావేశానికి సన్నాహకంగా ఇదంతా జరిగింది. వేగవంతమైన, సంక్లిష్టమైన సామాజిక పరివర్తనలను అధిగమించేందకు అవసరమైన చురుకుదనాన్ని నిర్ధారిస్తూ, సామాజిక ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి, మంచి పని, హక్కులు, కేంద్రంగా ఉంచడానికి, కార్మికుల ప్రతినిధుల సమగ్ర పిలుపును ఈ నివేదిక అందిస్తుంది.

కోపెన్‌హాగెన్‌లో జరిగిన మొదటి ప్రపంచ సామాజిక అభివృద్ధి సదస్సు ముప్పై సంవత్సరాల తర్వాత, దోహాలో జరిగిన రెండవ శిఖరాగ్ర సమావేశం నేపథ్యంలో, 1995లో చేసిన నిబద్ధతలపై పురోగతి, ఎదురుదెబ్బలను ట్రేడ్ యూనియన్లు సమీక్షించాయి : పేదరికాన్ని నిర్మూలించడం, పూర్తి ,ఉత్పాదక ఉపాధిని సాధించడం, అందరికీ గౌరవప్రదమైన పని, సమ్మిళిత సామాజిక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం. తిరస్కరించలేని పురోగతి సాధించినప్పటికీ, ప్రపంచం ఈ లక్ష్యాలకు దూరంగా ఉంది. 2024లో దాదాపు 70 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ తీవ్ర పేదరికంలో నివసిస్తున్నారు, ముఖ్యంగా సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలో, అనియుత, వెలివేత కార్మిక మార్కెట్లలో ఆధిపత్యం చెలాయిస్తూనే ఉన్నాయి. దేశాల లోపల, దేశాల మధ్య అసమానతలు విస్తరిస్తున్నాయి.

సాంకేతిక అంతరాయాలు, వాతావరణ మార్పు, జనాభా మార్పులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, బలహీనపడే బహుళపాక్షికత కారణంగా ప్రస్తుత ప్రపంచ బహుళసంక్షోభం మన సామాజిక, ఆర్థిక వ్యవస్థల దుర్భలత్వాన్ని మరింత బహిర్గతం చేసింది. గౌరవప్రదమైన పని లోటు కొనసాగుతున్నాయి. ప్రజాస్వామ్య పరిధి కుంచించుకుపోతోంది. చాలా తరచుగా ఉపాధిని దాని చోదక శక్తిగా కాకుండా వృద్ధి ఉపఉత్పత్తిగా పరిగణిస్తారు. కాబట్టి నేడు అవసరమైనది కేవలం సంస్కరణ మాత్రమే కాదని, పునరుద్ధరణ, హక్కులు, న్యాయం ఆధారిత, ప్రజలపై కేంద్రీకృతమైన పునరుద్ధరించబడిన సామాజిక ఒప్పందం అని కార్మిక సంఘాలు పునరుద్ఘాటిస్తున్నాయి.

గౌరవప్రద పనికి కార్మిక హక్కులు పునాది అని నివేదిక చెబుతోంది. సంఘం స్వేచ్ఛ, సామూహిక బేరసారాలు, వివక్షతకు వ్యతిరేకంగా రక్షణ, బాల కార్మికులు, బలవంతపు శ్రమ అనేవి సామాజిక న్యాయం చర్చించలేని స్తంభాలు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులను పరిరక్షించడానికి బలహీనమైన అమలు, చట్టపరమైన అంతరాలను పరిష్కరించాలి. ఆర్థిక పాలన అనేది ప్రజలకు సేవ చేయాలని నివేదిక నొక్కిచెప్పింది. ప్రస్తుత ఆర్థిక విధానాలు తరచుగా ఉపాధిని ఆర్థిక వృద్ధి ఉప ఉత్పత్తిగా పరిగణిస్తాయి. ఉపాధి అనుకూల స్థూల ఆర్థిక చట్రాలు, స్థిరమైన వాణిజ్య విధానాలు, బాధ్యతాయుతమైన అంతర్జాతీయ ఆర్థిక జోక్యాలు, ఐఎల్‌ఓ గౌరవప్రదమైన పని అజెండాకు అనుగుణంగా అభివృద్ధి సహకారం వైపు మారాలని కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయి. ఇంకా, సామాజిక రక్షణ, న్యాయమైన పన్ను, కార్పొరేట్ జవాబుదారీతనం స్థిరమైన సామాజిక పెట్టుబడికి నిధులు సమకూర్చడానికి చాలా అవసరం.

సాంకేతిక, వాతావరణ పరివర్తనలకు న్యాయమైన, సమగ్ర వ్యూహాలు అవసరమని నివేదిక పేర్కొంది. వేగవంతమైన డిజిటలైజేషన్, కృత్రిమ మేధస్సు, వాతావరణ మార్పు అటు ప్రమాదాలు, ఇటు అవకాశాలను కలిగిస్తాయి. పరివర్తనలు మానవ కేంద్రంగా ఉండాలని, ఎవరూ వెనుకబడి ఉండకుండా చూసుకోవడానికి పునఃనైపుణ్యం, సామాజిక రక్షణ, కార్మికుల భాగస్వామ్యాన్ని కలపాలని, అలాగే బలహీన వర్గాలు, ముఖ్యంగా మహిళలు, యువత, వలస కార్మికులు, అసంఘటిత ఆర్థిక వ్యవస్థలో ఉన్నవారు ఈ పరివర్తనల నుండి ప్రయోజనం పొందాలని కార్మిక సంఘాలు నొక్కి చెబుతున్నాయి.

> పరిధి, సమర్థత రెండింటిలోనూ పెద్ద అసమానతలు ఉన్నాయి, దీని కారణంగా నాలుగు వందల కోట్లకు పైగా ప్రజలు ఎటువంటి సామాజిక రక్షణలు లేకుండా పోతున్నారు. అదనంగా, లక్షల మంది కార్మికులు కనీస వేతనాల కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారు. అలాగే ప్రస్తుత కనీస వేతనాలు మనుగడ కోసం ప్రాథమిక అవసరాలను తీర్చడంలో విఫలమవుతున్నాయి.

స్థానిక వాస్తవాలకు అనుగుణంగా పరిష్కారాల అవసరాన్ని నివేదిక నొక్కి చెప్పింది. బాల కార్మికులు, అసంఘటిత పని, అసురక్షిత ఉపాధి, వేతన అభద్రత, లింగ వివక్ష, వ్యవస్థాగత మినహాయింపు విస్తృతంగా ఉన్నాయి. ఆఫ్రికా నుండి ఆసియా, పసిఫిక్, లాటిన్ అమెరికా, అరబ్ రాష్ట్రాలు, యూరప్ వరకు ఉన్న ప్రాంతీయ ఉదాహరణలు, రంగాలవారీ ఒప్పందాలు, కనీస, జీవన వేతనాలు, అనియుత పనిని సంఘటితం చేయడం వంటి సందర్భోచిత పరిష్కారాలు కార్మికులను రక్షించగలవని, సామాజిక ఐక్యతను ప్రోత్సహించగలవని వివరిస్తాయి. కార్మిక సంఘాలు ప్రాసంగికత ఉండేలా రూపాంతరం చెందుతున్నాయని గమనించబడింది. ఇముద్చుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వడం, ఆర్థిక నైపుణ్యాన్ని నిర్మించడం, కూటములు ఏర్పరచుకోవడం, డిజిటల్ సాధనాలను స్వీకరించడం ద్వారా యూనియన్లు విధానాలను బాగా రూపొందించగలవు, హక్కులను రక్షించగలవు, సరిహద్దుల గుండా సామాజిక పురోగతిని నడిపించగలవని నివేదిక నొక్కి చెప్పింది.ఐఎల్‌ఓకు చెందిన బ్యూరో ఫర్ వర్కర్స్ యాక్టివిటీస్ డైరెక్టర్ మరియా హెలెనా ఆండ్రే మాట్లాడుతూ 2030, ఆపైన సమ్మిట్ ఫలితాలను, అభివృద్ధి ఎజెండాను రూపొందించడంలో కార్మికుల గొంతులు, అనుభవాలు, పరిష్కారాలను తెలియజేయడం ఈ నివేదిక లక్ష్యం అని పేర్కొన్నారు.

భవిష్యత్తు కోసం కొత్త దృక్పథాన్ని అందిస్తూ, సామాజిక ఒప్పందాన్ని పునరుద్ధరించడం కేవలం సంస్కరణవాద ప్రయత్నం కాదని నివేదిక పేర్కొంది. ఆర్థిక, సామాజిక విధానాలలో గౌరప్రదమైన పని, కార్మిక హక్కులను ముందంజలో ఉంచడం, సంక్లిష్టమైన ప్రపంచ పరివర్తనల యుగాన్ని అధిగమించడం, సంస్థలను బలోపేతం చేయడం ద్వారా ఆ విధానాలు సమాజంలోని అందరికీ చేరేలా చూసుకోవడం అవసరం. ఈ ప్రక్రియలో కార్మిక సంఘాలు అనివార్యమైన పాత్రధారులు అని, మానవులు కేంద్రంగా, న్యాయమైన, స్థితిస్థాపక పని ప్రపంచం కోసం వాదిస్తున్నాయని నివేదిక పేర్కొంది.

**(ఐపిఎ సర్వీస్)**

# భారత విదేశీ వ్యవహారాల బలహీనత బహిర్గతం

సుమారు రెండు దశాబ్దాలుగా భారతదేశం నిర్వహించిన తజికిస్తాన్ ఆయ్నా ఎయిర్‌బేస్‌ను ఆ దేశం తిరిగి స్వాధీనం చేసుకోవడం, భారత విదేశాంగ వ్యూహంలో పెరుగుతున్న బలహీనతలను బహిర్గతం చేసిన కీలక పరిణామంగా భావించబడుతోంది. ఈ పరిణామంతో మధ్య ఆసియా ప్రాంతంలో రష్యా, చైనా ప్రభావం మరింత బలోపేతమవుతుండగా, భారతం మాత్రం వ్యూహాత్మకంగా ఒంటరితనాన్ని ఎదుర్కొంటుందనే వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. దుషాంబే నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆయ్నా ఎయిర్‌బేస్ భారతదేశం నిర్వహించిన ఏకైక విదేశీ సైనిక స్థావరం. ఇది పాకిస్థాన్, ఆఫ్ఘానిస్థాన్ భద్రతా పరిణామాలను పరిశీలించేందుకు భారత్‌కు అరుదైన నిఘా మరియు వ్యూహాత్మక స్థానాన్ని కల్పించింది.

2000ల ప్రారంభంలో భారత్ ఈ స్థావరాన్ని ఆధునికీకరించేందుకు సుమారు 70 నుంచి 100 మిలియన్ అమెరికా డాలర్లు ఖర్చు చేసింది. రన్‌వే విస్తరణ, రాడార్ వ్యవస్థలు, హ్యాంగర్లు, భద్రతా కంచెలు వంటి సదుపాయాలు ఇందులో భాగం. ఆఫ్ఘానిస్థాన్లో తాలిబాన్‌కు వ్యతిరేకంగా ఉన్న నార్తర్న్ అలయన్‌కు వైద్య, లాజిస్టిక్ మద్దతు అందించడంలో కూడా ఇది ఉపయోగపడింది.

అయితే, ఈ స్థావరం పూర్తిగా భారత సార్వభౌమ ఆధీనంలో కాకుండా, ద్వైపాక్షిక అంగీకారాలపై ఆధారపడటంతో, రాజకీయ సమీకరణలు మారినప్పుడే భారత్ ప్రభావం తగ్గే పరిస్థితి ఏర్పడింది.

**రష్యా, చైనా ఒత్తిడి**

తజికిస్తాన్ ఈ నిర్ణయం స్వతంత్రంగా తీసుకోలేదు అని విశ్లేషకులు సూచిస్తున్నారు. మధ్య ఆసియా భద్రత, రక్షణ వ్యవస్థల్లో తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలనుకునే రష్యా, ఆర్థిక మరియు వ్యూహాత్మక పెట్టుబడులు పెంచుతున్న చైనా కలిసి తజికిస్థాన్‌పై ఒత్తిడి తీసుకొచ్చినట్టు భావించబడుతోంది. రష్యాకు, సమిష్టి భద్రతా ఒప్పంద సంస్థ బయట భారత్ స్వతంత్ర స్థావరం నిర్వహించడం వ్యూహాత్మకంగా అసౌకర్యంగా అనిపించింది. మరోవైపు చైనా, ఆ ప్రాంతంలో తన సరిహద్దు భద్రత మరియు బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టుల ప్రభావాన్ని పెంచుకోవడంలో భారత్‌ను ప్రధాన పోటీదారుగా చూస్తోంది. 2021లో ఆఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్ తిరిగి అధికారంలోకి రావడంతో, నార్తర్న్ అలయన్స్ బలహీనపడటం కూడా భారత వ్యూహాత్మక అవసరాన్ని తగ్గించినట్లు విశ్లేషణలు చెబుతున్నాయి.

ఈ పరిణామం భారత విదేశీ వ్యవహారాలలో ఉన్న ప్రధాన బలహీనతలను సూచిస్తుంది. దీర్ఘకాల సైనిక ఒప్పందాలు కుదుర్చుకునే దృఢ సంకల్పం లోపం, ఆర్థిక, మౌలిక వనరుల పెట్టుబడుల్లో చైనా స్థాయిలో పోటీ చేయలేకపోవడం. పాకిస్థాన్ కారణంగా మధ్య ఆసియాకు భూభాగ మార్గం లేకపోవడం వల్ల వ్యూహాత్మక ప్రాప్యత తగ్గిపోవడం. భారత్ 'కనెక్ట్ సెంట్రల్ ఏషియా' విధానాన్ని ప్రకటించినా, అది అమలులో అంతగా పురోగమించలేదు.

ఆయ్నా ఎయిర్‌బేస్ నుండి భారత్ నిష్క్రమణ, ఒక స్థావరం కోల్పోవడమే కాకుండా, భారత్ మధ్య ఆసియాలో తన స్థిరమైన వ్యూహాత్మక ప్రభావాన్ని కోల్పోయిన సంకేతంగానే చూడబడుతోంది. రష్యా, చైనా ప్రభావం పెరుగుతున్న ఈ కొత్త భౌగోళిక సమీకరణల్లో, భారత విదేశాంగ విధానం మరింత బలమైన ఒప్పందాలు, మౌలిక పెట్టుబడి, స్పష్టమైన వ్యూహ లక్ష్యాలతో పునర్నిర్మించాల్సిన అవసరం స్పష్టమవుతోంది.

**డా. ముచ్చుకోట సురేష్ బాబు,**
9989988912

# భాషా పరిరక్షణ - దేశ సార్వభౌమత్వం

*దేశ భక్తి అంటే మాతృభాష మీద అభిమానమే – గిడుగు వేంకటరామమూర్తి*

అమెరికా సుంకాల సంకట వాతావరణ నేపథ్యంలో, వచ్చిన వార్తల్లో అమెరికా ట్రెజరీ సెక్రెటరీ మరియు ప్రెసిడెంట్ ట్రంప్ వర్తక సలహాదారు పేలిన అవాకులు చవాకులని టూకీగా గమనిస్తే The tax payers lose because we (americans) have got to fund Modi's war. Mr.Navaarro (Trade Advisor) told the Bloomberg news agency, accusing India of getting in bed with the authoritarians like Russia and China. U.S.Treasury Secretary Scott Bessent called India U.S.ties a complicated relationship, despite good ties between Mr.Trump and Mr.Modi and said the issue was not just Russian oil purchases but India's failure to make a deal with the U.S.on trade. a deal అన్నది ఆ వార్తలో లేకపోయినా వాట్సాప్‌లో చక్కర్లు కొడుతూనే ఉంది. అది : అమెరికా ఎందుకు భారత్‌పై కోపంగా ఉంది? నిజం ఇదే : భారత్ అమెరికా వాణిజ్య లక్ష్యం : 2030 నాటికి 500 బిలియన్ల డాలర్స్‌కి చేరుకోవాలనే కల : ఆ కల వెనుక ఒక షరతు : అది : జన్యుపరంగా మార్పు చేసిన (జిఎం) విత్తనాలు/పంటలు : భారత్ వద్ద అంది అమెరికా సంతకం చేయమంది. భారత్ ఎప్పటికీ చేయనంది. ఈ విత్తనాల వ్యాపార ఒప్పందం వలన భారత రైతాంగం పూర్తిగా కోలుకోలేని విధంగా నష్టపోతుంది. అదీ గాక ఈ విత్తనాల వలన రకరకాల వ్యాధులు సంక్రమించి భారత్ ని ఓ అనారోగ్య దేశంగా మార్చేస్తుంది.

పైన చెప్పబడిన అమెరికా అధికార వర్గం వారం రోజులు పాటు విరామం లేకుండా అవే నిందా వాక్యాలు పేలుతూనే ఉన్నారు. అసలు అంతటి అవమానకరమైన వ్యాఖ్యలు ఓ దేశం మరో సార్వభౌమాధికారం కలిగిన దేశంపై చేయడం సమంజసమేనా ? అంతటి పెడసరం ఎలాగొచ్చింది ఆ దేశానికి. వ్యాపారం పేరుతో అంతటి నీతిమాలిన తనానికి దిగజారడమేనా? పైపెచ్చు నియంతలతో చేయి కలుపుతున్నావని భారతదేశాన్నీ తిట్టిపోస్తూ, యుద్ధ కాపరి అమెరికాయే ఓ నియంతలా, నియంతృత్వపు పోకడలతో వాణిజ్య యుద్ధాలకి తెర లేపుతుంది. దుష్ట సామ్రాజ్యవాద చర్యలతో ప్రపంచ దేశాల అస్థిత్వాలకి ఎసరు పెడుతుంది. ఆర్థిక అసమానతలను పెంచి పోస్తుంది. ఆకలి రాజ్యాలను పాదు కొలుపుతుంది. యుద్ధ వ్యాపారం మీద జీవనం సాగిస్తుంది. ఏది ఏమైనా భారత దేశానికి ఓ తలవంపుగా తోస్తున్నాయి పైన చెప్పిన అమెరికా అధికార వర్గపు నిర్హేతుక నిందా వ్యాఖ్యలు.

ఇంకా ఈ ప్రపంచ వాణిజ్య భూతం ఈ నేల మీద ఆవహించి, మొన్న కరెంట్, నిన్న రవాణా, నేడు భాషల జుట్టు పట్టుకొని ఉసురు తీస్తుంది. రేపు, మర్నాడు, ముమ్మొందు, మనం, మన బాబాయిలు, కాకాలు, దాద లు ముఖాలు లేని మొండాలుగానే మిగిలిపోతామని అనిపిస్తుంది. వెయ్యి సంవత్సరాల భారతం ఓ దాస్య దృశ్యమైపోయింది. ఆ దృశ్యం తరువాత స్వతంత్ర దృశ్యాన్ని ఆవిష్కరించుకుంది. అయినా దానికి బాలారిష్టాలు తప్పడం లేదు. పర తంత్రం పీడ తప్పడం లేదు.

పరాయి దేశాలు మూకుమ్మడిగా కన్ను గీటి కుట్రలకు పూనుకుంటున్నాయి. అసలు భారతీయ సంస్కృతిలో అంతర్లీనంగా దాగున్న విశ్వకళ్యాణ భావన వలన అందరికీ అలుసుగా తయారవుతుందేమో ఈ దేశం.

మళ్ళీ అమెరికా దాష్టీకపు వ్యాఖ్యలు, వాణిజ్య యుద్ధాల వైఖరి నేపథ్యం లో దేశాల సంస్కృతి సార్వభౌమత్వాలకి ఎలా ముప్పు ఏర్పడుతుందో మచ్చుకి ఓ ఉదాహరణ:

ప్రపంచీకరణ పూర్వరంగంలో తమ సరకులతో వర్ధమాన దేశాల మార్కెట్లను నింపి, స్థానిక ప్రజల వస్తూత్పత్తులను దెబ్బతీసి సంతలపై సంపూర్ణ ఆధిపత్యం నెలకొల్పడానికి ముందు ప్రపంచ సమాచార వ్యవస్థను అదుపులోకి తెచ్చుకోవాలని అమెరికా, ప్రపంచ బ్యాంక్, ఐ.ఎమ్.ఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థలకు ఆదేశాలిచ్చింది. ఈ విషయాన్ని సుప్రసిద్ధ అమెరికన్ మీడియా నిపుణులైన ఎడ్వర్డ్స్, మెక్ సినేలు వెల్లడించారు. ఈ నిర్ణయం 1980–90 మధ్య జరిగింది. దీని పర్యవసానంగానే, ఈ పూర్వరంగంలోనే మాతృభాషల స్థానే ఇంగ్లీష్ ను సర్వత్రా ప్రాథమిక విద్యాదశ నుంచి బోధనా భాషగా, మల్టీ నేషనల్ గుత్త కంపెనీల వ్యాపార వ్యవహా ర లావాదేవీల ప్రయోజనాలు సాధించిపెట్టడం కోసం అమలులోకి తేవాలన్న నిర్ణయం జరిగింది. ఏ.బి.కే. ప్రసాద్, పూర్వ అధికార భాషా సంఘం అధ్యక్షులు , నూర్ భాషా రహం తుల్లా గారు రాసిన 'తెలుగు అధికార భాష కావాలంటే...' అన్న పుస్తకానికి ముందు మాటలో.

లోగుట్టు పెరుమాళ్ల కెరుక అన్నట్టు, అసలు హంతకులైన అంతర్జాతీయ వాణిజ్య సంస్థలని వొదిలేసి, వాటికి ఎర్ర తివాచీలు పరచి, మన రాజకీయ ఏలిక వర్గం ఉపాధి నెపంతో, బూచితో ప్రజలకి ఇంగ్లీష్ ఒక్కటే ఆరాధ్య దైవం అంటూ, మాతృ భాషలకి తీరని ద్రోహం చేస్తున్నారు. వలసలని ప్రోత్సహిస్తున్నారు. నేల తల్లిని స్థానికులకి దూరం చేస్తున్నారు. ఏ మీడియా సమావేశం లో నైనా ప్రజల అసలైన అవసరాల గురించి గానీ, సంస్కృతి సాంప్రదాయ ఆరోగ్యాల గురించి కాకుండా, రాజకీయుల అక్రమ సంపాదన, బంధు వైరాల గురించి, ప్రత్యర్థి హత్యల గురించి, కుట్రల గురించే ఎక్కువగా మాట్లాడడం జరుగుతుంది. ఇది మనందరి నిత్య అనుభవం. నూతన ఉపాధి మార్గాలు ఆలోచించి వలసలు అరికట్టడం, స్థానిక వనరులతో వినూత్న ఉత్పత్తులు గావిం చి స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడం గాని నేటి రాజకీయాల్లో చూడమ్ గాక చూడమ్.

diversification, not substitution, is the real currEncy of sovereignty. అన్న ఓ వ్యాసకర్త వాక్యం కూడా గమనించదగ్గది.

అమెరికా పోయే నలుగురి కోసం అంతా ఇంగ్లీష్ చదవాలా? అన్న మన అనుభవజ్ఞులైన పెద్దల మాటలని గౌరవించాలి. తల్లి తెలుగుని రక్షించుకుంటూ భాషా సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ, దేశ సార్వభౌమత్వాన్ని కూడా కాపాడుకోవలసిన అవసరం నేడు ఎంతైనా ఉంది. దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని నిఘా కళ్ళతో నిత్యం సంరక్షించుకోవాలి.

**ఒబ్బిని సన్యాసిరావు**
9849558842

# బడి అంటే విద్యార్థికి భయమెందుకు?

ఒక పాఠశాలలో మంచి వాతావరణం అనగా గాలి వెలుతురు ఉండాలంటే ఆ పాఠశాలను శాస్త్రీయంగా నిర్మించాలి అనగా పాఠశాలను C, H, I, L, O, U అనే ఇంగ్లీషు అక్షరాల ఆకారంలో మాత్ర మే నిర్మించాలి. అటువంటి ఆకారంలో నిర్మించినప్పుడే పాఠశాలకు మంచి గాలి, వెలుతురు సమృద్ధిగా దొరుకుతుంది. అలా ప్రకృతి ప్రసాదించిన గాలి, వెలుతురు పిల్లలకు లభించినప్పుడే వారికి పాఠశాలలో అలసట అనేది ఉండదు. అలాగే ప్రతి పాఠశాలకు విధిగా ఆట స్థలాలు ఉండాలి.



ఇలా ఆట స్థలాలు మరియు C, H, I, L, O, U ఆకారంలో నిర్మితమైన పాఠశాలలు గతంలో ప్రతి గ్రామంలో, కొన్ని పట్టణాలలో ఉండేవి. అందుకే గడిచిన రోజులలో పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే ఉత్సాహం చూపేవారు, నేనంటే నేను ముందుగా పాఠశాలకు చేరుకోవాలని పిల్లల మధ్య పోటీతత్వం ఆ రోజులలో ఉండేది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల లో అటువంటి పాఠశాలలు చాలా ఉన్నాయి. కానీ అందులో విద్యార్థులు ఉండడం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజలు బ్రతుకుతెరువు కోసం పట్టణాల కు వలస వెళ్లడం మూలంగా ఈనాడు పట్టణ ప్రాంతాల్లో వేలకొలది పాఠశాలలు వెలసినవి. ఆ పాఠశాలలు వ్యాపార కేంద్రాలుగా మారి అందు లో పాఠశాల వాతావరణం అసలు కనిపించదు, ఆ పాఠశాలను వ్యాపార సముదాయాల్లో, చిన్న చిన్న ఇరుకు సందుల్లో, అపార్టుమెంట్‌లలో ఇలా ఎవరికి నచ్చిన ప్రాంతంలో వారు పాఠశాలలను ఏర్పాటు చేసుకొని 'కాకులు దూరని కారడివి' సామెత మాదిరిగా గాలి, వెలుతురు లేని పాఠశాలలు నిర్మించి విద్యను వ్యాపారం చేస్తున్నారు. అటువంటి పాఠశాలలకు విద్యార్థులు సూర్యుడు ఉదయించక ముందే ఇంటి నుండి బయలుదేరి సూర్యుడు అస్తమించిన తర్వాత మాత్రమే తమ స్కూలు వ్యానుల్లో ఇంటికి చేరుతున్నారు. అంటే సూర్య చంద్రులు ఎలా ఉంటారో కూడా చూడలేని విద్యార్థులు పట్టణ ప్రాంతాలతో పాటుగా చివరికి గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉన్నారు. గాలి, వెలుతురు అవసరం లేదనే విధంగా ఇటు తల్లిదండ్రు లు, అటు పాఠశాల యాజమాన్యాలు కోరుకుంటున్నాయి. మా పిల్లలు ఇంటి నుండి AC బస్సు లో వెళుతున్నారు, పాఠశాలలో కూడా తరగతి గదుల్లో AC ఉంటుంది, లైట్లు ఉంటాయి. ఇంకా గాలి, వెలుతురు మా పిల్లలకి అవసరం లేదు అనే విధంగా తల్లిదండ్రులు తయారైనారు. కానీ గాలి వెలుతురు పిల్లలకు లేకపోవడం వలన వారికి విటమిన్ డి లోపం ఏర్పడి వారిలో పెరుగుదలను, చురుకుదనాన్ని నివారిస్తుంది. శారీరకంగా దృఢంగా ఉండడానికి ఆటలు ఆడాలంటే ఏ పాఠశాలలో కూడా ఆటస్థలాలు ఉండవు. ఆటస్థలాలు ఉన్న పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఉండరు, అన్నీ ఉన్నా కొన్ని పాఠశాలల్లో చదువు ర్యాంకులు మాత్రమే కొలమానం అనే విధంగా చూస్తున్నారు. గాలి, వెలుతురు లేక, ఆటలు ఆడ క, పాఠశాలలో రోజంతా చదువు పైన మాత్రమే దృష్టి కేంద్రీకరించడం, ఇంటికి వెళ్లిన తర్వాత హోం వర్క్ అంటూ, ట్యూషన్లు అంటూ 15 గంట లు వారిని మరయంత్రాలుగా మార్చడం వలన వారు పాఠశాలకు వెళ్లాలంటే నిరుత్సాహం చూప డం, నిరాసక్తతను వ్యక్తపరచడం చేస్తున్నారు. తల్లిదండ్రులు మాత్రం మా పిల్లలు AC బస్సులో వెళ్లాలి, AC తరగతి గదిలో చదువుకోవాలి, మంచి ర్యాంకులు సాధించాలి అని సోషల్ స్టేటస్ కోణంలో మాత్రమే చూస్తున్నారు. అటు పాఠశాల ల యాజమాన్యాలు కూడా తల్లిదండ్రుల అత్యుత్సాహం, అత్యాశను ఆసరాగా చేసుకొని సామాజిక బాధ్యత పట్ల ఏమాత్రం అవగాహన లేకుండా వారిని నీలిమబ్బులలో విహరింపజేసి వ్యాపారం చేస్తున్నారు. కానీ పిల్లలు చిన్న వయసు లోనే ఆరోగ్య సమస్యలు, కళ్ళకు అద్దాలులో మానసికంగా దృఢమైన ఆలోచన లేకపోవడం వల్ల వారు ఒక చక్రబంధంలో ఇరుక్కుంటున్నారు అనే ఆలోచన తల్లిదండ్రులు కానీ పాఠశాల యాజమాన్యాలు గాని ఆలోచన చేయడం లేదు. విద్య కోసం ఎన్ని విద్యా కమిటీలు వేసినా, ఎన్ని కమిషన్లు సిఫార్సు లు చేసిన అవి ఆచరణకు అమలుకు నోచుకోవడం లేదు.

అందుకే పాఠశాలలు వాటి పరిసరాల పరిస్థితులను మార్చాలి. చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం పాఠశాలల్లో కల్పించాలి. పరీక్షలపై సంస్కరణలు తీసుకురావాలి, విద్యార్థి చదువుకునే సిలబస్ ను అతని నిజ జీవితానికి మరియు భవిష్యత్తులో అతడు ఎదగడానికి ఉపయోగపడే విధంగా సంస్కరణలు తీసుకురావాలి. పాఠశాలల మధ్య విద్యార్థుల మధ్య ర్యాంకుల పోటీతత్వం నివారించాలి. కూలి పని చేసే తల్లిదండ్రుల పిల్లల నుండి ఉన్నత స్థానంలో ఉన్న తల్లిదండ్రుల పిల్లల వరకు అందరికీ ఒకే విధమైన విద్యా విధానం అనగా 'కామన్ స్కూల్ విద్యా విధానం' తీసుకురావడానికి పాలకులు, ప్రభుత్వాలు సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



**యాసాని కరుణాకర్ రెడ్డి,**
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)

## ఇవిఎం గోదాము తనిఖీ చేసిన డిఆర్ఒ, ఆర్‌డిఒ

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను బుధవారం డిఆర్‌వో బి.వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.మహేశ్వర్‌తో పాటు రాజకీయ పార్టీప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సంధర్భంగా డిఆర్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలసంఘం మార్గ నిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవీఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవిఎం గదుల వివి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.మహేశ్వర్, కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బిజెపి ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, ఎంఐఎం ప్రతినిధి బర్కత్ అలీ, టిడిపి ప్రతినిధి కళ్యాడపు ఆగయ్య, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యోగా క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా క్రీడా పోటీలలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా క్రీడాకారులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. ఈనెల 9న రంగారెడ్డి జిల్లాలోని ఎస్ఎంపి అంతర్జాతీయ పాఠశాలలో తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్ క్రీడాకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచి 83 పాయింట్లతో ఓరల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఈ పోటీలో ఐదుగురు స్వర్ణ పథకాలు, నలుగురు రజత పథకాలు, నలుగురు కాంస్య పథకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయిలో సైతం జిల్లా క్రీడాకారులు పథకాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, కోశాధికారి స్వరూపచారి, కోచ్‌లు వి.కిష్టయ్య, పి.పి మల్లేశ్వరి, ఏ.ఆనంద్ కిషోర్ తదితరులున్నారు.

## సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బెజ్జంకి:** పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోకూడదని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎంఎల్ఏ డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.బుధవారం మండల పరిధిలోని ముత్తన్నపేట శివారులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.అనంతరం ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ పత్తి రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పత్తి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడకుండా ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు.సాంకేతిక విధానంతో రైతులు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకోవాలని అనంతరం యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు.పత్తి సేకరణ చెల్లింపులన్ని డిజిటల్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షించడానికి ఈ యాప్ ఉపయోగపడుతుందని అనాన్నారు.కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లా కలెక్టర్‌లకు ఆదేశించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పులి కృష్ణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,పార్టీ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి,నాయకులు బైర సంతోష్,గూడెల్లి శ్రీకాంత్,చెప్యాల శ్రీనివాస్,పులి సంతోష్,డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరులందరికీ సిపిఐ శతవసంత ఉత్సవం అంకితం

**ప్రజాపక్షం/చేర్యాల:** పీడిత తాడిత ప్రజల జీవితాలకు భరోసా కల్పించేందుకు దేశ స్వాతంత్ర్యాని కంటే ముందే ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ సభ డిసెంబర్ 26న ఖమ్మం కేంద్రంగా జరగనుందని ఈ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ పిలుపునిచ్చారు.శత జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత గడ్డపై కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి ఈ డిసెంబర్ 26వ తేదీ నాటికి వందేళ్లు పూర్తి అవుతుందని, భారత కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర సంగ్రామంలో బానిస సంకెళ్ళ నుండి భరత మాత విముక్తి కోసం కమ్యూనిస్టు కార్యకర్తలు అలుపెరుగని పోరాటాలు చేశారని అన్నారు.భగత్ సింగ్ లాంటి యువ కిషోరాలు నమ్మిన సిద్ధాంతం కోసం ఉరి కొయ్యలను ముద్దాడారని గుర్తుచేశారు.ఆనాటి నుండి నేటి వరకు పీడిత ప్రజల పక్షాన నిలబడింది ఎర్రజెండా నేనని, ఎర్రజెండాల పని అయిపోయిందని అవహేళణ చేసిన వారికి ఈ శతవసంత ఉత్సవాల బహిరంగ సభ ఒక గుణపాఠం కావాలని అన్నారు.40దేశాల నుండి కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు, మేధావులు కవులు, కళాకారుల, ఉత్సవ ముగింపు సభకు తరలివస్తున్నారని, 5లక్షల మందితో ఖమ్మం కేంద్రంలో జరిగే ఉత్సవాల ముగింపు సభ దేశానికే గర్వకారణం కానుందని, ఎర్రజెండా నీడలో అమరులైన ప్రతి ఒక్కరికి ఈ శతవసంత ఉత్సవం అంకితం కావాలని ఆకాంక్షించారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే శత ఉత్సవాలు ముగింపు బహిరంగా సభ జయపద్రం చేయాలని కోరుతూ ఈ నెల 17, 18న సిద్దిపేట టౌన్, కొహెడ, హుస్నాబాద్ ప్రాంతాలను సిపిఐ ప్రచార జాతర రానున్నట్లు ఈ జాతకు సీపీఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి, తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి మంద పవన్‌లు, హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, కత్తుల భాస్కర్‌రెడ్డి, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, గూడెపు సుదర్శన్, పొన్నబోయిన మహేందర్, ఆత్మకూరి హరిక్రిష్ణ, శ్రీరాం, మహేష్, సీతారాములు, ప్రేమ్ కుమార్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట కెవికెలో రైతు ప్రగతి రెండవ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు ప్రగతి ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం రెండవ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ సంద మహేందర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కెవికె ప్రధాన కార్యదర్శి పరిపాటి విజయ్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌పివోకు ఉన్న అవకాశాలను రైతులందరికీ తెలపాలని, రానున్న రోజుల్లో సభ్యత్వం పొందిన ప్రతి రైతుకు స్మార్ట్ కార్డు ద్వారా ఎఫ్‌పివోలో ఇన్‌పుట్ అందించాలన్నారు. డిజిటల్ మార్కెటింగ్ చేసి లాభాలు పొందాలని, సంస్థ అభివృద్ధిలో సంఘ సభ్యుందరూ భాగస్వాములు కావాలని కోరారు. హుజురాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకులు సునీత మాట్లాడుతూ ఎఫ్‌పివోలో ప్రస్తుతమున్న ఇన్‌పుట్ బిజినెస్‌తో పాటు అవుట్‌పుట్ బిజినెస్ చేసి లాభాలు పొందాలని, సలహాలు, సూచనల కోసం రైతులు సంప్రదించవచ్చని, అందుబాటులో ఉంటామని తెలిపారు. రైతు ప్రగతి ముఖ్య కార్యనిర్వహణాధికారి సాగర్ 2024 25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను మహాసభలో సభ్యులందరికీ తెలియజేశారు. కెవికె సీనియర్ శాస్త్రవేత్త ఎన్.వెంకటేశ్వర్ రావు,జమ్మికుంట మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, తదితరులున్నారు.

## బావిలో పడి యువకుడు మృతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప – సురేందర్ కుమారుడు విశ్వతేజ బందంపల్లి శివారు వ్యవసాయ బావిలో పడి బుధవారం మృతి చెందాడు. ఈతగాళ్ల సహాయంతో బావిలో గాలించి శవాన్ని బయటకు తీశారు. సంఘటన స్థలాన్ని పెద్దపల్లి పోలీసులు సందర్శించి శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి శవ పంచనామాకు తరలించారు. అయితే మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# 150 కోట్లతో అభివృద్ధి పనులు



### శరవేగంగా రాజన్న ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధి
### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజా పక్షం/వేములవాడ :** శరవేగంగా రాజన్న ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. 150 కోట్లతో వేములవాడ రాజన్న ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారుల నుంచి పురోగతి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయాభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన నిధులను మంజూరు చేశారని చెప్పారు. శృంగేరి జగద్గురు విధిశేఖర భారతి స్వామి సూచనల మేరకు ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఇటీవల స్వామి స్వయంగా వచ్చి ఆలయ పరిశీలన చేసి పలు సలహాలు, సూచనలు ఇచ్చారని గుర్తుచేశారు. ఆలయ నిర్మాణ పనుల కారణంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా భీమేశ్వర స్వామి ఆలయంలో ఆర్జిత సేవల కోసం తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. స్వామివారి కళ్యాణం, కోడే కుంకుమ పూజ, సత్యనారాయణ వ్రతం వంటి అన్ని సేవలు అక్కడ నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. రాజన్న ఆలయం ఎదుట ఉన్న రావిచెట్టు వద్ద భక్తులకు దర్శన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రజల, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయాభివృద్ధి జరుగుతోందని, అందరి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుంటున్నామని ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న భక్తులు, వేములవాడ ప్రజలు, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

## 17% లోపు తేమ వచ్చిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకుని రావాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17 % లోపు వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో సూచించారు.రైతులు వరి కోతల తర్వాత మంచిగా ధాన్యాన్ని ఆరబెట్టుకొని మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, పొలం నుండి నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావద్దని కలెక్టర్ కోరారు.17% లోపు ధాన్యంలో తేమ వచ్చేవరకు ఆరపెట్టుకోవాల్సి ఉంటుందని లేకపోతే ధాన్యం కాంటా ఆలస్యంగా 4 నుంచి 5 రోజుల తర్వాత జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం వేరే రైతులు తీసుకుని వస్తే మీ కంటే వెనుక వచ్చిన ఆరిన వడ్లను కంటా పెట్టడం జరుగుతుందని అన్నారు.మన తర్వాత వచ్చిన వారి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు బాధపడుతూ ఫిర్యాదు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని కలెక్టర్ తెలిపారు. రోజంతా ఆరబెట్టిన ధాన్యం పై రాత్రిపూట ప్లాస్టిక్ కవర్లు కప్పుకోవాలని. లేకపోతే, రాత్రి పూట ఆరిన ధాన్యం లో మరల తేమ శాతం పెరిగే అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు.రైతులు ఆరిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వస్తే అదే రోజు కాంటా వేసి సంబంధిత మిల్లులకు కూడా ధాన్యాన్ని తరలిస్తారని అన్నారు.రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది పడకుండా ఉండాలంటే ధాన్యాన్ని ఆర బెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని మనవి చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## మృతుడి కుటుంబానికి మంత్రి శ్రీధర్ బాబు పరామర్శ




**ప్రజాపక్షం/ముత్తారం:** మంథని మాజీ సర్పంచ్ వోడ్నాల శ్రీనివాస్ తండ్రి వోడ్నాల చిన్న మల్లయ్య గత కొద్ది రోజుల క్రితం మృతిచెందగా మృతుడి దశదినకర్మ కార్యక్రమం బుధవారం నిర్వహించగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొని మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఐటీ శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## ఆల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో ఘనంగా ఖేల్ ఉత్సవ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో ఘనంగా ఖేల్ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఇష్టమైన క్రీడలలో శిక్షణ ఇప్పించి నైపుణ్యం సాధించే విధంగా ప్రోత్సాహం అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపడేటువంటి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రాథమిక శిక్షణలో ఇచ్చిన ప్రోత్సాహాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీస్తున్నామని చెప్పారు. ప్రాథమికంగా పాఠశాల స్థాయిలో నిర్వహిం)టచిన పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వారు చెప్పారు. వార్షిక ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల క్రీడల పోటీలను నిర్వహించడం జరిగిందని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బాలల దినోత్సవాన్ని బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందని వారు చెప్పారు. ఉత్సవాలలో భాగంగా ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, నెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నిస్, చెస్ తదితర క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలి: ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కొత్త చెరువును ఇంచార్జి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. చెరువు కట్ట పైకి వెళ్లి, పరిసరాలు సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువు పరిసరాలు మొత్తం శుభ్రం చేయాలని, చెత్తాచెదారం, చెట్లు తొలగించాలని సూచించారు. ఇక్కడ అవసరమైన యంత్రాలు, సామగ్రిపై ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పట్టణ ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు.

**నిర్వహణ సక్రమంగా చేపట్టాలి..**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, ఆవరణ పరిసరాలు పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా చేపట్టాలని అన్నారు. కంపోస్ట్ షెడ్ ను పరిశీలించి కంపోస్ట్ తయారీ వివరాలను ఆరా తీశారు. డంపింగ్ యార్డుకు కావాల్సిన యంత్రాలు, పరికరాలకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

**రైతు బజార్ లోనే విక్రయాలు చేయాలి..**

సిరిసిల్ల పట్టణంలోని రైతు బజార్ లో చికెన్, మటన్, చేపలు, కూరగాయల విక్రయాలు పూర్తి స్థాయిలో ఇక్కడే చేసేలా ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కూరగాయల షెడ్ ను పరిశీలించారు. స్లాటర్ హౌస్ నిర్మించి, చికెన్, మటన్, చేపలు విక్రయాల పూర్తి స్థాయిలో చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరిశీలనలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీవీహెచ్‌ఓ రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్ల సహకారం

### కలెక్టర్ పమేలా సత్పతి




**ప్రజాపక్షం/కరీంనగర్:** ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు ఆయా శాఖల అధికారుల సమన్వయంతో బ్యాంకర్లు సహకరించాలని, కచ్చితంగా ఆర్‌బిఐ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో వివిధ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించిన రుణ లక్ష్య పురోగతిపై డిసిసి, డిఎల్ఆర్‌సి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకునే అంశంపై అవగాహన కల్పించాలని, జిల్లాలో వ్యవసాయశాఖతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2025 నుంచి సెప్టెంబర్ 2025 వరకు రూ.7821.19 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు గాను రూ.3239.73 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో రూ.1761.41 కోట్లు, విద్యారుణాలకు రూ.9.70 కోట్లు, హౌసింగ్ లోన్లు రూ.99.89 కోట్లు, మహిళా సంఘాలకు రూ.614.36 కోట్లు, ఇతర రంగాలకు సంబంధించి రూ.2096.10 కోట్లు రుణాలను మంజూరీ చేసినట్లు తెలిపారు. అర్హులైన రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు 58.22 శాతం లక్ష్యసాధన పూర్తయ్యిందని, పెండింగ్ రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో రుణాల రికవరీపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. జిల్లాలో ప్రధానమంత్రి స్వానిధి కింద మొదటి, రెండవ, మూడవసారి రుణం ధరఖాస్తు చేసుకున్న వారి పెండింగ్ ధరఖాస్తులను, పిఎంఈజిపి, పిఎం విశ్వకర్మ యోజన పథకాలకు సంబంధించి ధరఖాస్తులను సత్వరం క్లియర్ చేసి పరిష్కరించాలని బ్యాంకర్లకు సూచించారు. క్లెయ్ చేయని ఆర్థిక ఆస్తులకు హక్కుదారులు అవసరమైన పత్రాలతో తమ బ్యాంకులను, ఇతర సంస్థలను సంప్రదించి నిధులను తిరిగి పొందాలని, ఈ ప్రచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తానాజీ వాకడే, ఎల్‌డిఎం ఆంజనేయులు, జడ్పి సీఈవో శ్రీనివాస్, డిఆర్‌డివో శ్రీధర్, ఆర్‌బిఐ అధికారి శ్రీనివాస్, నాబార్డ్ డిడిఎం జయే ప్రకాష్, వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల కోసం పనిచేసే సంఘం ఐఎన్‌టియుసి



**ప్రజాపక్షం/రామగిరి:** సింగరేణి సెంటినరీ కాలనీలోని ఐఎన్టియుసి కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, జనక్ ప్రసాద్ నాయకత్వంలో ప్రభుత్వం సంస్థ సీ అండ్ ఎండి తో సమన్వయంతో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.మెడికల్ బోర్డు, పేరుమార్పు వంటి అంశాలు విజిలెన్స్ కారణంగా కొంత ఆలస్యం అవుతున్నా, కార్మికులకు నష్టం కలగకుండా రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ,రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కార దిశగా యజమాన్యంతో మాట్లాడడం జరిగిందని తెలిపారు.అలాగే కార్మికుల సొంత ఇంటి పథకం అమలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.సెంటినరీ కాలనీ నుండి గోదావరిఖనికి వెళ్లే రోడ్ సమస్యను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన శ్రీధర్ బాబు సింగరేణి అధికారులను ఆదేశించి సర్వే చేయించారు. రోడ్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని, నివాస గృహాలకు పెయింటింగ్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు.అయితే కొన్ని యూనియన్లు కార్మికుల కోసం పనిచేయకుండా, ధర్మాల పేరుతో కార్మికులను మోసం చేస్తున్నాయని కోట రవీందర్ రెడ్డి విమర్శించారు. ఇప్పటికైనా నిజాయితీగా కార్మికుల పక్షాన పోరాటం చేయాలని, లేనిపక్షంలో కార్మికులే వారికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి ఎల్లంకి రామరావు, సలహాదారులు జక్కుల దామోదర్ రావు, బ్రాంచ్ కార్యదర్శి నరెండ్ల శ్రీనివాస్, జిఎం కమిటీ సభ్యులు సాయి కృష్ణ, ఓసీ–1 వర్క్‌షాప్ పిట్ సెక్రటరీ సదానందం, ఏఎల్పీ పిట్ సెక్రటరీ కొమురయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సర్వన్, ఎండీ జుబేర్, ప్రేమ్ కుమార్, పాండు తదితరులు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## టెన్నిస్ కోర్ట్‌ను ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





**ప్రజాపక్షం/ముత్తారం:** మంథని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రూ.44 లక్షలు సిఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన టెన్నిస్ కోర్టును బుధవారం ఐటీ శాఖ, శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం టెన్నిస్ కోర్టు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లు ఆన్ చేసి క్రీడాకారులతో టెన్నిస్ ఆడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పిఈటిలు మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ కోయ శ్రీహర్షను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఆర్డిఓ సురేష్, ఎమ్మార్వో కుమారస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సింగల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, పిఈటిలు రవీందర్, శ్రీనివాస్, కృష్ణ, క్రీడాకారులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ విజయపరంపర కొనసాగింపు

### 'సుడా'త చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో సభ్యులంతా కాంగ్రెస్ వైపే నిలబడి నాయకులను గెలిపించారని, చైర్మన్ ఎన్నికతో అర్బన్ బ్యాంకు కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆర్అండ్‌బి అతిధిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎన్నికలలో భారీ మెజారిటీ కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే విజయపరంపర కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి వెళ్లి జూబ్లీహిల్స్ ఎన్నికలలో పనిచేసిన ప్రతి నాయకునికి, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామాలతో పాటు నగర ప్రజలు సైతం కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సంతృప్తితో ఉన్నారని, రాబోయే రోజుల్లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, లక్ష్మ ణ్‌కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంల సహకారంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలంతా రెట్టిపు ఉత్సాహంతో పనిచేస్తామని పేర్కొన్నారు. సుడా నిధులతో పలు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టామని తెలిపారు. రాజీవ్‌చౌక్ సుందరీకరణతో పాటు రాజీవ్‌గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ముందు కూడలి సుందరీకరణ చేస్తున్నామని తెలిపారు. ప్రధాన రహదారుల్లోని డ్రైనేజీలపై వర్టికల్ గార్డెన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో తాజ్, కొరివి అరుణ్ కుమార్, కుర్ర పోచయ్య, ఎండి చాంద్, అస్థపురం రమేష్, అనిల్ కుమార్, మిరాజ్, బషీర్, భారీ ఆంజనేయులు, అష్రఫ్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



## ముమ్మరంగా తనిఖీలు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని ప్రతి చోట తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు ప్రతి మండలంలో విస్తృతంగా డాగ్, బాంబు స్క్వాడ్‌తో బుధవారం ఉదయం నుంచి తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా వాహనాల రాకపోకలు, రద్దీగా ఉండే ప్రాంతాలు, బస్‌స్టాండ్‌లు, మార్కెట్‌లు, కలెక్టర్ కార్యాలయంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## రేషన్ వినియోగదారులకు సన్నబియ్యం బ్యాగ్‌ల పంపిణీ



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు బుధవారం సన్నబియ్యంతో పాటు జనపనారా చేతి సంచులు పంపిణీ చేయటం సంతోషకరమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి అన్నారు. ఒక్క రేషన్ కార్డుపై ఒకటి మాత్రమే పంపిణీ చేయనున్నారని, 25 కిలోల వరకు బియ్యం తీసుకెళ్లేలా వీటిని రూపొందించారన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రాంసన్, ధర్మయ్య, సుధాకర్, శ్రీనివాస్, సుమన్, రవి, నితిన్ పాల్గొన్నారు.



## మంత్రి చేతుల మీదుగా పత్తి కొనుగోళ్ల ప్రారంభం

**ప్రజాపక్షం/చెన్నూరు :** మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రాల్లోనే రైతులు పత్తి అమ్ముకోవాలని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. బుధవారం రోజున శివలింగపూర్ గ్రామంలోని జిఆర్ఆర్ పత్తి మిల్లులో పత్తి కొనుగోళ్లు ప్రారంభించి అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ప్రభుత్వం మేలురకం పత్తికి గాను 8వేల 1వంద రూపాయల మద్దతు ధర నిర్ణయించిందని, కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశించారు. అయితే సమీపంలోని అనుముల కుంట చెరువును చెన్నూరు పట్టణానికి చెందిన మంత్రి ముఖ్య అనుచరుడు దాదాపు రెండు ఎకరాల మేర ఆక్రమించి పత్తిమిల్లు నిర్మాణం చేపట్టాడని గత కొద్ది రోజుల క్రితం అధికారులు ధ్రువీకరించినప్పటికీ, నేటికీ చెరువు ఆక్రమణ వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు విమర్శలు గుప్పిస్తుండగా, నేడు స్వయంగా మంత్రే చెరువును చెరపట్టి అక్రమంగా నిర్మించిన పత్తిమిల్లులో కొనుగోళ్లు ప్రారంభించడంపై పలువురు వ్యక్తులు సామజిక మాధ్యమం వేదికగా అక్రమాన్ని గమనించారా మంత్రివర్యా అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.



## క్రీడలు గెలుపోటములు తట్టుకునే మానసిక ధైర్యాన్నిస్తాయి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మెండోరా మండల కేంద్రంలో మండల 69వ ఎస్‌జిఎఫ్ అంతర పాఠశాల క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని క్రీడాజ్యోతిని వెలిగించి మాట్లాడారు. నూతన మండలంగా ఏర్పడిన తర్వాత మొదటిసారి మండల స్థాయి క్రీడలను ఇంత గొప్పగా జరుపుకోవడం అభినందనీయమని, ఇంట్లో పండగలా ఈ క్రీడోత్సవాలను జరపడానికి కృషి చేస్తున్న అన్ని పాఠశాలల ఉపాధ్యాయ బృందం, పిఇటి బృందానికి అభినందనలు తెలిపారు. ఇప్పుడున్న కాలంలో డబ్బులుంటే పెళ్లి చేయటం చాలా సులువు కానీ, ఆర్థిక వనరులున్న అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి, క్రీడలను నిర్వహించి విజయవంతం చేయడం అంత సులువు కాదన్నారు. విద్యాసాగర్‌రెడ్డి, రాజ్‌కుమార్, మల్లేష్ లాంటి క్రీడా ప్రేమికులు ఉండటంతోనే ఇంకా క్రీడలు గొప్పగా నిర్వహిస్తున్నారన్నారు. ఇక్కడున్న క్రీడాభిమానులు జాతీయ స్థాయి క్రీడలు నిర్వహిస్తే నా సహాయ సహకారాలు సంపూర్ణంగా అందిస్తానన్నారు. మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమోంటో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డివైఎస్ఓ పవన్, విద్యాసాగర్‌రెడ్డి, ఎంఇఒ మల్లేష్, రాజకుమార్, శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు సీజ్

ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో కార్డెన్ సెర్చ్

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో తూప్రాన్ డిఎస్పీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 67 వాహనాలను సీజ్ చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, వాహనాలు నడిపే సమయంలో ధ్రువీకరణ పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చే ముందు వారి పూర్తి వివరాలు తెలుసుకొని వారికి సంబంధించిన ఆధార్ కార్డును ఇంటి యజమాని తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే లింకులను క్లిక్ చేసి ఫైబర్ నేరగాల చేతిలో మోసపోకుండా తగు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాలలో గంజాయి, డ్రగ్స్, అక్రమ రవాణా చేస్తే చట్టపురమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు రంగా కృష్ణ, జాన్ రెడ్డి, వెంకటరాజా గౌడ్, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్‌తో పాటు 10 మంది ఎస్ఐలు, 90 మంది కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.




## విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తూ నైపుణ్యాన్ని పెంపొందించుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలని డిసిసి అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాల 25వ వార్షికోత్సవ సందర్భంగా బుధవారం నిర్వహించిన ప్రైవేట్ పాఠశాలల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో గజ్వేల్ డివిజన్ పరిధిలోని 18 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ ఆరంభంలో తెలంగాణ ఉద్యమ కవి అందెశ్రీ మృతికి సంతాపంగా రెండు నిమిషాల మౌనం పాటించారు. పాఠశాల కరస్పాండెంట్ ఇన్నా రెడ్డి మాట్లాడుతూ సెయింట్ మేరీస్ పాఠశాల క్రమశిక్షణకు మారుపేరని, విద్యా పరంగా, క్రీడా పరంగా, సైన్స్ రంగాల్లో అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చామని తెలిపారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

## బీడీ సిగార్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశాల కరపత్రాల ఆవిష్కరణ

బీడీ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** బీడీ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు నవంబర్ 29, 30 తేదీలలో తెలంగాణ రాష్ట్రంలోని వేములవాడలో జరుగు జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. బుధవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో నవంబర్ 29, 30 తేదీలలో వేములవాడ పట్టణంలో జరిగే బీడీ సిగార్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశాల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. బీడీ రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి రాబోయే కాలంలో పోరాటాలను రూపకల్పన చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకి ప్రారంభ సూచికంగా 29వ తేదీన భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని ఈ ప్రదర్శన జిల్లాలోని బీడీ కార్మికులు, ప్యాకర్లు, బట్టివాల, గుమాస్తాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

**బీడీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు :** బీడీ కార్మికులకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన కూలీరేటు వెయ్యి బీడీలకు 300 రూపాయలు పెంచుతు అమలు చేయాలని, ఇతర కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యం ప్రతి కార్మికునికి కల్పించాలని, నెలకు 26 రోజుల పని కల్పించాలని, బీడీ పరిశ్రమపై జిఎస్‌టిని ఉపసంహరించుకోవాలని, తదితర డిమాండ్లపై జాతీయ కౌన్సిల్ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు టి.చక్రపాణి బీడీ సిగార్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రదాన కార్యదర్శి బానుచందర్, నాయకులు రేణుక, మహేశ్ పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీ కాంట్రాక్ట్ సిబ్బందికి తక్షణమే పెండింగ్ వేతనాలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ జిల్లా మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగులో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ సిబ్బందికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, ఇపిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ సిబ్బందికి కనీస వేతనం అమలు చేయకపోవడం వలన శ్రమ దోపిడీకి గురవుతున్నారని, అలాగే వారికి ఇపిఎఫ్ వివరాలు తెలియజేయడం, ఇఎస్‌ఐ కార్డులు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, ప్రతి నెల ఒకటో తేదీన బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం, గుర్తింపు కార్డులు, అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వాలని, మహిళా ఉద్యోగికి 240 రోజులు ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, కోశాధికారి నగేష్ స్థానిక మెడికల్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** ఏరియాలోని ఆర్‌కె 5 గనిలో కోల్ కట్టర్‌గా విధులు నిర్వహించిన శెనిగరపు క్రాంతి ఇటీవల కాలంలో మరణించడంతో తోటి కార్మికులు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. బుధవారం ఉద్యోగులు అందరూ కలసి రూ.1,30,000 మృతుడి పిల్లల పేరు మీద భారతీయ జీవిత బీమా సంస్థలో ఫిక్స్ చేశారు. కార్మికుడి మృతి పట్ల తోటి కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్‌కుమార్ ఝా, రక్షణ అధికారి శివయ్య, ఫిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగ రావు, మల్లేష్, రాజయ్య, చంద్రమౌళి, ప్రవీణ్, మల్లయ్య, జగదీష్, సురేందర్ పాల్గొన్నారు.



## పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** రైతు సంక్షేమంలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. బుధవారం జిల్లాలోని రెబ్బెన మండలం నారాయణపూర్, కొమురవెల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కొరకు 40 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, ట్యాబ్‌లు, టార్పాలిన్ కవర్లు సమకూర్చడం జరిగిందని, రైతుల కొరకు తాగు నీరు, నీడ, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతానికి స్పెషల్‌డ్రైవ్

కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనకు కృషి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, డబుల్ బెడ్‌రూమ్‌ల పంపిణీ ప్రక్రియపై కలెక్టర్ ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు, ఎంపీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సుధీర్ఘ సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారిగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని, వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని ఇళ్లు ఏ దశలో నిర్మాణంలో ఉన్నాయి, ఇప్పటివరకు గ్రౌండింగ్ జరగని ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులచే పనులు ప్రారంభించేలా చపట్టిన చర్యలు ఏమిటీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణంలో వెనుకంజలో ఉన్న ఆయా మండలాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ ఎందుకు పురోగతి సాధించడం లేదని నిలదీశారు. వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. తాను ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తానని, ఎప్పటికప్పుడు స్పష్టమైన పురోగతి కనిపించాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అంకిత్, హౌసింగ్ పీడీ పవన్‌కుమార్, ఈఈ నివర్తి, డీఈ గంగాధర్ పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ కాదు..ఇది ఫ్యామిలీ

నిర్మల్ భరోసా బంపర్ హిట్

విడాకుల ఫైల్‌కు బదులు.. కాపురంలో కొత్త వెలుగు

110 జంటలకు కలిపిన నిర్మల్ షీ టీమ్




**ప్రజాపక్షం/నిర్మల్ :** పోలీస్ స్టేషన్ అంటే ఫిర్యాదులు, అరెస్టులు, కేసుల నమోదు మాత్రమే కాదు..నిలిచిపోయిన కుటుంబ జీవితాలకు కొత్త వెలుగులు నింపే కౌన్సెలింగ్ సెంటర్ కూడా అని నిర్మల్ జిల్లా పోలీసులు నిరూపించారు. జిల్లాలో తొలి మహిళా ఎస్పీ అయిన డా.జి.జానకి షర్మిల(ఐపిఎస్)ప్రత్యేక చొరవతో ప్రారంభించిన భరోసా కేంద్రం ద్వారా ఇప్పటివరకు విడిపోయే దశలో ఉన్న 110 జంటలు తిరిగి కలిసిపోయాయి. మంగళవారం ఈ విజయాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని భరోసా కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. "నిర్మల్ పోలీస్ మీ పోలీస్'' అనే నినాదంతో మహిళల భద్రతకు భరోసానిస్తూ చిన్నచిన్న మనస్పర్ధలు, కుటుంబ కలహాలతో విడిపోతున్న భార్యాభర్తలను నిపుణులైన షీ టీమ్ సిబ్బంది ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించి, వారిని శాశ్వతంగా ఒకటి చేస్తున్నట్లు తెలిపారు. వీరి కృషి ఫలితంగానే విడాకులు తీసుకోవాల్సిన 110 జంటల మళ్లీ తమ దాంపత్య జీవితాన్ని మొదలుపెట్టాయని వెల్లడించారు.

**పోక్సో కేసులలోనూ ...** ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన పోక్సో, అత్యాచార కేసులలో కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు మొదలుకొని, చివరి వరకు అన్ని తానే వెన్నంటి ఉంటూ బాధిత మహిళలకు అండగా ఉంటుందని అన్నారు.

**బైంసా లోనూ సేవలు..గోప్యతకు హామీ**

ముధోల్, బైంసా వంటి మారుమూల ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం, బైంసా క్యాంప్ ఆఫీసులో ప్రతి బుధవారం షీ టీమ్ సిబ్బంది కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు. అలాగే, షీ టీం సభ్యులు విద్యార్థుల భద్రత,రక్షణ కొరకు పనిచేస్తున్నారని, ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురిచేసినా, సోషల్ మీడియాలో ఫోటోలను మార్చి వేధించినా, వారి వివరాలను షీ టీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా లాంటివి దృష్టికి వస్తే వెంటనే జిల్లా షీటీమ్ నెంబర్ 8712659550కు లేదా డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ముఖ్య అతిథి శ్రీవాణి చేతుల మీదుగా షీ టీమ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించి వారి సేవలను అభినందించారు.

## నిర్మల్ కోర్టులో విధులు బహిష్కరణ

పోలీసుల కక్ష సాధింపులను సహించేది లేదు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరు మలారెడ్డి




**ప్రజాపక్షం/నిర్మల్ :** పోక్సో కేసులో నిందితుడిని న్యాయస్థానం ముందు లొంగిపోయేందుకు (సరెండర్) తీసుకువస్తున్న న్యాయవాది కారుపై పోలీసులు అత్యుత్సాహం పేరుతో దౌర్జన్యం చేశారంటూ నిర్మల్ జిల్లా కేంద్రంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి తీవ్ర నిరసన చేపట్టారు. జిల్లా సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో పెద్ద సంఖ్యలో గుమిగూడిన లాయర్లు, పోలీసుల ఏకపక్ష వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సంఘటన జిల్లాలో ఉద్రిక్తతకు దారితీసింది.

**న్యాయవాది కారు ధ్వంసం, ఆరోపణలు**

న్యాయవాదుల కథనం ప్రకారం... పోలీసులు ఆ న్యాయవాది కారును బలవంతంగా అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కారును పూర్తి స్థాయిలో ధ్వంసం చేసి, అనంతరం దాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఆరోపించారు. అంతేకాక న్యాయవాదిపై దాడికి కూడా యత్నించినట్లు న్యాయవాదులు తెలిపారు. న్యాయవ్యవస్థలో పనిచేసే తమ పట్ల పోలీసులు ఇలా కక్షపూరిత వైఖరిని అవలంబించడం దారుణమని వారు మండిపడ్డారు. ఈ దౌర్జన్యపూరిత ఘటనపై నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరు మల్లారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు న్యాయవాదుల పట్ల కక్ష కట్టినట్లుగా వ్యవహరిస్తున్నారు. న్యాయం కోసం పోరాడే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ఈ విధంగా దారుణమైన చర్యలకు పాల్పడటం రాజ్యాంగ విరుద్ధం అని ఆయన పేర్కొన్నారు. కేవలం కారును ఆపి ప్రశ్నించకుండా, దానిని ధ్వంసం చేసి, న్యాయవాదిని భయభ్రాంతులకు గురిచేయడం చట్టవ్యతిరేక చర్య అని మల్లారెడ్డి స్పష్టం చేశారు. పోలీసుల కక్ష సాధింపులకు బార్ అసోసియేషన్ ఏమాత్రం సహించేది లేదు అని ఆయన ఉద్ఘాటించారు.

**న్యాయ వ్యవస్థ స్తంభన, బార్ అసోసియేషన్ హెచ్చరిక**

న్యాయవాదిపై దాడికి యత్నించిన పోలీసులపై ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు.పోలీసుల తీరుకు నిరసనగా, తమ విధులను సోమవారం వరకు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ ప్రకటించింది.ఈ సందర్భంగా అధ్యక్షుడు అల్లూరు మల్లరెడ్డి కీలక ప్రకటన చేశారు. పోలీసులపై క్రిమినల్ కేసు నమోదు చేసే వరకు విధుల బహిష్కరణ కొనసాగుతుందని ఆయన తేల్చిచెప్పారు. ఈ సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయవాదుల భద్రతకు భరోసా ఇవ్వకుంటే, తమ ఆందోళన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని,రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లు తమకు మద్దతు ఇవ్వాలని ఆయన హెచ్చరించారు.

**కోర్టుల వద్ద ఉద్రిక్త పరిస్థితి..**

న్యాయవాదుల ఈ ఆకస్మిక బంద్ కారణంగా, జిల్లా కేంద్రంలోని న్యాయస్థానాల వద్ద ప్రస్తుతం పనులన్నీ పూర్తిగా స్తంభించిపోయాయి. కేసుల విచారణ, వాదోపవాదాలు, పత్రాల సమర్పణ వంటి కోర్టు కార్యకలాపాలన్నీ ఆగిపోయాయి. వాయిదాలకు హాజరయ్యేందుకు వచ్చిన సాధారణ



## ట్రాఫిక్ పోలీస్‌ల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వద్ద బుధవారం ట్రాఫిక్ సిఐ చందర్ రాథోడ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ మాట్లాడుతూ... ఆటో యజమానులు తమ ఆటోలకి తప్పనిసరిగా పిట్‌నెస్ చేయించుకోవాలని సూచించారు. ఆటోలు నడిపే డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ప్రతి ఆటోకి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. లేని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మోటార్ వెహికిల్ యాక్ట్ 1988, 185 సెక్షన్ల గురించి ఆటో డ్రైవర్లకు వివరించారు. 2019ఆగస్టు నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ ఫైన్ మొదటిసారి పదివేల రూపాయాలు, రెండవ సారికి రూ. 15వేలు ఫైన్ విధించే నిబంధన రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిందన్నారు. కావున తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. తాగి వాహనాలు నడిపి పట్టుబడ్డ వారికి తప్పనిసరిగా జరిమానా విధించడంతో పాటు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, ఆటో యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# క్రీడ

## భారత్–దక్షిణాఫ్రికా టెస్టుకు
# భారీ భద్రత!



దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని ఎర్రకోట సమీపంలో కారులో బ్లాస్ట్ జరిగింది. ఈ ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. అయితే, ఈ నెల 14 నుంచి కోల్‌కతా వేదికగా భారత్‌దక్షిణాఫ్రికా జట్ల మధ్య టెస్టు మ్యాచ్ జరుగనున్నది. ఢిల్లీ ఘటన నేపథ్యంలో ఈడెన్ గార్డెన్స్, కోల్‌కతాలో భద్రతను కట్టుదిట్టం చేశారు. శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న టెస్టుకు ఆతిథ్యం ఇవ్వనున్న ఐకానిక్ స్టేడియంతో నగరంలోని కీలక ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మ పేర్కొన్నారు. తామంతా హై అలెర్ట్‌లో ఉన్నామని.. ఢిల్లీ పేలుడును దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక, అదనపు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

స్థానిక పోలీసులతో పాటు స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ను మోహరించనున్నారు. లాల్ బజార్‌లోని పోలీస్ వర్గాలు ఈడెన్ గార్డెన్స్ వద్ద మూడు అంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. స్టేడియం చుట్టూ, ఎంట్రీ గేట్స్, ప్రేక్షకుల స్టాండ్స్‌ను కవర్ చేయడంతో పాటు మైదానం చుట్టుపక్కల కదలికలను కఠినంగా పర్యవేక్షించనున్నారు. మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్‌హెల్ స్కానర్స్‌లను ఉపయోగించి ముమ్మరంగా తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. స్టేడియం లోపల, వెలుపల సాధారణ దుస్తులు ధరించిన పోలీసులు సిబ్బందిని మోహరిస్తామని.. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించి వేగంగా స్పందించనున్నట్లు అధికారులు చెప్పారు.

బ్యాగులు, నిషేధిత వస్తువులతో స్టేడియంలోపలికి అనుమతి ఉండదని పోలీసులు పేర్కొన్నారు. శాసనసభ, రాజ్‌భవన్, కోల్‌కతా హైకోర్టు, స్టేడియం దగ్గరగా ఉన్న ఆల్ ఇండియా రేడియో చుట్టూ భద్రతను సైతం పెంచారు. ప్రోటోకాల్స్ విషయంలో సమీక్ష చేసేందుకు బెంగాల్ క్రికెట్ అసోసియేషన్, సీనియర్ పోలీసు అధికారుల మధ్య సమావేశం జరిగింది. దాంతో పాటు భారత జట్టు, దక్షిణాఫ్రికా జట్లు బస చేసిన హోటల్స్ వద్ద సైతం నిఘాను పెంచారు. భారత కోచ్ గౌతమ్ గంభీర్ కాళీఘాట్ ఆలయానికి వెళ్లాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, ప్రస్తుతం ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో ఆలయ సందర్శన వాయిదా వేసినట్లు సమాచారం.

## ఐపిఎల్ వేలం..
## ఆటగాళ్ల ట్రేడ్ రూల్స్ తెలుసా?



ఐపిఎల్ 2026 మినీ వేలం సందడి మొదలైంది. ఈ సారి కూడా విదేశాల్లో ఆక్షన్ ఉంటుందని బిసిసిఐ వర్గాలు తెలిపాయి. అబుదాబిలో డిసెంబర్ 15 లేదా 16న వేలం ప్రక్రియ ఉండొచ్చు. 2023లో దుబాయ్‌లో, 2024లో జెడ్డాలో వేలం జరిగిన సంగతి తెలిసిందే. కొన్ని రోజుల నుంచి ప్రచారం జరుగుతున్నట్లుగానే రాజస్థాన్ రాయల్స్ నుంచి కెప్టెన్ సంజు శాంసన్ వీడటం ఖాయమైంది. రాజస్థాన్ అతడిని సీఎస్కేకు ట్రేడ్ చేస్తోంది. బదులుగా ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, సామ్ కరన్‌లను రాజస్థాన్ పొందనుంది. ఈ నేపథ్యంలో ఐపిఎల్‌లో ఆటగాళ్ల ట్రేడ్ రూల్స్ ఎలా ఉన్నాయి, ఈ ప్రక్రియ ఎలా సాగుతుంది అనే విషయాలను తెలుసుకుందాం.

- ఒక సీజన్ ముగిసిన నెలరోజుల తర్వాత ఐపిఎల్ ట్రేడ్ విండో (ఆటగాళ్లను మార్చుకునేందుకు వీలు) మొదలవుతుంది. ఇది తదుపరి వేలం వారం ముందు వరకు కొనసాగుతుంది.
- ట్రేడ్ విండో రెండు ఆప్షన్లు ఉంటాయి. ఒకటి (ప్లేయర్ ఫర్ క్యాష్) ఆటగాడిని ఇచ్చి డబ్బు పొందడం. మరోటి ప్లేయర్ టూ ప్లేయర్ (ఒక ఆటగాడిని మరొక ప్లేయర్‌ని తీసుకోవడం).
- జట్లు వారు పొందాలనుకునే ఆటగాడి కోసం బిసిసిఐకి ఆసక్తి వ్యక్తీకరణని పంపాలి. ఆటగాడిని అమ్మే టీమ్ ప్రతిస్పందించడానికి 48 గంటల సమయం ఉంది.
- ఆటగాడు కొత్త జట్టులో చేరడానికి సుముఖతను వ్యక్తం చేస్తూ సమ్మతి పత్రంపై సంతకం చేసిన తర్వాతే ప్లేయర్ ట్రేడ్ ప్రక్రియ మొదలవుతుంది.
- ఆటగాడి కోసం కొత్త ఫ్రాంఛైజీ ప్రస్తుతం ఉన్న ధర కంటే ఎక్కువ చెల్లించడానికి ముందుకు వస్తే ఆ మొత్తాన్ని ప్లేయర్, అమ్మే టీమ్ పంచుకుంటాయి.
- ఎంతమంది ఆటగాళ్లనైనా ఫ్రాంఛైజీలు ట్రేడ్ చేసుకోవచ్చు. ఇందుకు ఎలాంటి పరిమితి లేదు.
- ఫ్రాంఛైజీలు ట్రేడ్ చేసే ప్లేయర్లు కచ్చితంగా ఫిట్‌గా ఉండటంతో పాటు మ్యాచ్ ఆడేందుకు రెడీగా ఉండాలి.
- ఆటగాళ్ల ట్రేడ్‌లో ఏవైనా అవకతవకలు జరిగినట్లు బిసిసిఐ గుర్తిస్తే ఆ ట్రేడ్‌ని రద్దు చేసే అధికారం బోర్డుకు ఉంది.


## సౌతాఫ్రికాతో తొలి టెస్టు..
## ధ్రువ్ జురెల్‌కు గ్రీన్ సిగ్నల్



దక్షిణాఫ్రికాతో శుక్రవారం నుంచి కోల్‌కతాలో తొలి టెస్టు ప్రారంభంకానున్నది. అయితే ఆ టెస్టు మ్యాచ్‌లో మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ ఆడేది కన్ఫర్మ్ అయ్యింది. డొమెస్టిక్ క్రికెట్‌లో టాప్ ఫామ్‌లో ఉన్న ఆ బ్యాటర్‌కు ఛాన్సు ఇవ్వనున్నట్లు అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ దోసిచేట్ తెలిపారు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో ధ్రువ్ జురెల్‌కు చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ఆయన వెల్లడించారు. 24 ఏళ్ల జురెల్ ఇప్పటి వరకు ఇండియా తరపున ఏడు టెస్టులు ఆడాడు. అయితే గత అయిదు ఫస్ట్ క్లాస్ మ్యాచుల్లో నాలుగు సెంచరీలు చేశాడు. ఇటీవల బెంగళూరులో సౌతాఫ్రికా ఏతో జరిగిన మ్యాచుల్లోనూ రెండు సెంచరీలు చేశాడు. ప్రధాన వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ బరిలోకి దిగనున్నాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌లో రిషబ్ పంత్‌తో పాటు ధ్రువ్ జురెల్ కూడా ఉంటాడని అసిస్టెంట్ కోచ్ టెన్ దోసిచేట్ తెలిపారు. ఇద్దరికీ ఛాన్సు ఇవ్వాలన్న క్లారిటీతో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కోల్‌కతా టెస్టులో ధ్రువ్, రిషబ్ ఆడకుంటే ఆశ్చర్యమే అవుతుందన్నారు. ఏడాదిన్నర నుంచి అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న జురెల్ .. పరిణతిని ప్రదర్శిస్తున్నాడు. అతను ఆడిన చివరి అయిదు మ్యాచుల్లో 140, 56, 125, 44, 132 , 127 రన్స్ స్కోరు చేశాడు. జురెల్ కేవలం ప్రధాన బ్యాటర్‌గా మాత్రమే బరిలోకి దిగుతాడని, పంత్ కీపింగ్ బాధ్యతలు చేపడుతాడని అసిస్టెంట్ కోచ్ చెప్పాడు.

# ఫోకస్ చరిత్ర

## నాలుగు సామ్రాజ్యాలు..
## నాలుగు అంతస్థులు..



ఇస్తాంబుల్‌లోని ఫతీ జిల్లాలో ఉన్న ఓ నాలుగు అంతస్థుల భవనం ప్రపంచంలో మరే ఇతర భవనాలకు లేని ప్రత్యేకతను కలిగి ఉంది. అరుదైన గుర్తింపును సంపాదించింది. దీనిని 'నాలుగు అంతస్థుల చారిత్రక భవనం'గా పేర్కొంటారు. రోమన్, బైజెంటైన్ ఒట్టోమన్, టర్కిష్ గణతంత్రం అనే నాలుగు చారిత్రిక కాలాలకు చెందిన నిర్మాణ శైలులను ప్రతిబింబిస్తుంది. అంతేగాక, అనేక సామ్రాజ్యాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ నాలుగు అంతస్థుల భవనంలో మొత్తం 19 గదులు ఉన్నాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌కు రోమన్ సామ్రాజ్యం కాలంలో నిర్మించిన ఓ సిస్టర్న్‌కు 1,800 సంవత్సరాల చరిత్ర ఉంది. దానిపైన ఉన్న అంతస్థు బైజెంటైన్ కాలం నాటి నిర్మాణం. ఆపైన ఒట్టోమన్ సామ్రాజ్య కాలంలో (పురాతన నిర్మాణ శైలి). చివరిగా టర్కిష్ గణతంత్రం కాలంలో (నూతన నిర్మాణ శైలి) ప్రతిబింబిస్తుంది. వివిధ సామ్రాజ్య కాలాలను ఒకచోట నిలిపే ఈ నిర్మాణాన్ని చూసేందుకు పర్యాటకులు భారీగా తరలి వస్తుంటారు. సాధారణంగా, ఇలాంటి చారిత్రిక 'లేయర్' లేదా 'హోయుక్' రూపంలో ఉంటాయి. కానీ, ఇక్కడ అది భవనంగా కనిపిస్తుంది. అందుకే దీనిని పొరపాటుగా ప్రసిద్ధి చెందిన భవనంగా కొంతమంది అభివర్ణిస్తుంటారు. అయితే, ఈ విమర్శలను, అనుమానాలను పట్టించుకోని పర్యాటకులు ఇస్తాంబుల్ వస్తూనే ఉన్నారు. ఈ భవనాన్ని చూస్తూనే ఉన్నారు.

## 'కాహోకియా'లో
## గొప్ప వైద్యం!



అమెరికాలోని ఆధునిక సెయింట్ లూయిస్, మిసోరి సమీపంలోని కాహోకియా అనే పెద్ద నగరం క్రీస్తు శకం 1050 నుండి 1200 మధ్యకాలంలో ఉండేది. చరిత్రకారుల అధ్యయనాల ప్రకారం ఇక్కడ వేలాది మంది జనం నివసించేవారు. ఇక్కడి పెద్ద ఎత్తైన మట్టి టెంట్లు, విస్తారమైన వేదికల మధ్య, వైద్యులు ఉండేవారు. చాలా సందర్భాలలో వీరు బయటకు కనిపించేవారు కాదు. ఈ వైద్యులు వివిధ మొక్కలపై, ప్రత్యేకించి మొక్కజొన్నలపై విస్తారమైన పరిశోధనలు చేసి, అద్భుత పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నారు. స్థానిక మొక్కలలోని సుమారు 200 రకాల వైద్య లక్షణాలను గుర్తించారు. వాటిని ఉపయోగించి చికిత్సలు అందించారు. పురావస్తు ఆధారాలు, పురాతన పరికరాలపై మిగిలిన అవశేషాలు, వీరి ఉపయోగంలో వయిలోలు చర్మం (సలిసిలిక్ ఆమ్లం సహజ మూలం), కాన్ఫ్లవర్ (ఇచినాసియా) వంటి మొక్కలులను వైరస్ వ్యాధుల చికిత్సకు వినియోగించినట్లు తెలుస్తోంది. ఆ కాలంలో వైద్యులు కేవలం మందులు ఇవ్వడమే గాక, చిన్నచిన్న శస్త్రచికిత్సలు కూడా చేసేవారని అక్కడ లభించిన గుర్తులు స్పష్టం చేస్తున్నాయి. వీరు భౌతిక చికిత్సలతో పాటు ఆధ్యాత్మిక శ్రద్ధలు, విధులు నిర్వహించి, మిస్సిసిపియన్ సంస్కృతుల్లో సాధారణమైన ఆధ్యాత్మిక, శారీరక ఆరోగ్యం సమన్వయాన్ని సాధించారు. ఈ వైద్యులు కాహోకియా నగరంలో ప్రజారోగ్యాన్ని నిలుపుకునేందుకు ముఖ్యమైన పాత్ర పోషించారని, అటువంటి ఒక పరిణత వైద్య వ్యవస్థ యూరోపియన్ సంపర్కానికి ముందుగా ఉందని, వ్యాధులు, గాయాలను ఎదుర్కొనే సృజనాత్మకత, విచక్షణలో ప్రావీణ్యాన్ని చూపించేవారని రుజువు చేసే సాక్ష్యాలు ఇక్కడ లభించాయి.

## ఆకలి విలువ..





చరిత్ర మనకు ఎన్నో పాఠాలు నేర్పుతుంది. ఆహారాన్ని విచక్షణా రహితంగా పారవేసేవారికి ఈ ఫొటో కనువిప్పు కావాలి. 1931లో ఏర్పడిన మహా మాంద్యం కారణంగా అమెరికా ఆకలితో అల్లాడిపోయింది. న్యూయార్క్ నగరంలో ఒక చిన్న బ్రెడ్డు.. కప్పు పాల కోసం స్త్రీపురుష భేదం లేకుండా క్యూలో బారులు తీరి, తమ వంతు కోసం ఎదురుచూస్తున్న అన్నార్తులు వీరు. అక్కడ మంచుగాలి గుసగులాడుతుంటే, ఆకలితో కడుపు నకనకలాడుతున్న దృశ్యం కనిపిస్తుంది. ఒకప్పుడు ఎన్నో కలలు.. మరెన్నో ఆశలతో పరుగులు తీసిన కాళ్లు ఒక్కసారిగా 'బ్రెడ్‌లైన్స్'వైపు పరుగులు తీశాయి. ఒకరికొకరు తెలిసినా, తెలియకపోయినా, ఆకలి మాత్రం అందరినీ ఒకేలా పట్టిపీడించింది. అహం... గౌరవం.. ఆత్మాభిమానం వంటి పదాలకు అక్కడ అర్థం లేదు. సంపదల సింహాసనాలు కూలిపోయాయి. ఆకలి, బాధ కలగలసి, ఒకే క్యూలో నిలిచాయి. ఒక రొట్టె కోసం పడే తపన, జీవించాలనే వారి కోరికను వ్యక్తపరుస్తుంది. అందరిలోనూ ఆవేదన, అదే సమయంలో, భవిష్యత్తు మెరుగుపడుతుందనే ఓ చిన్ని ఆశ. ఈ క్యూలలో ప్రతి ముఖం ఒక గాథ. ప్రతి చూపు ఒక వ్యధ. ప్రతి వరుస, బతుకు పోరాటం. అంతటి కష్టంలోనూ, మనం ఒంటరివాళ్లం కాదని, ఆకలి అందరినీ ఒక్కటి చేసిందనే సంతృప్తి. ఒకరికోసం ఒకరు నిలబడి.. ఆకలి పంచుకున్న హృదయాలు అక్కడ ఆవిష్కృతమవుతున్నాయి. నాటి బాధను, ప్రజల కష్టాలను గుర్తు చేసుకుంటే, ఆహారం వృథా ఎంత ఘోరమో తెలుస్తుంది. నాటి పరిస్థితి నేటి సమాజానికి పాఠం నేర్పుతుంది.

## జోడేఘాట్ నుంచి బస్సు యాత్ర
### సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** జోడేఘాట్ నుంచి కొమురంభీం స్ఫూర్తితో ఈ నెల 15న సిపిఐ బస్సు యాత్ర ప్రారంభిస్తున్నట్లు సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బస్సు యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ స్వతంత్ర్య పోరాటంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో, రాష్ట్ర సాధనలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. రైతులు, కార్మికుల హక్కుల కోసం పార్టీ సాగించిన ఉద్యమాలను, భూస్వాముల నుండి లక్షల ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిన చరిత్రను ప్రస్తావించారు. ఈ నెల 15న కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్ నుంచి బస్సు యాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బస్సుయాత్ర ముగింపు సభను డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ముడుపు నళిని రెడ్డి, నాయకులు కుంటాల రాములు, కుమార్, బహబూబ్‌ఖాన్, సలీం, రమేష్, మెస్రం భీంరావు, సురేష్, ఎస్ అరుణ్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక, కర్షక, బడుగుల ఆశాజ్యోతి సిపిఐ : సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కార్మిక, కర్షకుల, పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సిపిఐ పార్టీ అని పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం శతాబ్ది ఉత్సవాల కరపత్రం ఆవిష్కరించి అనంతరం సదానందం మాట్లాడుతూ భారత గడ్డపై సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలో నేడు నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో బడుగు, బలహీనవర్గాల జీవన విధానం మరింత క్లిష్టతరంగా మారిందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో మైనార్టీలు, క్రిస్టియన్లకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచడానికి సిపిఐ అనేక పోరాటాలు చేస్తుందన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న జరిగే శతాబ్ది ఉత్సవాలకు పెద్దపెల్లి జిల్లా నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పూసాల రమేష్, పట్టణ కార్యదర్శి కల్లపల్లి నవీన్ కుమార్, చంద్రగిరి ఉదయ్, పేర్క సతీష్, మాచర్ల అంజి, తగరం నరేష్, సురేష్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడుతున్న రైస్‌మిల్లర్లపై చర్యలు
### సిపిఐ డిమాండ్
### కలెక్టరేట్ ఎదుట ధర్నా




**ప్రజాపక్షం/హనుమకొండ :** జిల్లాలో రైస్ మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారని, అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ రైస్ మిల్లర్లు రైతులను తరుగు, తాలు, రవాణా పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సంవత్సర కాలం నుంచి సిఎంఆర్ పెట్టకుండా అట్టి ధాన్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. జిల్లాలోని రైస్‌మిల్లులను నెలకోసారి పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామా ల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తరుగులేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులకు గన్నీ బ్యాగులను అవసరం మేరకు అందించాలని, సరిపడా లారీలను ఏర్పా టు చేసి రవాణా సమస్య రాకుండా చూడాలని, మొంథా వర్షాలకు దెబ్బతిన్న ధాన్యాన్ని కొను గోలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో పార్టీ నాయకులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మద్దెల ఎల్లేశ్, ఎదునూరి వెంకటరాజం, నేదునూరి రాజమౌళి, కర్రె లక్ష్మ ణ్, కొట్టేపాక రవి,మునిగాల బిక్షపతి, జక్కు రాజు గౌడ్, యేషబోయిన శ్రీనివాస్, అలువాల రాజు, రాజేందర్, దొమ్మాటి ప్రవీణ్, జూకంటి పద్మ, కొట్టె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### పాడి రైతులకు బిల్లులు చెల్లించకపోవడం బాధాకరం



**భువనగిరి రూరల్ :** నెలలు గడుస్తున్నా పాడి రైతులకు బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం రైతు సంఘం యాదాద్రి జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో రైతు సంఘం నాయకులు జక్కా దయాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా మదర్ డైరీ విజయ డైరీ 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు బిల్లులు చెల్లించాలని, లేనియెడల పాడి రైతులను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వరి ధాన్యాన్ని కేంద్రాలలో పోసి నెల గడిచిన తూకం వేయకపోవడంతో కల్లాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికీ 25 శా తం కూడా ధాన్యాన్ని తరలించలేదన్నారు. వర్షాలకు కల్లాల వద్ద ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారని, కొనుగోలు కేంద్రాలలో కాంటా లు వేగవంతం చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎకరాకు 15 క్వింటాళ్ల చొప్పున పత్తి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు ఎలగందుల అంజయ్య, పేర బోయిన బంగారు, తెడ్డు ఆంజనేయులు, పల్లె మల్లారెడ్డి, సంఘం గణేష్, భీమగాని గాలయ్య, దాసరి లక్ష్మ య్య తదితరులు పాల్గొన్నారు.




## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి
### ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ బొమ్మ దహనం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉగ్రవాదాన్ని కూకటి వెళ్లతో అంతమొందించాలని, ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఢిల్లీలో శాంతిభద్రతలు కేంద్ర హోం మంత్రిత్వశాఖ నియంత్రణ లో ఉన్నాయని చెప్పిన అమిత్‌షా ఇంతటి ఘోరం జరుగుతున్నా ఇంటిలిజెన్స్, నేషనల్ ఇంలిజెన్స్ ఏజెన్సీ తదితర విభాగాలు నిద్రావస్థలో ఉండటం శోచనీయమన్నారు.ఉగ్రదాడిలో మరణించిన వారికి కోటి రూపాయలు, గాయపడిన వారికి రూ. 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు పోటు పూర్ణ చందర్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, గోపి, ఉపేందర్, చరణ్ సాయి, ప్రణయ్, కుమార్, సలీం, ఇస్మాయిల్, అబీద్, సుమంత్, జాఫర్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



## వందేండ్ల వేడుకను ఉత్సాహభరితంగా జరుపుకుందాం
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు పిలుపు




**ప్రజాపక్షం/పాల్వంచ :** ఖమ్మం కేంద్రంగా డిసెంబర్ 26న జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ ను ఉత్సాహపూరిత, ఉల్లాస భరిత వాతావరణంలో జరుపుకొందామని, ఇందుకు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. పాల్వంచ పట్టణ పరిధి దివ్యాంగుల కాలనీలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మీకుమారి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ, మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యానికి ముందే కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) దేశ స్వతంత్ర సంగ్రామంలో తనదైన పాత్ర పోషించిందన్నారు. నాటి నుండి నేటి వరకు పేదలు, బడుగుబలహీన వర్గాలకు ఎర్రజెండా అండగా ఉందన్నారు. భారతగడ్డపై వందేండ్లు పూర్తి చేసుకున్న పార్టీ కేవలం భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటాలు చేసే పార్టీలను ఎన్నేండ్ల వరకైనా ప్రజలు ఆదరిస్తారని అందుకు సిపిఐ పార్టీయే నిదర్శనమన్నారు. ఖమ్మం కేంద్రంగా జరిగే శతవసంతాల ముగింపు సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు తరలిరానున్నారని, కవులు, కళాకారులు, మేధావులు ఈ వేడుకల్లో పాల్పంచుకొంటున్నారని తెలిపారు. జిల్లా నుండి 3000 మంది రెడ్‌షర్ట్ వలంటీర్లను కవాతు కోసం సిద్ధం చేస్తున్నామని, దీనికోసం జిల్లావ్యాప్తంగా 10 కేంద్రాలలో శిక్షణా శిభిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా మాట్లాడుతూ పార్టీ శాతాబ్ది వేడుకల ముగింపు సంధర్భంగా ఐదులక్షల మందితో భారీ జనసభ జరుగనుందని చెప్పారు. ముగింపు కార్యక్రమాన్ని పురష్కరించుకొని జిల్లావ్యాప్తంగా జీపు జాతాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. సిపిఐ చరిత్ర, పోరాటాలను తెలిపే విధంగా ఇంటింటి ప్రచారం, నిధి సమీకరణ సాగుతుందన్నారు. బహిరంగసభకు కార్మికులు, కర్షకులు, మేధావులు, వ్యాపార వర్గాలు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, రేసు ఎల్లయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, ఉప్పుశెట్టి రాహుల్, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, భూక్యా దస్రు, కమటం వెంకటేశ్వర్లు, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, ముచ్చా వెంకటేశ్వర్లు, అడ్డగర్ల తాతాజీ, ప్రజా సంఘాల జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## నెక్కొండలో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/నెక్కొండ:** శ్రీ చిన్మయ్ దేవి కాటన్ ట్రేడర్స్(దుర్గా కాటన్ ఇండస్ట్రీస్)లో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని, నెక్కొండ పరిధిలోని రెండు పత్తి మిల్లుల్లో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభమైందని, రైతులు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరను పొందేలా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి కృష్ణ మీనన్, కమిటీ సభ్యులు కొత్తపల్లి రత్నం, దొడ్డ విజయ్, తాళ్లూరి నర్సింహస్వామి, రైతులు, మార్కెట్ సిబ్బంది, సీసీఐ అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏఐటీయుసి నాయకుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/వరంగల్:** ఎంజిఎం హాస్పిటల్‌లో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏఐటీయుసి హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్, ఆల్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పంజేర్ల కుమారస్వామి యాదవ్ అన్నారు. వరంగల్ ఎంజిఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ హరిచంద్ర రెడ్డిని మర్యాదపూర్వకంగా ఎఐటియుసి నాయకులు బుధవారం కలిశారు. వారు మాట్లాడుతూ ఎంజిఎం హాస్పిటల్‌లో వైద్య సేవలు మరింత మెరుగు పరచడానికి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సిబ్బంది కృ షి చేయాలని ఆ శాభావం వ్యక్తం చేశారు. కార్మిక వర్గాల ఆరోగ్య సేవల కో సం హాస్పిటల్ అందించే సహకారానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. సూపరింటెండెంట్ హరిచంద్ర రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్య ప్ర జలకు, కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం

ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా జరపాలి; దళారులను నమ్మి మోసపోవద్దు : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అధికారులు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా జరపాలని, రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం మొగుళ్లపల్లి మండలం రంగాపురం, ఇస్సిపేట, మొగుళ్లపల్లి, మొట్లపల్లి గ్రామాల్లో ఐకెపి, పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాల్లో ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ నేతలతో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు కష్టపడి శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలని రైతులను ఎమ్మెల్యే కోరారు. రైతుల సంక్షేమమే సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎవరూ ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా జరపాలని సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.



**సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే గండ్ర**

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 20 మంది సిఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు రూ.5,08,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సిఎం సహాయ నిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు ఈ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని, బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సాదా బైనామా దరఖాస్తుల పరిశీలనలో వేగం

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మహదేవపూర్ తహసీల్దార్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం మహదేవపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిశీలనను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పాల్గొన్నారు. ఈ సమీక్ష సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించాలని సూచించారు. ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన పరిశీలన నివేదిక ఉండాలని తిరస్కరణ జరిగితే, సవివరమైన కారణాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, భూ సంబంధిత ప్రజా సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ తెలిపారు.తహసీల్దార్ రామారావు, నాయబ్ తహశీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు జరిపితే కఠిన చర్యలు




**ప్రజాపక్షం/ఆత్మకూరు :** హనుమకొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక ప్రచార కార్యక్రమం ఆత్మకూరు మండల కొత్తగట్టు గ్రామంలో నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం,బాలల సంరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పంచాయతీ సెక్రటరీ రాజు నాయకత్వం వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో బాల్యవివాహ నిరోధక చట్టం2006 వివరించడంతో పాటు, అలాంటి వివాహాలు జరగకుండా తల్లిదండ్రుల నుండి హామీ పత్రాలు స్వీకరించారు. బాల్యవివాహం చేస్తే ఏడాది జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని అధికారులు హెచ్చరించారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరగాలని సూచించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ఆడపిల్లల రక్షణపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ నసీంపర్వీన్, డిహెచ్ఇడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, బాలల పరిరక్షణ విభాగం ఔట్ టీచ్ వర్కర్ విజయ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ రమేష్, షేర్ ఎన్జీవో ప్రతినిధి జ్ఞానేశ్వరి, గురువులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సిపిఐ బస్సు యాత్రకు విరాళాలు



**ప్రజాపక్షం/ములుగు:** భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లాలో డిసెంబర్ 26వ తేదీన ములుగులో జరిగే సిపిఐ బస్సు యాత్రకు ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు, సబ్బండ వర్గాల ప్రజలు విరివిగా విరాళాలు అందించాలని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం ములుగులో సురేందర్ టీ స్టాల్ నుండి విరాళాలు ప్రారంభించారు. కావున ప్రజలందరూ మాకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వ రంగ ఉండాలని కోరుకునే పార్టీ అని, ప్రభుత్వ రంగ సంస్థలన్ని ప్రభుత్వం రంగంలో నడవాలని కోరుకునే పార్టీ అని, ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అవసరమైన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ, కావున ప్రజలందరూ విరాళాలు అందించి సహకరించాలని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ విజ్ఞప్తి చేశారు. ఈ విరాళాల కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండి అంజన్ పాషా, నాయకులు ముత్యాల రాజు, బండి నరసయ్య, గుంజే శ్రీనివాస్, మామిడి నటరాజ్, బుడిమె సదయ్య, మ్రరి స్వామి, తిరుపతి, రాంజీ, ధన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

బిసిలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజరేష్వన్ ఇవ్వాలి

## బిసి 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని ధర్మపోరాట దీక్ష



**ప్రజాపక్షం/గూడూరు;** బిసిలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచి పార్లమెంట్లో రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని బిసి జెఎసి చైర్మన్ చీర భిక్షపతి డిమాండ్ చేశారు.బుధవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో జెఎసి ఆధ్వర్యంలో నేడు జరగనున్న బిసిల ధర్మపోరాట దీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూబిసిలకు విద్యా ఉద్యోగ స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని అన్నారు.గురువారం అంబేద్కర్ ప్రాంగణంలో నిర్వహించ తలపెట్టిన బిసిల ధర్మపోరాట దిఒకు బిసి నాయకలు కుల సంఘాల నాయకలు వివిధ రాజకీయ పార్టీలు అందులో ఉన్న బిసి నాయకలు విద్యార్థి ఉద్యోగ సంఘాల నాయకలు సంబంధం పిసి ప్రజానీకమంతా పాల్గోని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో బిసి జెఎసి నాయకలు పేదకాసు కుమారస్వామి కట్ల విష్ణు ముక్తవరపు సత్యనారాయణ గుర్రపు యాకాంబరం నూకల ఉపేందర్ మాదాసు రమేష్ వల్లపు శ్రీనువాస్ పోతరాజు రవి తదితరులు పాల్గోన్నారు.

## విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహణ

ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** విద్యార్థి సం ఘాలకు ఎన్నికలు నిర్వహించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కా ర్యదర్శి బాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బస్టాండ్ ఏరియా క మిటీ విస్తృతస్థాయి సమావేశం ఆ ఏరియా ఇన్ చార్జ్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భాను ప్రసాద్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భం గా సంతోష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల లో, ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులను, వి ద్యార్థుల ప్రతిభను నిలువరిస్తూ ప్రభుత్వాలు పా లన కొనసాగిస్తున్నాయని, విద్యార్థి సంఘాలకు ఎన్నికల నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేంట ని, విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి విద్యార్థి సంఘాలలో పోటీ తత్వం, అంకితభావం, సేవా దృక్పథం, సామాజిక ,సాంస్కృతిక, రాజకీయ, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. కానీ పాలక ప్రభుత్వాలు అటు వైపు ఆ లోచించడం మానేశాయని, సంఘాలకు అస్తిత్వ ం పెరిగితే పాలకులను ప్రశ్నించేతత్వం పెరుగుతుందని, విద్యార్థులను విద్యార్థి సంఘాలను ఐక్యం కాకుండా నిలువరిస్తున్నాయని, ప్రభుత్వ ం వెంటనే విశ్వవిద్యాలయాలలో, ప్రభుత్వ వి ద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా... ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో ఫీజులు నియంత్ర ణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, ఫై ర్, ల్యాబ్, క్వాలిఫైడ్ లెక్చరర్స్, కనీస మౌలిక స దుపాయాలు లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మౌలిక స దుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు, బె స్ట్ అవలేబుల్, బకాయిలు, స్కాలర్షిప్ రియింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో విడుదల చేయాలని, ఆ ప్రభావం యాజమాన్యాల కంటే విద్యార్థులపై ఎక్కువ పడుతుందని, ప్రభుత్వం ఆలోచించి వి ద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ బస్టాండ్ ఏరియా కార్యదర్శి బొంత శ్రావణ్, ఉపాధ్యక్షులు , తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సేవ చేయడమే నిజమైన ఆనందం: యశస్విని రెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** ప్రజా సేవ చేయడమే నిజమైన ఆనందమని తమ కుటుంబం ఎల్లప్పుడు ప్రజలకు సేవ చేసేందుకు ముందుంటుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్‌లో శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ హనుమాండ్ల ఝాన్సి రాజేందర్‌రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పిసి సి ఉపాధ్యక్షురాలు, ట్రస్ట్ చైర్మన్ హనుమాండ్ల ఝాన్సిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవే నిజమైన ఆనందం మా కుటుంబం ఎల్లప్పుడు సేవా కార్యక్రమాల పట్ల అంకితభావంతో ఉంటుందన్నారు. ఆరోగ్య సేవలు అందించడంలో హెచ్‌ఆర్‌జేఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడు ముందంజలో ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ముందుకు వెళ్తున్నట్లు ఆమె తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, డాక్టర్ సిద్దార్థ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమారస్వామి, వైద్య బృందం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నివారణ పట్ల అవగాహన

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం / వరంగల్ :** మాదక ద్రవ్యాల నివారణ పట్ల అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అధికారులకు సూచించా రు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా నార్కోటిక్ కమిటీ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కాలేజీల, ప్రాంగణంలో విద్యార్థినీ విద్యార్థులకు మత్తు పదార్థాల విక్రయ దారులను కనిపెట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో స్ఫూర్తి కార్యక్రమంలో నార్కోటిక్ అధికారులను భాగంచే సి విద్యార్థిని విద్యార్థులకు అవేర్నెస్ కల్పించాలన్నారు. జిల్లాలోని ట్రస్పోర్ట్ శాఖలు రైల్వే , బస్సు స్టాండ్స్ ఏరియాలను తరచూ పోలీసులు పెట్రోలి ంగ్ చేసినట్లు అయితే మత్తు పదార్థాల నివారణ అరికట్టవచ్చున్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అ నునిత్యం మత్తు పదార్థాలు రవాణాలో పెట్రోలింగ్ చేయాలని ,స్కూల్స్‌కాలేజీల లోని కూడా తరచూ అవేర్నెస్ కల్పించాలని డిసిపి ఈస్ట్ జోన్ అధికారి అంకిత్ కుమార్ సక్వాల్ సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి వరంగల్ శుభం, నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎసిపి నరసయ్య, బి రమేష్ చందర్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ భరత్ కుమార్ సైకాలజిస్ట్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మారుమూల ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి విద్యాభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** మారుమూలు ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి విద్యాభివృద్ధికి పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం మహాదేవపూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ద్యుయల్ డెస్క్‌లు, ఆదివాసీ గిరిజన భవనంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు వయాట్రీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో కుట్టుమిషన్లు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో నూ కార్పొరేట్ స్థాయి విద్యా సౌకర్యాలను అందించేందుకు రా ష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కాటారం డివిజన్ పరిధిలోని 26 పాఠశాలలకు మొదటి విడతలో 226, రెండో విడతలో 56 డ్యూయల్ డెస్క్ లు అందచేసినట్లు తెలిపారు. తదుపరి ఆదివాసీ గిరిజన భవనంలో మహిళా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళల ఆర్థిక పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిర మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. సంఘాలు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు. నాలుగు నెలల తర్వాత ఇంపాక్ట్ స్టడీ నిర్వహించి నివేదిక సమర్పించాలని డిఆర్‌డిఒ ను ఆదేశించారు. సిఎస్ఆర్ నిధులతో డ్యూయల్ డెస్క్ లు, కుట్టుమిషన్లు అందించి వయాట్రీస్ ప్రతినిధి హనీష్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, డిఆర్‌డిఓబాలకృష్ణ, ఎంపిడిఒ రవీంద్రనాథ్, సిడిపిఒరాధిక, వయాట్రీస్ సంస్థ ప్రతినిధి హనీష్, సింగిల్ విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపిపి రాణి బాబు, మాజీ జెడ్‌పిటిసిఅరుణ, ఎంపిటిసి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు వినతి



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ మండల సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యాధికారి రాంధన్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి సభ్యుడు, మండల కార్యదర్శి సిపతి వినయ్ మాట్లాడుతూ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల కొరతతోపాటు ఖాళీగా ఉన్న సబ్జెక్టులకుగానూ ఉపాధ్యాయులను ఇప్పటివరకు నియమించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాల శుభ్రత కోసం శాశ్వత అటెండర్, స్కావెంజర్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, గ్రంథాలయాలు, నీటి సౌకర్యం లేని పాఠశాలల్లో తక్షణం మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు.అదేవిధంగా ప్రభుత్వ జిఒ నెంబర్ 42 ప్రకారం ఫీజుల నియంత్రణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్వాలిఫైడ్ టీచర్లు లేని పాఠశాలలు, ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సులను గుర్తించి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళ న పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్యం

వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** పేద, ధనిక అనే తేడా లేకుం డా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వ రంగల్ పార్లమెంట్ సభ్యులు డా కడియం కావ్య తెలిపా రు. బుధవారం జిల్లా కేంద్రం లోని వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు నిర్వహించిన వైట్ కోట్ సెర్మనీలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జి ల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ, తాను కూడా వైద్య వి ద్యనభ్యసించి 8 సంవత్సరాలు పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. వివిధ వ్యాధులతో బాధపడుతూ వైద్య సేవలకు మీ దగ్గరకు వ చ్చే ప్రజలకు ప్రేమతో వైద్య సేవలు అందించాలని తెలిపారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా నిలబడాలంటే ఎ న్నో ఆటుపోట్లను, సవాళ్ళను ఎదుర్కొవాల్సి వస్తుందని ధైర్యంగా ఎదుర్కొని మంచి వైద్యులుగా స్థిర పడాలని సూచించారు.ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మా ట్లాడుతూ వైద్య వృత్తిలో మంచి అనుభవాన్ని పొంది ప్రత్యేక వైద్యులుగా నిలవాలని తెలిపారు. సింగరేణి, కె టిపిపి సిఎస్ఆర్ నిధులు ఈ ప్రాంత విద్య, వైద్య రంగాలకు కేటాయించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రతి వైద్య విద్యార్థికి వైట్ కోర్టు రావడం అనేది ఒక మధురమైన అనుభూతి అన్నారు. బాగా చదివి మంచి వైద్యులుగా తయారై పేదలకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించా రు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వరావు, సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి, కెటిపిపిసిఇశ్రీ ప్రకాష్, వైద్య కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## వామపక్ష పార్టీలు ఏకమై పోరాటాలు సాగించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



**ప్రజాపక్షం/ తొర్రూరు :** దేశంలో కార్పొరేట్ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడటానికి వామపక్ష పార్టీలు ఏకమై పోరాటం సాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని లయన్స్ భవన్‌లో సిపిఐ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయసారథి మాట్లాడుతూ దేశంలో ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిత్యం ఉద్యమాలతో ముందుకు సాగుతోందన్నారు. అడవుల్లో మావోయిస్టులు సాయుధ పోరాట పంథాను వీడి కొత్త పంథాలు వామపక్షాలతో కలిసి పని చేయాలన్నారు. దేశం భానిసత్వంలో ఉన్నప్పుడు పీడిత, తాడిత ప్రజలకు దివిటిగా వారి జీవితాలను త్యాగం చేసి ఎన్నో విరోచిత పోరాటాలు జరిపి వాటికి నాయకత్వం వహించి అమరులైన వీరుల త్యాగాలతో శత వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. ఐదు లక్షల మందితో ఖమ్మంలో డిసెంబర్ 26న జరిగేసిపిఐశతాబ్ధి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల పండుగను కుటుంబ సభ్యులతో కలిసి బహిరంగ సభలో పాల్గొనాలని అన్నారు. సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించిందన్నారు. దేశ స్వాతంత్ర్యం పోరాటంలోనూ కీలకపాత్ర పోషించిందని చెప్పారు. రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మాజీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శులు గణపురం లక్ష్మ ణ్, పేరబోయిన కిరణ్‌కుమార్, ముద్దరబోయిన వెంకన్న, బూరుగు యాదగిరి, కోటగిరి యాకాంతం, గూడెల్లి ఎల్లయ్య, ఈశ్వరయ్య, బొల్లు శ్రీను, బొల్లు వెంకన్న, మంగళపల్లి మల్లయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలోని జూలూరుపాడు పోలీస్ స్టేషన్, సిఐ కార్యాలయాన్ని బుధవారం జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో లోని ప్రజలకు పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.డిఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐ శ్రీ లక్ష్మీ, ఎస్సై రవి, సిబ్బంది పాల్గొన్నారు.

## సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అర్హత పరిశీలన

### శ్రీచైతన్య విస్టా పాఠశాలను తనిఖీ కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఖమ్మం జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అర్హత పరిశీలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సైనిక్ స్కూల్ అర్హత పరిశీలనలో భాగంగా వెలుగుమట్లలోని శ్రీ చైతన్య విస్టా పాఠశాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం పరిశీలించారు.కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) మోడ్‌లో 100సైనిక్ స్కూళ్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందన్నారు. శ్రీచైతన్య విస్టా పాఠశా ల సైనిక్ స్కూల్ క్రింద దరఖాస్తు చేసుకోగా నేడు క్షేత్ర స్థాయి పాఠశాలను పరిశీలించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హత పరిశీలించి కమిటీ నిర్ణయం తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కోరుకోండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ఎస్ఎస్ శాస్త్రి, జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని, విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సిహెచ్ రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురం,వరంగల్‌క్రాస్‌రోడ్డుకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి ముంజూరైన చెక్కులను స్థానికి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బుధవారం అందజేశారు. ఐదు చెక్కులకు గాను బియ్యాల లింగరాజు రూ.60వేలు, పసుపులేటి నాగమణి రూ.60వేలు, మొహ్మద్ మహబూబ్ రూ.30వేలు, తోట నరసింహారావు రూ.55వేలు, సూత్రపు సుజాతకు రూ.22వేల500వందలు అనారోగ్య ఖర్చుల నిమిత్తం మంజూరయ్యాయి. ఈ చెక్కులను సదరు లబ్ధిదారులు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సాకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్‌తో లభించాయి. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, మున్సిపాలిటీ నాయకులు దండి రంగారావు, వెన్నం భాస్కర్, వెంపటి రాము, లగిశెట్టి రమేష్, రజబెల్లి, పాల్వాయి యోబు, యూసఫ్(హన్నే), యువజన సంఘం సభ్యులు మిరియాల నరణ్‌తేజ్, ప్రభాకర్, చింతల ఉదయ్, వెన్నం రిషి, సిపిఐ సోషల్‌మీడియా ఇంచార్జ్ రెబ్బగొండ్ల గోపి పాల్గొన్నారు.

## సిపిఐ నాయకురాలు భూక్య మారు మృతి

### నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం తనగంపాడుగ్రామ పంచాయతీపరిధిలోని గుండాలతండాకు చెందిన సిపిఐ నాయకురాలు భూక్య మారు(65) అనారోగ్యంతో బుధవారం ఇంటి వద్ద మృతి చెందింది. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పుచ్చకాయల కమలాకర్‌తో కలిసి మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉండగా..ఒక కుమారుడు భూక్య రవి సిపిఐ శాఖ సెక్రటరీగా కొనసాగుతున్నాడు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, స్థానికి నాయకులు పొడేటి అంజయ్య, భూక్య రవి, వీరన్న, అజ్మీర లక్క, ప్రసాద్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఈనెల 13న ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా ప్రదర్శనను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకెఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ అన్నారు. భారీ మొంథా తుఫాను మూలంగా పత్తి వరి మిర్చి మొక్కజొన్న ఇతర అపరాల పంటలు భారీగా దెబ్బతిని చేతికి వచ్చిన అన్ని రకాల పం టలు తడిసి మొలకలు వచ్చి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక రైతాంగం మొత్తం దిక్కుతోచని పరిస్థితిలో ఉందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఇంత వరకు తుఫాన్ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకెఎంఎస్ మండల నాయకులు రాంబాబు, వెంకన్న, లక్ష్మీ, బుజ్జమ్మ, రాంబాయి, పాల్గొన్నారు.

## అండర్ -17 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన ఎంజెపి కూసుమంచి విద్యార్థులు



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఈనెల 11వ తారీఖున ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్ 17 ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలలో మహాత్మ జ్యోతిబా పూలె కూసుమంచి గురుకుల విద్యార్థి జి అశోక్ 10వ తరగతి 800 మీటర్ల పరుగుపందెంలో 2వ స్థానం, బి జశ్వంత్ 9వ తరగతి 3కిమీ పరుగు పందెంలో 2వ స్థానం సాధించి ఈనెల 14న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను ఉమ్మడి జిల్లా బిసి గురుకులాల ఆర్సిఒ సిహెచ్ రాంబాబు, పాఠశాల ప్రిన్సిపల్ పేరబోయిన మల్లయ్య, ఏటిపి బి వెంకటేశ్వర్లు, డిప్యూటీ వార్డెన్ సిహెచ్ వెంకట నర్సయ్య, పిఈటి బి నర్సింహా, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# గురుకులాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

దానవాయిగూడెం గురుకులానికి

రూ. 3.80 కోట్లు మంజూరు

పనులను ప్రారంభించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ఖమ్మం :** దానవాయిగూడెం గురుకుల పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని దానవాయిగూడెంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల భవన మరమ్మతులను బుధవారం ఆయన ప్రారంభించారు. గతేడాది మున్నేరుకు వచ్చిన వరదల కారణంగా పాఠశాల మునిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గతేడాది వచ్చిన వరదల ఇబ్బందులను చూసిన తర్వాత భవిష్యత్తులో అటువంటి పరిస్థితులు ఎదురు కాకుండా మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మించడంతో పాటు జనరేటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. భూమిని సమతలంగా చేసి క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తామని పొంగులేటి తెలిపారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఇక్కడ మరిన్ని సదుపాయాలకు సంబంధించి నివేదిక అందజేయాలని అధికారులను కోరారు. విద్యార్థుల కోరిక మేరకు క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటును పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. పిఎస్ఆర్ ట్రస్టు నుంచి ఫర్నీచర్ పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని సూచించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా పౌర సంబంధాల అధికారి చందన్‌కుమార్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సహాయ నిధి చెక్కును అందించిన పొంగులేటి



అనారోగ్యంతో బాధపడుతున్న కూసుమంచి మండలం ధర్మాతండాకు చెందిన జర్పుల సింధుకు రూ. 1.75 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. గతంలో సింధు అనారోగ్యంతో బాధపడుతుండగా మంత్రి పరామర్శించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తామన్న వాగ్దానాన్ని చెక్కు అందించి నిలబెట్టుకున్నారు. మండల పరిధిలోని పలువురిని పరామర్శించారు. బానోత్ మంగ్యానాయక్, దరావత్ రామోజీ నాయక్, చేగొమ్మకు చెందిన వలికొండ శ్రీనివాస్ కుటుంబాలను పరామర్శించారు.

మంగలితండాలో విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 10లక్షల విలువ గల చెక్కులను అందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆపదలో ఉన్న వారిని అన్ని విధాలా ఆదుకుంటుందని ఆయన తెలిపారు.

# బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

### పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా ఖమ్మంను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిర్మూలనకై వంద రోజుల ప్రచార ఉద్యమ గోడ పత్రికను బుధవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహలు లేని తెలంగాణ లక్ష్యంలో భాగంగా ఖమ్మం జిల్లాను బాల్య వివాహ రహిత మొట్టమొదటి జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలన్నారు.ఎవరైనా బాల్య వివాహలు చేయడానికి ప్రయత్నించిన, సహకరించిన చట్టప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు. బాలల యొక్క సమస్యలపై 24 గంటలు పనిచేసే చైల్డ్‌లైన్ 1098కు ఫోన్ చేసి తెలపవచ్చునని తెలిపారు. జిల్లా బాలల సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, ఎయిడ్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ కె. శ్రీనివాస్, వి. రాజేష్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో చందునాయక్, ఉమెన్ హబ్ బాధ్యులు సమ్రీన్ తదితరులు పాల్గొన్నారు.



## సజావుగా పత్తి కొనుగోళ్లు

### కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మార్కెటింగ్ డైరెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి బాయి తెలిపారు. బుధవారం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి బాయి అధికారులతో కలిసి ఖమ్మం మార్కెట్ కమిటీ, మద్దులపల్లి మార్కెట్ కమిటీల పరిధిలోని సాయిబాలాజీ, జిఆర్ఆర్ జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేశారు. క్రయ విక్రయాల సమయంలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను డైరెక్టర్ పరిశీలించారు.అడిషనల్ డైరెక్టర్2 పురం రవికుమార్, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, సిసిఐ వర ప్రసాద్, అసిస్టెంట్ కార్యదర్శి వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 22న ఐఎఎల్ ఆధ్వర్యంలో ఎఐబిఇ నమూనా పరీక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** న్యాయవాదుల అర్హత కోసం త్వరలో జరగనున్న అఖిల భారత బార్ ఎగ్జామ్ (ఏఐబిఈ)లో ఉత్తీర్ణులు కావడానికి సాధనలో భాగంగా నమూనా పరీక్షను ఈనెల 22న మానేరు కళాశాల ఆఫ్ లా నందు నిర్వహిస్తున్నట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ (ఐఏఎల్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు తెలిపారు. బుధవారం కోర్టు ఆవరణలో ఏఐబిఈ మాక్ టెస్ట్ ఎన్‌రోల్‌మెంట్ కోసం ఆన్‌లైన్ లింకును విడుదల చేశారు. నూతనంగా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన వారు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయాలంటే ఏఐబిఈ పరీక్షలో ఉత్తీర్ణులు కావడం తప్పనిసరి అన్నారు. అందు కోసం ఆల్ ఇండియా బార్ అసోసియేషన్ ప్రతి ఏడాది రెండు సార్లు ఏఐబిఈ పరీక్షను నిర్వహిస్తుందని తెలిపారు. న్యాయవాద పట్టా పొందిన వారు రెండేళ్ల లోపు ఉత్తీర్ణులు కావాల్సి ఉందన్నారు. అత్యంత కఠినంగా ఉండే ఈ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలంటే కష్టతరమన్నారు. దీనిని సులభతరం చేయడానికి నమునా పరీక్షను ఖమ్మం జిల్లా కేంద్రంలోని మానేరు కళాశాల ఆఫ్ లా నందు ఈనెల 22న ఉదయం 10 గంటలకు నిర్వహించబడుతుందన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా లేదా ఫోన్ నెంబర్ 9100999344, 9700683404, 9959913729 ద్వారా కానీ నేరుగా కళాశాలకు వచ్చి ఉదయం 10 గంటల లోపు నమోదు చేసుకోవచ్చునని వారు తెలిపారు.



## 16న అభ్యుదయ రచయితల సమావేశం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 16న అభ్యుదయ రచయితల సంఘ సమావేశం ఏర్పాటు చేసినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తవుతున్న లక్షలాది మందితో బహిరంగ సభ, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గిరిప్రసాద్ భవన్‌లో జరిగే సమావేశానికి అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు కెవిఎల్, రౌతు రవి, శేషగిరి, సునంద తదితరులు పాల్గొంటారని అభ్యుదయ రచయితలు హాజరు కావాలన్నారు.

## దేశ ప్రగతికి యువతే ప్రాణం

**ప్రజాపక్షం/కారేపల్లి:** భారతదేశ అభివృద్ధికి, దేశ ప్రగతికి యువతే ప్రాణమని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌కే నాగుల్ పాషా అన్నారు. డివైఎఫ్ఐ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కారేపల్లి సినిమాలు సెంటర్‌లో ఏర్పాటు చేసిన నూతన జండా దిమ్మెను డివైఎఫ్: మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ ఆవిష్కరించి, ఆయన అధ్యక్షతన వహించిన సభలో ఎస్‌కే నాగుల్ పాషా మాట్లాడుతూ కులము మతము ప్రాంతము అనే బేధం లేకుండా యువతీ యువకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై 1980వ సంవత్సరంలో డివైఎఫ్ఐ ఏర్పడిందని, విప్లవ వీరులు స్వాతంత్ర పోరాట యోధులు చేగువేరా భగత్‌సింగ్ ఆశయాల సాధనే లక్ష్యంగా ఏర్పడిన నాటి నుండి విద్యా ఉపాధి కోసం పోరాడుతుందని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై డివైఎఫ్ఐ పోరాడుతుందని యువత అందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో డివైఎఫ్: రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్తెనపల్లి నరేష్, కొర్లపాటి రాజేష్, మిట్టగనుపుల సాంబ, గజ్జల సంపత్, ఆదేర్ల నాగరాజు, ఎస్‌కే సలీం, వాడపల్లి ఉపేందర్, కాకాటి పృథ్వీ, కాకాటి సాయి, హరి నాయక్, అహ్మద్ పాషా, శ్రీధర్, ఎన్ నరేష్, రావుల వెంకటేష్, తుమ్మల నాగేశ్వర రావు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిమెంట్ ద్వారానే మొక్కజొన్న సాగు

### ఎడిఎ కొంగర వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు అగ్రిమెంట్ ద్వారానే సాగు చేయాలని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రాములు తండా, రాంక్యాతండా, ఈర్లపుడి, చెరువుకొమ్ము తండా, మంచుకొండ గ్రామల్లో విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విత్తన మొక్కజొన్న సాగు విత్తన చట్ట పరిధిలో లేనందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు విత్తన కంపెనీ ద్వారా సీడ్ ఆర్గనైజర్లకు అగ్రిమెంట్ ఉందో లేదో పరిశీలించాలన్నారు. ఏ విత్తన కంపెనీ అగ్రిమెంట్ ద్వారా విత్తనాలు ఇస్తున్నారో రైతులు తెలుసుకోవాలన్నారు. ఆర్గనైజర్లు (కంపెనీ ప్రతినిధులు) నుంచి అగ్రిమెంట్ ద్వారా మాత్రమే విత్తన మొక్కజొన్న సాగు చేయాలని రైతులకు సూచించారు. అగ్రిమెంట్ లేకుండా ఏజెంట్ల మాటలు నమ్మి విత్తన మొక్కజొన్న సాగు చేస్తే నష్టపోయే అవకాశం ఉందన్నారు. రైతులను ఆకట్టుకునేందుకు ముందుగా ఎకరానికి కొంత నగదును ముట్టజెప్పి పంట పండిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడం జరుగుతుందన్నారు. రైతులు తప్పనిసరిగా అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే సాగు చేయాలన్నారు. రైతులు విత్తన సాగు చేసే సమయంలో కంపెనీ శాస్త్రవేత్తలు క్షేత్రాలను సందర్శించి సాంకేతిక సలహాలు అందించేలా ఏజెంట్లు వ్యవహరించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవోలు శిరణ్మయి, వేదవ్యాస్, ప్రతిభ, శ్రీకాంత్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



# మొదలైన కటింగ్‌ల మోత

తడిసిన ధాన్యాన్ని కొనేదెవరు.. ?

నష్టపోయిన రైతులను ఆదుకునేదెవరు.. ?

మొంథా తుపాన్ ఈ ఏడాది రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచింది

**ప్రజాపక్షం/ఖమ్మం :** హామీలు ఆచరణకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా రైతాంగ విషయంలో అమలు మరి ఘోరం. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అన్ని విధాలా ఆదుకుంటామనడం ఆ తర్వాత పట్టించుకోకపోవటం అలవాటుగా మారింది. మొంథా తుఫాన్ ఈ ఏడాది వరి సాగు చేసిన రైతులను తీవ్రంగా నష్టపరిచింది. వరి కోతకు వచ్చిన దశలో భారీ వర్షం రావటంతో గాలికి పైరు కిందపడింది. రెండు రోజులు కురిసిన వర్షాలకు ధాన్యం రంగు మారింది. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయటం లేదు. మీరు రైసు మిల్లర్లతో మాట్లాడుకుని మిల్లర్లు అంగీకరిస్తేనే తూకాలు వేస్తామంటూ తేల్చి చెబుతున్నారు. రైసు మిల్లర్లను కదిలిస్తే కోతలు అంటూ మొదలుపెడుతున్నారు. గతేడాది క్వింటాకు ఐదు కేజీల నుంచి పది కేజీల వరకు కోతలు విధించిన విషయం విధితమే. ఈ ఏడాది కూడా అదేవిధంగా కోతలు విధించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో మిల్లర్ల దోపిడీని అధికార యంత్రాంగం అడ్డుకోలేకపోయింది. ఇక ఈ ఏడాది తడిసిన ధాన్యం పేరుతో రైతులను మరింత దోపిడీ చేసే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లాల్లోనే తడిసిన ధాన్యం మిగిలిపోవడంతో రైతులు తడిసి రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



### పరిహారమేది..?

మొంథా తుఫాన్ ఈ ఏడాది రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచింది. ముఖ్యంగా వరి కోతకు వచ్చిన సమయంలో మొంథా తుఫాన్ రావడం భారీ వర్షంతో పాటు ఈదురు గాలులకు వరి నేలకొరిగింది. మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రకటించిన ప్రభుత్వం అధికారులచే పంట నష్ట సర్వేలను కూడా చేయించింది. కానీ ఇంత వరకు రైతులకు పరిహారం అందలేదు. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రతిసారి రైతులను ఆదుకుంటామంటూ అంచనాలు రూపొందించడంతోనే సరిపుచ్చుతున్నారు తప్ప పరిహారం అందించడం లేదు. పరిహారమన్న పదమే ఒక రకంగా పరిహాసమవుతుంది. ఇప్పటికైనా సర్వేలకు అనుగుణంగా తక్షణం పరిహారాన్ని అందించేవిధంగా తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### బోనస్ అందక ప్రైవేటుకు ధాన్యం

గతేడాది యాసంగిలో సాగు చేసిన ధాన్యానికి రైతులకు ఇంత వరకు బోనస్ రాలేదు. పదే పదే అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో ఈ దఫా ధాన్యం రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఎలాగో ధాన్యానికి బోనస్ రావడం లేదని భావిస్తున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు చాలా చోట్ల ధాన్యాన్ని తీసుకు రావడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనైతే ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతాన్ని పరీక్షించుకోవాల్సి వస్తుంది. తేమ శాతానికి అనుగుణంగా ఉంటేనే ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తుంది. ప్రైవేటు వ్యాపారులు పచ్చి ధాన్యాన్నే కొనుగోలు చేస్తుండడంతో ఇది లాభసాటిగా ఉందని రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నేలకొండపల్లి మొదలైన కొన్ని చోట్ల ప్రభుత్వ ధాన్యం కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

# రీల్



## '12ఎ రైల్వే కాలనీ' ట్రైలర్ లాంచ్

అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ '12ఎ రైల్వే కాలనీ' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పోలిమేర సిరీస్‌తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. తాజాగా లాంచ్ చేసిన 12ఎ రైల్వే కాలనీ ట్రైలర్ సినిమా టోన్, మెయిన్ కాన్ఫ్లిక్ట్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. మిస్టరీ మర్డర్స్ సిరీస్ చుట్టూ తిరిగే కథలో ప్రతి పాత్ర అనుమానాస్పదంగా కనిపిస్తుంది. ఈ ట్రైలర్ సస్పెన్స్‌ని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళింది. మూఢనమ్మకాలు, హీరోకి ఎదురైన భయానక అనుభవాలతో పాటు వాస్తవం – మానసిక భ్రమలు మరింత థ్రిల్ ని క్రియేట్ చేశాయి. దర్శకుడు నాని కాసరగడ్డ, డా.విశ్వనాథ్ రాసిన థ్రిల్లింగ్ కథను తెరపై సస్పెన్స్‌తో ప్రజెంట్ చేశారు. 21న విడుదల కానున్న ఈ సినిమా ఆడియన్స్ కి థ్రిల్లింగ్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది.
అల్లరి నరేష్ మాట్లాడుతూ..అందరికి నమస్కారం. నా సామి రంగ సక్సెస్ తర్వాత నిర్మాత శ్రీనివాస్ గారు నాతో మరో సినిమా చేయాలని అన్నారు. నచ్చిన కథ ఉంటే చూడమని చెప్పారు. తర్వాత మేము చాలా రకాల కథలు విన్నాము. తర్వాత అనిల్ దగ్గర మంచి కథ ఉందని చెప్పారు. నేను ఇప్పుడు వరకు చాలా జానర్స్ చేశాను కానీ ఇలాంటి థ్రిల్లర్స్ ఎప్పుడు చేయలేదు. ఫస్ట్ టైం ఇలాంటి జానర్ ట్రై చేస్తే బాగుంటుందనిపించిందన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ కామాక్షి, డైరెక్టర్ నాని, అనిల్, సంగీత దర్శకుడు భీమ్స్ పాల్గొన్నారు.

## 'మరి మరి' పాట ఆవిష్కరణ



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆరట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి 'మరి మరి..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఉమా వంగూరి లిరిక్స్ అందించిన ఈ పాటను సునీల్ కశ్యప్ కంపోజ్ చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ పాడారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే ' మరి మరి నిన్ను వెతికేలా, మరవదు ఓ క్షణమైనా, మనసంతా నీ తలపులే, ప్రతి చోటా నీ గురుతులే, వేచా గడిచిన నిన్నల్లో, వెతికా నడిచిన దారుల్లో, వెలుగే విడిచిన నీడల్లో, వదిలి వెళ్లిన జాడల్లో...'అంటూ ఎమోషనల్ గా సాగుతుందీ పాట.

## 'కొదమసింహం' రీ రిలీజ్ ట్రైలర్ లాంచ్



చిరంజీవి నటించిన కౌబాయ్ సినిమా ఇది. 1990, ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సాధించిన 'కొదమసింహం' సినిమాను ఈ నెల 21వ తేదీన 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వర రావు రీ రిలీజ్ చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా ద్వారా 'కొదమసింహం' రీ రిలీజ్ ట్రైలర్ లాంఛ్ చేశారు.

## 'గోపి గాళ్ళ గోవా ట్రిప్' ప్రీ రిలీజ్



రోహిత్, శశి దర్శకత్వం వహించిన గోపిగాళ్ల గోవా ట్రిప్. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న తరుణంలో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్కి డైరెక్టర్ రోహిత్ మమ, శశి, మ్యూజిక్ డైరెక్టర్ రవి నిడిమర్తి. ప్రొడ్యూసర్, నటుడు సాయికుమార్, రాజు శివరాత్రి, అజిత్ మోహన్, సాయి కుమార్, పవన్ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రోహిత్ అండ్ శశి మాట్లాడుతూ.. ఈ సినిమాకి మొత్తం ముగ్గురు ప్రొడ్యూసర్లు. ఐడియా చెప్పిన 15 రోజు షూటింగ్‌లో ఉన్నాం. గద్వాల్ డిస్ట్రిక్ట్ లోని ఒక రిమోట్ విలేజ్‌లో ఈ షూటింగ్ స్టార్ట్ అయింది. ఇది ఒక రకమైన రూట్ ఫిలిం. హైవే మీద ట్రావెల్ చేస్తూ గోవా దాకా రీచ్ మధ్యలో షూటింగ్ చేసాం ఎక్కడ పర్మిషన్ లు కూడా లేవు. సినిమా తొంభై శాతం సినిమా అవుట్ డోర్ లోనే ఉంటుంది. ఇది చాలా మెమొరబుల్ షూట్ చేశామని అన్నారు.

## ప్రభాస్ @23

### రాజాసాబ్ కొత్త పోస్టర్ విడుదల



భారతీయ సినిమా కీర్తిని కొత్త శిఖరాలకు చేరుస్తున్న రెబల్ స్టార్ ప్రభాస్ నట ప్రస్థానం నేటికి 23 ఏళ్లకు చేరుకుంది. ఈశ్వర్ సినిమాతో మొదలైన ప్రభాస్ సిల్వర్ స్క్రీన్ జర్నీ బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు క్రియేట్ చేస్తూ సక్సెస్ ఫుల్‌గా కొనసాగుతోంది. 'ఈశ్వర్' తర్వాత వరుసగా 'రాఘవేంద్ర', 'వర్షం', 'అడవిరాముడు', 'చక్రం', 'ఛత్రపతి', 'పౌర్ణమి', 'యోగి', 'మున్నా' 'బుజ్జిగాడు' 'బిల్లా', 'ఏక్‌నిరంజన్', 'డార్లింగ్', 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'రెబల్', 'మిర్చి' వరకు ప్రభాస్ జర్నీ ఒక ఫేజ్ అయితే బాహుబలితో ఆయన పాన్ ఇండియా జర్నీ బిగిన్ అయ్యింది. బాహుబలి రెండు చిత్రాల తర్వాత సాహో, సలార్, కల్కి 2898ఎడి సినిమాలతో దిగ్విజయంగా వరుస బ్లాక్ బస్టర్స్ అందుకుంటున్నాడు. ప్రభాస్ రెండు సార్లు(బాహుబలి 2, కల్కి 2898 ఎడి) వెయ్యి కోట్ల రూపాయల గ్రాస్ సినిమాలను ఖాతాలో వేసుకోవడం ఒక రేర్ రికార్డ్ ఓవర్‌సీస్ మార్కెట్‌లో పది మిలియన్లకుపైగా వసూళ్లను సాధించిన తొలి హీరోగా ప్రభాస్ నిలిచారు. ప్రభాస్ తొలి సినిమా ఈశ్వర్ 2022, నవంబర్ 11న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ రోజును రెబల్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్‌కు స్పెషల్ డేగా గుర్తుంచుకుంటారు. రెబల్ స్టార్ నట ప్రస్థానం 23 ఏళ్లకు చేరుకున్న సందర్భాన్ని సెలబ్రేట్ చేస్తూ ఆయన కొత్త సినిమా రాజా సాబ్ నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో అల్ట్రా స్టైలిష్ లుక్‌లో సరికొత్త మేకోవర్‌లో ప్రభాస్ ఆకట్టుకుంటున్నారు. ప్రభాస్ కెరీర్‌లో మరో ప్రెస్టీజియస్ మూవీగా తెరకెక్కుతున్న రాజా సాబ్ సినిమా వచ్చే సంక్రాంతి పండుగకు జనవరి 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మరోవైపు రెబల్ స్టార్ ప్రభాస్ భారీ పాన్ ఇండియా సినిమాలు లైనప్ చేసుకున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిలింస్ నిర్మిస్తున్న సలార్ 2, సందీప్ వంగా దర్శకత్వంలో టీ సిరీస్ నిర్మిస్తున్న స్పిరిట్, హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఫౌజీ ప్రభాస్ చేస్తున్న హ్యూజ్ ప్రాజెక్ట్స్. వీటితో పాటు వైజయంతీ మూవీస్ నిర్మాణంలో దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందించనున్న కల్కి 2 కూడా ప్రభాస్ లైనప్ లో ఉంది. ప్రభాస్ చేస్తున్న ఈ సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర సరికొత్త సంచలనాలు సృష్టించబోతున్నాయి.

## అది నా అదృష్టం

### భాగ్యశ్రీ బోర్సే



దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన పీరియాడికల్ డ్రామా 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. రానా, సముద్రఖని కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. 14న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా భాగ్యశ్రీ బోర్సే మీడియాతో చిట్ చాట్ చేశారు. కాంత నాకు చాలా స్పెషల్ ఫిల్మ్. ఫుల్ పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ ఉన్న క్యారెక్టర్. చాలా ఎక్సైటెడ్‌గా ఫీల్ అయ్యాను. న్యూ కమ్మర్‌కి ఇలాంటి క్యారెక్టర్ దొరకడం అదృష్టం. ఒక ఛాలెంజ్‌గా ఈ క్యారెక్టర్ ని తీసుకున్నాను. కుమారి క్యారెక్టర్‌కి ఏం కావాలో గ్రౌండ్ వర్క్ చేశాను. 1960 టైమ్స్‌ని రీక్రియేట్ చేయాలి. అది చాలా టఫ్ జాబ్. ఈ సినిమా కోసం పాత తెలుగు తమిళ్ సినిమాలు చూశాను. శ్రీదేవి, సావిత్రి నటన గమనించాను. వాటన్నిటినీ ఇన్స్పిరేషన్ గా తీసుకుని కుమారిని కొత్తగా రీక్రియేట్ చేయడం జరిగింది.కుమారి క్యారెక్టర్ చాలా అద్భుతంగా వచ్చింది. నేను ఫస్ట్ కాంత కథనే విన్నాను. అయితే కొన్ని కారణాలవల్ల ఈ సినిమా కాస్త ఆలస్యంగా మొదలైంది. ఆ గ్యాప్‌లో వేరే రెండు సినిమాలు చేయడం జరిగింది. టెక్నికల్‌గా నేను ఫస్ట్ సైన్ చేసిన కథ. ఇది నేను 2023లో విన్న కథ అప్పటి నుంచి మాకు జర్నీ ఉంది. డైరెక్టర్ సెల్వ కుమారి క్యారెక్టర్‌ని ఆయన రాసుకున్న విధానం నన్ను ఆశ్చర్యపరిచింది. చాలా అద్భుతంగా ఉంటుంది. కాంత, ఆంధ్ర కింగ్ వరుసగా వస్తున్నాయి. చాలా ఎక్సయిట్‌గా వుంది. నాకు యాక్షన్ రొమాన్స్ అన్ని జోన్స్ ఇష్టమే. అన్ని రకాల పాత్రలు చేయాలనే ఉంటుంది. ఒక ఆర్టిస్ట్‌కి లాంగ్వేజ్ బ్యారియర్ ఉండదు. మంచి స్క్రిప్టస్ ఉంటే చేస్తాను. అయితే నా ఫస్ట్ ప్రిఫరెన్స్ తెలుగు సినిమాకే. తెలుగు సినిమాలు, అలాగే హిందీ సినిమాలు ఉన్నాయి. కాంతలో సినిమాలో ఉంటుంది. ఆంధ్ర కింగ్ ఒక ఫ్యాన్ బయోపిక్. ఈ రెండు కూడా దేనికవే డిఫరెంట్ సినిమాలు. కాంతలో కుమారి క్యారెక్టర్‌కి ఆంధ్ర కింగ్‌లో మహాలక్ష్మి క్యారెక్టర్‌కి అసలు పోలికే ఉండదు. దేనికవే ప్రత్యేకమైన సినిమాలు అని భాగ్యశ్రీ పేర్కొంది.

## 'రోలుగుంట సూరి' ప్రీ రిలీజ్



విలేజ్ బాక్‌డ్రాప్‌లో రియలిస్టిక్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిన మూవీ 'రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరోహీరోయిన్లుగా తపస్వీ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై సౌమ్య చాందిని పల్లా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ హైదరాబాద్ తెలుగు ఫిలింఛాంబర్‌లో ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భాంగా దర్శకుడు అనిల్ కుమార్ పల్లా మాట్లాడుతూ.. ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ సినిమాపై ప్రశంసలు కురిపించారు. రియల్ స్టిక్ విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో సినిమాను అద్భుతంగా చేశారని అభినందించడం మా చిత్ర యూనిట్‌కు కొత్త ఎనర్జీ వచ్చింది. మ్యూజిక్ పై కూడా ఆయన ప్రశంసలు కురిపించారు. అలాగే ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ లాంచ్ చేసిన మా సినిమాలోని పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది. అనూప్ రూబెన్స్‌కు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాము. మా కృషిని, మా టీం టాలెంట్ను ఆయన ప్రత్యేకంగా అభినందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఖుషి డైరెక్టర్ శివ నిర్వాణ మా సినిమా టీమ్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## 21న తెలుగులో 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్లెస్'

వరల్డ్ వైడ్ గా సిల్వర్ స్క్రీన్ పై సెన్సేషనల్ క్రియేట్ చేసి, 2024 ఆస్కార్ అవార్డులకు నామినేట్ అయిన 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్లెస్'. మూవీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ట్రై లైట్ క్రియేషన్స్ నిర్మించిన ఈ మూవీని దివ్య వాణి సోషల్ కమ్యూనికేషన్స్ మద్దతుతో ఈ మూవీ నవంబర్ 21న తెలుగు వెర్షన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ తెలుగు ఫిలింఛాంబర్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒకప్పటి హీరో రాజా మాట్లాడుతూ ఒకప్పుడు నటుడుగా ఈ ఫిలిమ్ ఛాంబర్ కు వచ్చాను. ఇప్పుడు ఒక పాస్టర్‌గా వచ్చాను. క్షమాపణ అనేది అందరి వల్ల అయ్యేది కాదు. క్షమాపణ అనేది గొప్పది. రాణి మారియా త్యాగం గురించి సినిమా ఉంటుంది. ఈ సినిమా ను ప్రతీ ఒక్కరూ ప్రమోట్ చేయాలి. 123 అవార్డులు పొందిన సినిమా ఇది. ఆస్కార్‌కు కూడా ఎంట్రీ వచ్చిన సినిమా. నవంబర్ 21న విడుదలయ్యే ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.




# పర్యాటక ప్రదేశాలను దత్తత తీసుకోండి

## కార్పొరేట్ సంస్థలకు మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్: పర్యాటకం కేవలం ఆదాయ వనరు మాత్రమే కాదని.. వారసత్వం, ప్రాచీన సంస్కృతిని మన ముందు ఆవిష్కరిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటక ప్రదేశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని కార్పొరేట్ సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు. శిల్పకళావేదికలో బుధవారం నిర్వహించిన దక్షిణ భారత అతి పెద్ద సిఎస్ఆర్ సమ్మిట్ రెండో ఎడిషన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు మన రాష్ట్రానికి వస్తున్నారు. మన సంప్రదాయాలు, పండుగలు, హస్తకళలు, వంటకాలు ప్రపంచవ్యాప్తంగా పేరుపొందాయి. పర్యాటకం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతోంది. స్థానిక కళాకారులు, నేయకారులు, చిన్న వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు అని చెప్పారు. కార్పొరేట్ విజయాన్ని సామాజిక ప్రగతితో కలిపే వారధి సిఎస్ఆర్. వారసత్వ కట్టడాల సంరక్షణ, యువత నైపుణ్యాభివృద్ధి, సంప్రదాయ కళల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో ఇది కీలకంగా నిలుస్తుంది అని వివరించారు.అన్ని సంస్థలు ఒక్కో పర్యాటక ప్రదేశాన్ని దత్తత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఇది కేవలం ఆర్థిక సహకారం కాదు. బాధ్యతతో కూడిన భాగస్వామ్యం. ప్రభుత్వం కూడా దత్తత తీసుకున్న సంస్థలకు తగిన గుర్తింపు ఇస్తుంది అని చెప్పారు. ఈ సమ్మిట్‌లో 300కు పైగా కార్పొరేట్ సంస్థలు, 100 ఎన్‌జీఓలు పాల్గొనడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వినిల్ రెడ్డి నాయకత్వాన్ని ఆయన అభినందించారు. అలాగే 'బచ్పన్ బచావో' సంస్థను కమ్యూనిటీ పార్ట్‌నర్‌గా ఎంపిక చేసినందుకు ప్రశంసించారు.




# 14న ఎల్‌బి స్టేడియంలో 'అరైవ్ అలైవ్'

## పోస్టర్లను విడుదల చేసిన డిజిపి



ప్రజాపక్షం/హైదరాబాద్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఈనెల 14న ఎల్‌బిస్టేడియంలో భారీ స్థాయిలో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డి వెల్లడించారు. డిజిపి కార్యాలయంలో మంగళవారం ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు, వలంటీర్లలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిజిపి మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ ఆరైవ్ ఆలైవ్ పేరులో భారీ స్థాయిలో కార్యక్రమాన్ని హైదరాబాద్ లోని ఎల్‌బిస్టేడియంలో నిర్వహించనున్నామని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు జాగ్రత్తలు తెలియచెప్పేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ పట్ల అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేనున్నామన్నారు. దాదాపు పది వేలమంది హాజరుకానున్న ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాద బాధితులు సినీ పరిశ్రమకు చెందినవారు, ప్రజా ప్రతినిధులు కార్యక్రములో పాల్గొంటారని పేర్కొన్నాడు. డిసెంబర్, జనవరి నెలలో ఈ రకమైన ప్రజా చైతన్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామని తద్వారా రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తామన్నారు. త్వరలో పూర్తిస్థాయి కార్యావరణను రూపొందిస్తామని అన్ని వర్గాల ప్రజలను ఇందులో భాగస్వామ్యం చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా 'ఆరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా పోస్టర్లను డిజిపి విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఆదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్, పోలీస్ కమిషనర్లు ఎ.సి. సజ్జనార్, అవినాష్ మహాంతి, ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డేవిస్, మల్టిజోన్1 ఐజి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, రోడ్ సేఫ్టీ విభాగం ఎస్‌పిలు జి. సుదీష్, మనోహర్, వలంటీర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పొరపాటు చేయను

(మొదటి పేజీ తరువాయి)

విచారించిందని, దీంట్లో తన భాగస్వామ్యం లేదని చెప్పినట్లు ప్రకాశ్‌రాజ్ తెలిపారు. 2016లో ఇంకా బెట్టింగ్ మొదలు కాలేదని, ఓ గేమింగ్ యాప్ గురించి ప్రకటనలో మాత్రమే పాల్గొన్నట్లు చెప్పారు. ఆ తర్వాత బెట్టింగ్ అని తెలిసి ఆ యాడ్ నుంచి తప్పుకున్నానని గుర్తుచేశారు. అప్పుడే తన ఒప్పందాన్ని సైతం రద్దు చేసుకున్నట్లు చెప్పారు. తాను ఎలాంటి పేమెంట్ తీసుకోలేదని సిట్ అధికారులకు చెప్పినట్లు ప్రకాశ్‌రాజ్ మీడియాకు తెలిపారు. ఈ బెట్టింగ్ యాప్ కేసులో పలువురు ఫిర్యాదు చేయడంతో సిఐడి విచారణ కూడా జరిగిందని, 2017లోనే బెట్టింగ్ యాప్ బ్యాన్ జరిగిందని వెల్లడించారు. 2016లో ఇంకా బెట్టింగ్ మొదలు కాలేదని, గేమ్ అనుకుని యాడ్ చేశామని చెప్పానని తెలిపారు. ఆ తర్వాత బెట్టింగ్ యాప్‌గా రూపాంతరం చెందిందని తెలిసి ఆ యాడ్ కొనసాగించలేదని స్పష్టం చేశారు.

### క్షమాపణ కోరిన ప్రకాశ్‌రాజ్ :

ఇతర బెట్టింగ్ యాప్‌లకు ఏమైనా చేశారా? అని సిట్ అధికారులు అడిగితే లేదని చెప్పినట్లు ప్రకాశ్‌రాజ్ తెలిపారు. బెట్టింగ్ యాప్‌నకు సంబంధించి వివరాలు కూడా సమర్పించానని, బ్యాంకు ఖాతా వివరాలు ఇచ్చిన దాంట్లో ఏమీ లేదని అన్నారు. బెట్టింగ్ యాప్ వల్ల యువత జీవితాలు పాడై పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలిసి చేసినా తెలియక చేసినా తప్పే అవుతుందని, అందుకే దీనిపై క్షమాపణ కోరుతున్నట్లు అభ్యర్థించారు. ఈ విషయంలో తనను క్షమించాలని, భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు చేయబోనని స్పష్టం చేశారు.

## కొండా సురేఖ క్షమాపణలు (మొదటి పేజీ తరువాయి)

అర్థరాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఆమె ఈ ట్వీట్ చేయడం రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొంతకాలం క్రితం బిఆర్‌ఎస్ నేత కెటిఆర్‌ను విమర్శించే క్రమంలో కొండా సురేఖ... అక్కినేని నాగార్జున కుటుంబంపై, ముఖ్యంగా నాగచైతన్య, సమంత విడాకుల అంశంపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. కొండా సురేఖ వ్యాఖ్యలపై నటుడు నాగార్జున తీవ్రంగా స్పందించారు. ఆమెపై పరువు నష్టం దావా కూడా వేశారు. మరోవైపు నాగచైతన్య, సమంత సైతం తమ విడాకులు పరస్పర అంగీకారంతో తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని, తమ పేర్లను అనవసరంగా రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు కూడా సురేఖ వ్యాఖ్యలను ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే మంత్రి కొండా సురేఖ వెనక్కి తగ్గి క్షమాపణలు చెప్పినట్లు తెలుస్తోంది.

## నిరసన ప్రదర్శనలు (మొదటి పేజీ తరువాయి)

పార్టీ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో కోరింది. ''కులపరమైన అసమానతలతో కొట్టుమిట్టాడుతున్న మన సమాజంలో సామాజిక న్యాయాన్ని సాధించాల్సిన బాధ్యత పాలకులదేనని భారత రాజ్యాంగం చాలా స్పష్టంగా చెప్పింది, అదేవిధంగా దళితులు, మైనారిటీలకు వ్యతిరేకంగా జరిగే అక్రమాలను కూడా పాలకులే నివారించాలని పేర్కొంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా తదితర రాష్ట్రాలలో ఈ మధ్య దళితులకు వ్యతిరేకంగా అఘాయిత్యాలు జరిగాయి. ఉత్తర ప్రదేశ్‌లో భారత కమ్యూనిస్టుపార్టీ ఈ ఏడాది అక్టోబరు 16వ తేదీన ఒక నిరసన దినం కూడా పాటించింది. ఇలా జరుగుతున్న అఘాయిత్య సంఘటనలను పార్టీ జాతీయ కార్యదర్శివర్గం చాలా తీవ్రంగా పరిగణించింది. అందువల్ల నవంబరు 18వ తేదీ అంటే వచ్చే మంగళవారం దేశవ్యాప్తంగా సామాజిక న్యాయ దినంగా పాటించాలి. నిరుద్యోగం, సామాజిక న్యాయ స్ఫూర్తికి విరుద్ధంగా పెరుగుతున్న ప్రైవేటీకరణ కారణంగా అణగారిన వర్గాలకు తగ్గిపోతున్న రిజర్వు ఉద్యోగాలు, కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలవల్ల పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, ప్రభుత్వం చేస్తున్న తప్పులను నిరసన ప్రదర్శనల సందర్భంగా ప్రధానంగా ప్రజల ముందుకు తెచ్చి వివరించాలి'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో పేర్కొంది.

## ప్రతిభావంతులు లేరు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమన్న విషయాన్ని ఒప్పుకుంటూ కొన్ని రకాలైన నైపుణ్యం అమెరికాలో లేదని, అలాంటి నైపుణ్యాన్ని ప్రపంచం నలుమూలల నుండీ తెచ్చుకోవాల్సిందేననీ అంగీకరించారు. అదే సమయంలో అమెరికన్ నిరుద్యోగులు తమ నైపుణ్యం పెంచుకోవాలని, విదేశీ నైపుణ్యాన్ని వంటపట్టించుకునేందుకు వారి అనుభవ జ్ఞానం సంపాదించాలన్నారు. ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హెచ్–1బి వీసాలపై అడిగిన ప్రశ్నకు ట్రంప్ పైవిధంగా స్పందించారు. ''నిజమే, నేను అంగీకరిస్తాను, కానీ మీరు కూడా నైపుణ్యం గలవారినే తీసుకురావాలి'' అన్నారు. హెచ్–1 బి వీసాల జారీ మీ పాలనాయంత్రాంగానికి పెద్ద సమస్య కాకపోయినా, దేశీయంగా అమెరికన్లకు వేతనాలు పెంచాలంటే లక్షలాదిమంది విదేశీ కార్మికులతో దేశం నిండిపోకూడదని మీ ఉద్దేశమా? అని ఫాక్స్‌న్యూస్ ప్రతినిధి లారా ఇన్‌గ్రాహమ్ ప్రశ్నించినప్పుడు, ''లేదు, అలా కాదు, మన దగ్గర కొన్ని రకాల నైపుణ్యం లేదు, మన అమెరికన్లు ఆ నైపుణ్యాన్ని నేర్చుకోవాలి, నిరుద్యోగులుగా ఉన్నారు కదా అని ఎలాంటి శిక్షణా లేకపోయినా వారిని ఉద్యోగాల్లోకి తీసుకోలేం, నేను మిమ్మల్ని తీసుకెళ్ళి ఒక కర్మాగారంలో ఉద్యోగానికి పెడతాను, మనం క్షిపణులను తయారు చేయాలనుకుంటాం, కానీ ఆ నిరుద్యోగికి ఎలాంటి శిక్షణా లేనప్పుడు వారు అక్కడ ఎలా పనిచేయగలరు?'' అని ట్రంప్ ప్రశ్నించారు. జార్జియాలో ఒక కర్మాగారంలో పని విధానాన్ని ఆయన ఉదహరించారు. అక్కడ వారు అక్రమ వలస కార్మికులను పనిలో పెట్టుకున్నారు, వారంతా దక్షిణ కొరియా నుండి వచ్చారు, అక్రమ వలస కార్మికులే కావాలని వారు కోరుకున్నారు. ఎందుకంటే అక్కడ బ్యాటరీలు తయారు చేస్తున్నారు, జీవితాంతం వారు బ్యాటరీలనే తయారు చేస్తారు, మీకు తెలుసా, బ్యాటరీలు తయారు చేయడం చాలా కష్టమైన పని, అదంత సులభం కాదు, అది చాలా ప్రమాదకరం కూడా, చాలా పేలుళ్ళు జరుగుతాయి, చాలా చాలా సమస్యలుంటాయి, అవన్నీ ఎదుర్కోవాలి'' అన్నారు. వారంతా 500–600 మంది ఉంటారు, చిన్న ఉద్యోగులు, కానీ టెక్నాలజీ తెలిసినవారు ఆ పనులు ఎలా చేయ గలుగుతారు? కానీ వారు దేశం నుండి వెళ్ళిపోవాలనుకున్నారు, మనకూ అదే కావాలి, కానీ ఈ విషయంలో మనం ఏకీభవించం' అన్నారు.

ఏదైనా ఒకదేశం ఇక్కడికి వచ్చి ఒక కర్మాగారం పెడితే లేని నిరుద్యోగులను వారికి సరఫరా చేయలేం కదా? అన్నారు. ట్రంప్ యంత్రాంగం ఇంతకుముందు హెచ్–1 బి వీసాలపై ఉక్కుపాదం మోపాలని చూసింది. కొత్తగా దేశంలోకి వచ్చేవారు ఏకమొత్తగా ఒకేసారి లక్ష డాలర్లు చెల్లించాలని నిబంధన విధించింది. ఈ వీసాలపై అమెరికా వెళ్ళేవారిలో భారతీయులే ఎక్కువగా ఉన్నారు. ఈ ఏడాద సెప్టెంబరులో ట్రంప్ ఈ వీసాల విషయంలో సంస్కరణలు తెచ్చారు. గతవారంలో కార్మికశాఖ హెచ్–1 బి వీసాలను దుర్వినియోగం చేశారనే పేరుతో 175 కేసులపై దర్యాప్తు చేపట్టింది.

## దూసుకెళ్ళిన ఆదివాసీలు

(మొదటి పేజీ తరువాయి)

తలకు రంగు రంగుల పింఛాలు ధరించి తలుపులు బద్దలు కొట్టుకుని, మెటల్ డిటెక్టర్లను ఛేధించుకుని దూసుకువెళ్ళారు. ఐక్యరాజ్యసమితి భద్రతా దళాలు ఎదురువెళ్ళి వారిని అడ్డుకోవడంతో మొదట తోపులాట జరిగింది.'మా అడవులు అమ్మకానికి సిద్ధంగా లేవు, మా అడవులను మీకు అమ్మేది లేదు.. అని రాసి ఉన్న బ్యానర్లను దేశీయ ఆదివాసీ జాతుల ప్రజలు ప్రదర్శించారు. మరికొంతమంది టీ–షర్టులు ధరించి వచ్చారు. వారి టీ–షర్టులపై ''జుంటాస్'' అని రాసి ఉంది. ఆదివాసీ ప్రజలు సదస్సు లోపలికి దూసుకువచ్చి మా అడవులు అమ్మకానికి సిద్ధంగా లేవంటూ నినాదాలు చేశారు. వారిని బలవంతంగా బయటకు గెంటుకుంటూ వెళ్ళారు. వారిని ఎవరు రెచ్చగొట్టి ఈ సదస్సు దగ్గరకు తీసుకువచ్చారన్న విషయం వెల్లడికాలేదు. ఐతే చాలాసేపు నిరసన ప్రదర్శన, నినాదాలు చేసిన తర్వాత మెల్లిగా వారిని భద్రతా సిబ్బంది అక్కడి నుండి బయటకు పంపేశారు. ఈ ఘర్షణలో ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయని, సదస్సు ప్రాంగణానికి స్వల్పంగా నష్టం జరిగిందని ఐక్యరాజ్యసమితి వాతావరణ ప్రతినిధి ఒకరు చెప్పారు. వారిని ఎవరు ఈ విధంగా సదస్సులోకి వచ్చేట్టు చేశారు? దానికి బాధ్యులెవరనే విషయంపై తర్వాత అందరూ చర్చించారు. 'కనీసం ఇక్కడ ఇదైనా జరిగింది, స్థానిక జాతులవారు తమ అడవుల సంరక్షణ కోసం ఏదో రూపేణా ఇక్కడికి వచ్చారు' అని పనామా నుండి వచ్చిన వాతావరణ ప్రతినిధి జాన్ కార్లోస్ మాంటెర్రే గోమెజ్ అన్నారు. గ్లోబల్ యూత్ కొయిలేషన్‌కు చెందిన ప్రతినిధి అగస్టిన్ ఒకానా అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ.. 'మేం లేకుండా మా భవిష్యత్తును ఎవరూ నిర్దేశించలేరు'' అని వారు నినాదాలు చేశారని, వారికి ఈ సదస్సు గురించి మంచి సమాచారమే తెలిసిందని అన్నారు. ఆదివాసీలు, భద్రతా సిబ్బంది పరస్పరం పిడిగుద్దులు గుద్దుకున్నారని, కొందరికి రక్తం కారిందని ఆయన చెప్పారు. ''ఈ సదస్సు నిర్వహించడానికి ఎంతో ఖర్చు పెట్టి ఈ బెలాం కొత్త గ్రామాన్ని నిర్మించారు. భారీ ఎత్తున ఎంతో సామాగ్రి, ఎన్నో వనరులు సదస్సు ప్రాంగణానికి వస్తుంటే స్థానిక ఆదివాసీలు ఎందుకు చూస్తూ ఊరుకుంటారు? ఈ ధనాన్ని అంతా కూడవేస్తే వారి విద్యావైద్యాలకు ఖర్చు చేయడానికి వీలు పడుతుంది, అందుకే వారు సదస్సు ప్రాంగణంలోకి దూసుకువచ్చారు, దేశీ ఆదివాసీ ప్రజలు విసిగిపోయి ఉన్నారు, వారికి వనరులు, సదుపాయాలు లేవు, వారికేమీ తెలియదు, వారు అమెజాన్ నదీ తీరంలో ఉన్న తమ భూమిని కాపాడుకోవాలని భావించారు'' అని అగస్టిన్ ఒకానా అన్నారు.తర్వాత ఐక్యరాజ్యసమితి సభ్యుడు మాట్లాడుతూ... బ్రెజిల్, ఐక్యరాజ్యసమితి భద్రతా సిబ్బంది రక్షణ బాధ్యత వహించాలని, ఈ ఘటనపై దర్యాప్తు చేయాలన్నారు.

### ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీలకు నియంత్రించాల్సిందే

గతంవలే కాకుండా ఈసారి బ్రెజిల్ ప్రభుత్వం వీధుల్లో నిరసన ప్రదర్శనలు చేసేవారిని, పౌర సమాజాన్ని కూడా ఈ కాప్ –30 సదస్సులో క్రియాశీల పాత్ర పోషించాలంటూ ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రోత్సాహం కారణంగా సదస్సు ప్రాంగణంలో రోజుకు నాలుగు రకాల కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక రేపు వంద పడవలలో అనేకమంది దేశీయ జాతులకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు రానున్నారు. 200 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సులో జరిగే చర్చల్లో పాల్గొంటున్నారు. ఈనెల 10వ తేదీన ప్రారంభమైన సదస్సు సమావేశాలు 21వ తేదీ వరకూ కొనసాగుతాయి. పారిస్‌లో దేశాలమధ్య ఒప్పందం కుదిరిన పది సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతున్నది. ఈసారి కార్యాచరణకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, భూమి ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు ఎట్టిపరిస్థితుల్లోనూ తగ్గించేందుకు ప్రతి దేశం ఆచరణాత్మక చర్యలు తీసుకునేట్టు అందరూ పూనుకోవాలనే పట్టుదల బ్రెజిల్ ప్రదర్శిస్తున్నది. మొదటిసారి బ్రెజిల్‌లోని అమెజాన్ రెయిన్ ఫారెస్టు ప్రాంతంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన 3000 మంది దేశీయ జాతుల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారని బ్రెజిల్ మంత్రి సోనియా గుజజారా చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com